



# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు


**ఏపీ పర్యాటక శాఖకు గ్లోబల్ టూరిజం అవార్డు**
- ఢిల్లీలో అందుకున్న రాష్ట్ర ప్రతినిధి నిషితా గోయల్

5

# భారత్‌కు ఏపీ తలమానికం!




ఢిల్లీలో సీఐఐ భాగస్వామ్య సదస్సు కర్టెన్ రైజర్ కార్యక్రమంలో ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు ఉన్న అపారమైన అవకాశాలను వివరిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు. అనంతరం పలు దేశాల వ్యాపారవేత్తలతో సంభాషించారు.

- వివిధ రంగాల్లో పెట్టుబడులకు విస్తృతమైన అవకాశాలు
- పెట్టుబడులను ఆకర్షించడంలో మాకు ట్రాక్ రికార్డు ఉంది
- రాష్ట్రాన్ని సందర్శించిన తరువాతే.. నిర్ణయం తీసుకోండి
- 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' ఇప్పుడు మా విధానం..
- పారిశ్రామిక మౌలికసదుపాయాల కల్పనలో ముందున్నాం
- 'సంపద సృష్టి'కి అనుగుణంగా ఏపీని తీర్చిదిద్దుతున్నాం
- విశాఖలో నిర్వహించే భాగస్వామ్య సదస్సుకు తరలిరండి..
- పారిశ్రామికవేత్తలు, రాయబారులకు సీఎం చంద్రబాబు పిలుపు
- సీఐఐ పార్టనర్షిప్ కర్టెన్ రైజర్‌లో ప్రసంగించిన సీఎం చంద్రబాబు

2



## 'పూర్వోదయ' నిధులివ్వండి


- వెనుకబడిన ప్రాంతాల ఆర్థికాభివృద్ధికి ఆ నిధులే కీలకం
- ఢిల్లీలో కేంద్ర ఆర్థిక మంత్రికి సీఎం చంద్రబాబు వినతి
- జలవనరుల మంత్రి పాటిల్‌తోనూ సమావేశం

3



ఏపీ అభివృద్ధికి సంబంధించిన విషయాలను చర్చించేందుకు న్యూఢిల్లీలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను కలిశాను. పూర్వోదయ పథకం కింద మద్దతు కోరాను. దీని ద్వారా రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలలో ఆర్థిక వృద్ధిని బలోపేతం చేయడానికి, సమగ్ర అభివృద్ధిని సాధించడానికి మేము ప్రణాళికలు వేస్తున్నాము.

– సీఎం చంద్రబాబు



## ప్రజల్లోకి వెళ్లండి!

- సమర్థ, అసమర్థ పాలనమధ్య తేడాను వివరించండి
- గత ప్రభుత్వం ట్రూఅప్ పెట్టింది.. మనం ట్రూడౌన్ తెచ్చాం
- జీఎస్టీ సంస్కరణల ఫలితాలు ప్రజలకు వివరించండి
- మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలతో సీఎం టెలీకాన్ఫరెన్స్

3

### ఏరోస్పేస్ దిగ్గజం ఎయిర్‌బస్ కోసం..

## రంగంలోకి మంత్రి లోకేష్

- ఢిల్లీలో ఎయిర్‌బస్ పూర్తిస్థాయి బోర్డుతో సమావేశం
- రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలని ఆహ్వానం
- ప్రపంచస్థాయి ఏరోస్పేస్ తయారీ కేంద్రం ఏర్పాటుకు ప్రతిపాదన
- రాష్ట్రంలో పెట్టుబడుల అనుకూల వాతావరణాన్ని వివరించిన మంత్రి
- యూనిట్ ఏర్పాటుకు పూర్తిగా సహకరిస్తామని హామీ

4



దిగ్గజ సంస్థలు ఏవైనా ఇండియాలో పెట్టుబడులు పెట్టాలన్న ఆలోచనలో ఉన్నాయని తెలిసిన వెంటనే మంత్రి నారా లోకేష్ రంగంలోకి దిగిపోతున్నారు. తాజాగా ప్రపంచ నెంబర్ వన్ విమానాల తయారీ సంస్థ ఎయిర్ బస్ ఇండియాలో పెట్టుబడుల అంశాలను పరిశీలించడానికి దేశానికి వచ్చింది. ఆ కంపెనీ చైర్మన్ సహా బోర్డు సభ్యులంతా వచ్చారు. ఈ విషయం తెలుసుకున్న మంత్రి లోకేష్ వెంటనే ప్రత్యేకంగా ఢిల్లీ వెళ్లి వారిని కలిసి రాష్ట్రంలోని పెట్టుబడుల అనుకూల వాతావరణం, భూముల లభ్యత గురించి వివరించారు. సింగిల్ విండో విధానంలో వేగవంతమైన అనుమతులకు హామీ ఇచ్చారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలని ఆహ్వానించారు. ఏరోస్పేస్ దిగ్గజం ఎయిర్ బస్‌తో సంప్రదింపులు జరపడం ద్వారా ఆంధ్రప్రదేశ్‌ను అంతర్జాతీయ ఏరోస్పేస్ పటంలో సమున్నతంగా నిలబెట్టాలనే ప్రభుత్వ దృఢ సంకల్పాన్ని మంత్రి లోకేష్ చాటిచెప్పారు.

## ఏపీలో పెట్టుబడులు పెట్టండి

- దక్షిణ కొరియా కంపెనీలకు మంత్రుల ఆహ్వానం
- సియోల్‌లో కొనసాగుతున్న మంత్రులు నారాయణ, జనార్దన్ రెడ్డి పర్యటన
- కియా, లొట్టే గ్రూప్ ప్రతినిధులతో భేటీ
- విశాఖ పార్టనర్ షిప్ సమ్మిట్‌కు రావాలని కోరిన మంత్రులు
- సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో పారిశ్రామిక అనుకూల విధానాలను వివరించిన వైనం


5

### ప్రభుత్వ పాఠశాలలకు

## లక్ష నోట్ పుస్తకాలు, పెన్నులు విరాళం

- కేఎల్ఎస్ఆర్ ఇన్‌ఫ్రాటెక్ ఔదార్యం
- పంపిణీని లాంఛనంగా ప్రారంభించిన మంత్రి లోకేష్

4



# భారత్‌కు ఏపీ తలమానికం!

- వివిధ రంగాల్లో పెట్టుబడులకు విస్తృతమైన అవకాశాలు
- పెట్టుబడులను ఆకర్షించడంలో మాకు ట్రాక్ రికార్డు ఉంది
- రాష్ట్రాన్ని సందర్శించిన తరువాతే.. నిర్ణయం తీసుకోండి
- 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' ఇప్పుడు మా విధానం..
- పారిశ్రామిక మౌలికసదుపాయాల కల్పనలో ముందున్నాం
- 'సంపద సృష్టి'కి అనుగుణంగా ఏపీని తీర్చిదిద్దుతున్నాం
- విశాఖలో నిర్వహించే భాగస్వామ్య సదస్సుకు తరలిరండి..
- పారిశ్రామికవేత్తలు, రాయబారులకు సీఎం చంద్రబాబు పిలుపు
- సీఐఐ పార్టనర్షిప్ కర్టెన్ రైజర్‌లో ప్రసంగించిన సీఎం చంద్రబాబు




ఢిల్లీలో సీఐఐ భాగస్వామ్య సదస్సు కర్టెన్ రైజర్ కార్యక్రమంలో ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు ఉన్న అపారమైన అవకాశాలను వివరిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు. అనంతరం పలు దేశాల వ్యాపారవేత్తలతో సంభాషించారు.

ఢిల్లీ (చైతన్య రథం): భారతదేశంలో పెట్టే పెట్టుబడులకు ఆంధ్రప్రదేశ్ అత్యుత్తమ రాష్ట్రమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉద్ఘాటించారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ స్థానంలో 'స్పీడ్ ఆఫ్ డూయింగ్' బిజినెస్ విధానం ద్వారా పరిశ్రమలకు అనుమతులిస్తున్నామని స్పష్టం చేశారు. వివిధ రంగాల్లో అపారమైన అవకాశాలను అందిపుచ్చుకోవాలని సీఎం పిలుపునిచ్చారు. మంగళవారం ఢిల్లీలో జరిగిన సీఐఐ పార్టనర్షిప్ సమ్మిట్ కర్టెన్ రైజర్ కార్యక్రమానికి కేంద్ర మంత్రి పీయూష్ గోయల్‌తో కలిసి ముఖ్యమంత్రి చంద్రబాబు హాజరయ్యారు. నవంబర్ 14, 15వ తేదీల్లో విశాఖలో నిర్వహించే భాగస్వామ్య సదస్సుకు హాజరుకావాలని దేశ విదేశాలకు చెందిన పారిశ్రామికవేత్తలను, వివిధ దేశాల రాయబారులను సీఎం చంద్రబాబు ఆహ్వానించారు. "విశాఖలో నిర్వహించే 30వ భాగస్వామ్య సదస్సుకు పారిశ్రామికవేత్తలను, వివిధ దేశాల రాయబారులను సాదరంగా ఆహ్వానిస్తున్నాం. నవంబరు 14, 15 తేదీల్లో సీఐఐ భాగస్వామ్య సదస్సు నిర్వహిస్తున్నాం. పరిశ్రమలకు అనువుగా ఉండేలా లాజిస్టిక్స్‌ను ఏపీలో అభివృద్ధి చేస్తున్నాం. రాష్ట్రంలో పోర్టులు, ఎయిర్ పోర్టులు, రహదారుల నిర్మాణం చేపడుతున్నాం. సంపద సృష్టికి పెట్టుబడులు రావాలి, సంపద సృష్టిస్తేనే పేదరికాన్ని నిర్మూలించగలం. ప్రధాని మోదీ వికసిత్ భారత్-2047 రూపొందిస్తే.. మేం స్వర్ణాంధ్ర-2047 విజన్ రూపకల్పన చేశాం. ఏపీని 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దటమే స్వర్ణాంధ్ర విజన్ లక్ష్యం. దీనికోసం 10 సూత్రాల ఆధారంగా ముందుకెళ్తున్నాం. లాజిస్టిక్స్, డీప్ టెక్నాలజీ, ప్రొడెక్టు పర్ఫెక్షన్‌లాంటి కీలకమైన లక్ష్యాలను పెట్టుకున్నాం. సమీకృత అభివృద్ధి అనేది





ఇప్పుడు ఓ నినాదం. పీ-4 ద్వారా సమీకృత అభివృద్ధి సాధ్యం. స్పేస్, ఎలక్ట్రానిక్స్, డ్రోన్స్, ఏరోస్పేస్ సిటీలను ఏపీలో ఏర్పాటు చేస్తున్నాం" అని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

## 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' మా విధానం

"2026 జనవరినాటికి ఏపీ రాజధాని అమరావతిలో క్వాంటం కంప్యూటర్ పనిచేయటం ప్రారంభిస్తుంది. ఆ తదుపరి రెండేళ్లలో క్వాంటం కంప్యూటర్ పరికరాలను కూడా ఉత్పత్తి చేసే దశకు చేరుకుంటాం. 15శాతం వృద్ధిరేటు లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ పని చేస్తోంది. పనిచేసే యువత భారత్‌కు ఉన్న అతిపెద్ద వనరు. ఇదే దేశాభివృద్ధికి కీలకం. పునరుద్పాదక విద్యుత్ రంగంలో 500 గిగావాట్లను దేశంలో ఉత్పత్తి చేయాలని నిర్దేశిస్తే... అందులో ఏపీలోనే 160 గిగావాట్ల విద్యుదుత్పత్తి లక్ష్యం పెట్టుకున్నాం. ఏపీలో వివిధ రంగాల్లో పెట్టుబడులు పెట్టేందుకు అపారమైన అవకాశాలున్నాయి. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ద్వారా పరిశ్రమలకు అనుమతులిస్తున్నాం. ఆంధ్రప్రదేశ్ సులభతర వాణిజ్య విధానం అమలు చేయటంలో అగ్రస్థానంలో ఉంది. పోటీ ప్రపంచంలో పెట్టుబడులు ఆకర్షిస్తూ ఉండాలి. సంస్కరణలు ఆలస్యంగా ప్రారంభించినా సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకున్నాం. ప్రస్తుతం జీఎస్టీ 2.0 సంస్కరణల ద్వారా మరింత సులభంగా వాణిజ్యం జరుగుతుంది. కోవిడ్ సమయంలో ప్రపంచానికి వ్యాక్సిన్ అందించగలిగాం. యూపీఐ పేమెంట్ విధానాన్ని సింగపూర్, ఫ్రాన్స్‌లాంటి దేశాలకూ పరిచయం చేశాం. ఏపీ సోలార్, పంప్డ్ ఎనర్జీ, పవన విద్యుత్, గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి చేసేలా ప్రాజెక్టులు చేపట్టాం. ఈ ప్రాజెక్టుల ద్వారా దేశ పునరుత్పాదక విద్యుదుత్పత్తి కేంద్రంగా ఏపీని తయారు చేస్తాం. భారత కర్బన ఉద్గారాలరహిత ప్రయాణంలో కీలక భాగస్వామిగా ఏపీ ఉంటుంది" అని ముఖ్యమంత్రి వివరించారు.

## తీర ప్రాంతం మాకున్న బలం

"తీరప్రాంతంలో ప్రపంచ ప్రమాణాలతో పోర్టులు, పారిశ్రామిక, లాజిస్టిక్స్ కారిడార్ల నిర్మాణం చేస్తున్నాం. అడ్వాన్స్ ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను ప్రోత్సహిస్తాం. రైతులకు లబ్ది కలిగేలా బిగ్ టెక్ కంపెనీలకు ఏపీ కీలక స్థానంగా మారుతోంది. సెమీకండక్టర్లు, ఇతర ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తులతో గ్లోబల్ టెక్ పవర్ హౌస్‌గా భారత్ మారుతుంది. సహజ పర్యాటక ప్రాంతాలు ఏపీకి ఉన్న అతిపెద్ద వనరు. విద్య, వైద్యరంగాల్లో అపారమైన అవకాశాలున్నాయి. విశాఖలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు చేస్తోంది. అమెరికా తర్వాత ఇదే రెండో అతిపెద్ద కేంద్రమవుతుంది. ఏపీలో మాన్యుఫాక్చరింగ్ పరిశ్రమలు పెద్దఎత్తున తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఏపీని సందర్శించిన తర్వాతే.. అక్కడ పెట్టుబడులు పెట్టాలని పారిశ్రామికవేత్తలకు పిలుపునిస్తున్నాను. పెట్టుబడులను ఆకర్షించటంలో మాకు ట్రాక్ రికార్డు ఉంది. ఐటీరంగంతో హైదరాబాద్‌ను అభివృద్ధి చేసి అత్యుత్తమ నివాస నగరంగా మార్చాం. ప్రస్తుతం అమరావతి నగరాన్ని గ్రీన్ సిటీగా నిర్మాణం చేస్తున్నాం. అమరావతి సమీపంలో ప్రస్తుతం రోజుకు 7 లక్షల క్యూసెక్కుల నీరు ప్రవహిస్తోంది. కృష్ణా-గోదావరి నదులను అనుసంధానించాం. ఈ ఏడాది ఈ రెండు నదులనుంచి 5 వేల టీఎంసీ నీరు సముద్రంలో కలిసింది. ప్రపంచంలోని అత్యధిక తలసరి ఆదాయం కలిగిన వ్యక్తులు ఆంధ్రప్రదేశ్ నుంచే ఉన్నారు. సుస్థిరమైన ప్రభుత్వాలు.. సుస్థిరమైన విధానాలు దేశంలో, రాష్ట్రంలో ఉన్నాయి" అని సీఎం చంద్రబాబు చెప్పారు. కార్యక్రమంలో కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, సీఐఐ డైరెక్టర్ జనరల్ చంద్రజీత్ బెనర్జీ సహా వివిధ దేశాల రాయబారులు, పారిశ్రామికవేత్తలు హాజరయ్యారు.




## వీక్షిత్ భారత్‌కు వృద్ధి ఇంజన్ ఏపీ

### సీఎం చంద్రబాబు నాయుడు ఉద్ఘాటన

అమరావతి (చైతన్య రథం): వీక్షిత్ భారత్ ఆవిష్కరణకు వృద్ధి ఇంజన్‌గా ఏపీ సాక్షాత్కరించ నుందని సీఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా 30వ సీఐఐ పార్టనర్‌షిప్ సమ్మిట్ కర్టెన్‌రైజర్‌కు కేంద్రమంత్రి పియూష్ గోయల్‌తో కలిసి పాల్గొన్నారు. ప్రపంచ, జాతీయ పారిశ్రామికవేత్తలు, వివిధ దేశాల రాయ బారులను ఉద్దేశించి ప్రసంగించిన అనంతరం సీఎం చంద్రబాబు నాయుడు ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. "30వ సీఐఐ పార్టనర్షిప్ సమ్మిట్ కర్టెన్‌రైజర్‌లో కేంద్ర మంత్రి పీయూష్ గోయల్‌తో కలిసి మీతో మాట్లాడే అవకాశం రావడం గొప్ప గౌరవంగా భావిస్తున్నాను. ఈ నవంబర్‌లో విశాఖపట్నంలో ప్రతిష్టాత్మక భాగస్వామ్య సదస్సు నిర్వహించడం ఆంధ్రప్రదేశ్‌కు గర్వకారణం. మా వ్యాపార అనుకూల విధానాలు, దృఢమైన భవిష్యత్తుకు సిద్ధంగావున్న పర్యావరణ వ్యవస్థ ద్వారా పరిశ్రమలకు రెడ్ కార్పెట్ పరిచాము. స్వర్ణాంధ్ర నిర్మాణానికి మేము కృషి చేస్తున్నాం. అదే -వీక్షిత్ భారత్ ఆవిష్కరణకు కీలకమైన వృద్ధి ఇంజిన్‌గా మారనుంది. మౌలిక సదుపాయాలు, ఆవిష్కరణలు, పరిశ్రమలు, సమ్మిళిత పాలనపై బలమైన దృష్టితో, భారతదేశం అభివృద్ధి చెందిన దేశంగా పరివర్తన చెందడంలో ఆంధ్రప్రదేశ్ ముందుండి నడిపిస్తుంది. మన దేశం, ముఖ్యంగా మన రాష్ట్రం అందించే విస్తారమైన అవకాశాలను అన్వేషించమని ప్రపంచ, జాతీయ వాటాదారులను నేను హృదయపూర్వకంగా ఆహ్వానిస్తున్నా. మీ అందరికీ విశాఖపట్నంలో స్వాగతం పలకడానికి ఎదురు చూస్తున్నాను" అంటూ పోస్టులో సీఎం చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.

చైతన్యరథం

# ‘పూర్వోదయ’ నిధులివ్వండి



- వెనుకబడిన ప్రాంతాల ఆర్థికాభివృద్ధికి ఆ నిధులే కీలకం
- ఢిల్లీలో కేంద్ర ఆర్థిక మంత్రికి సీఎం చంద్రబాబు వినతి
- జలవనరుల మంత్రి పాటిల్‌తోనూ సమావేశం

ఢిల్లీ (చైతన్య రథం): ఆంధ్రప్రదేశ్‌లో వెనుకబడిన ప్రాంతాల ఆర్థికాభివృద్ధికి పూర్వోదయ పథకం కింద నిధులు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్రాన్ని కోరారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా మంగళవారం కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌తో సమావేశమైన ముఖ్యమంత్రి.. ఈ అంశంపై నిర్మలా సీతారామన్‌కు వినతిపత్రం సమర్పించారు. దేశంలోని తూర్పు ప్రాంతాల్లో ఉన్న రాష్ట్రాల సమగ్రాభివృద్ధికి పూర్వోదయ పథకానికి శ్రీకారం చుట్టిన నేపథ్యంలో ఏపీపై దృష్టి పెట్టాలని సీఎం విజ్ఞప్తి చేశారు. పూర్వోదయ పథకంలో భాగంగా బీహార్, జార్ఖండ్, పశ్చిమబెంగాల్, ఒడిశా రాష్ట్రాలతోపాటు ఆంధ్రప్రదేశ్‌ను ఎంపిక చేశారు. పూర్వోదయ నిధులతో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించినట్టు కేంద్ర ఆర్థిక మంత్రికి ముఖ్యమంత్రి చంద్రబాబు వివరించారు. రాయలసీమలో హార్టికల్చర్, ఉత్తరాంధ్రలో కాఫీ పంట ఉత్పత్తులు, జీడి, కొబ్బరి తోటలు, కోస్తాంధ్రలో ఆక్వా కల్చర్‌ను ప్రోత్సహించేలా ప్రణాళికలు రూపొందించినట్టు సీఎం తన వినతి పత్రంలో పేర్కొన్నారు. ఈ రంగాల్లో చేపట్టే ప్రాజెక్టులకు కేంద్రం పూర్వోదయ పథకంలో నిధులు కేటాయిస్తే మంచి ఫలితాలు వస్తాయని ముఖ్యమంత్రి వివరించారు. వెనుకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో ఎకనమిక్ డెవలప్మెంట్‌కు పూర్వోదయ పథకం అమలు ఎంతో దోహదం చేస్తుందన్నారు. వెనుకబడిన ప్రాంతాల ఆర్థికాభివృద్ధికి దోహదం చేసేలా ఎక్కువ మొత్తంలో నిధులు కేటాయించాలని సీఎం చంద్రబాబు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మాలా సీతారామన్‌ను కోరారు. అనంతరం కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌తో ముఖ్యమంత్రి చంద్రబాబు సమావేశమయ్యారు. పోలవరం పనుల పురోగతిని కేంద్రమంత్రికి సీఎం చంద్రబాబు వివరించారు.

> ఏపీ అభివృద్ధికి సంబంధించిన విషయాలను చర్చించేందుకు న్యూఢిల్లీలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను కలిశాను. పూర్వోదయ పథకం కింద మద్దతు కోరాను. దీని ద్వారా రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలలో ఆర్థిక వృద్ధిని బలోపేతం చేయడానికి, సమగ్ర అభివృద్ధిని సాధించడానికి మేము ప్రణాళికలు వేస్తున్నాము.
>
> – సీఎం చంద్రబాబు నాయుడు





ఢిల్లీలో కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌తో సమావేశమైన సీఎం చంద్రబాబు నాయుడు. చిత్రంలో కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ తదితరులు



కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌ను మంగళవారం కలిసిన ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు.



ఢిల్లీలో కేంద్ర హోంమంత్రి అమిత్ షాను కేంద్ర మంత్రులు, ఎంపీలతో కలిసి సమావేశమైన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు.

# ప్రజల్లోకి వెళ్లండి!

- సమర్థ, అసమర్థ పాలనమధ్య తేడాను వివరించండి
- గత ప్రభుత్వం ట్రూఅప్ పెట్టింది.. మనం ట్రూడౌన్ తెచ్చాం
- జిఎస్టీ సంస్కరణల ఫలితాలు ప్రజలకు వివరించండి
- మంత్రులు,ఎంపీలు, ఎమ్మెల్యేలతో సీఎం టెలీకాన్ఫరెన్స్



అమరావతి (చైతన్య రథం): ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ,అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, పార్టీ నేతలకు ఏపీ సీఎం చంద్రబాబు పిలుపునిచ్చారు. మంగళవారం సీఎం వారితో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. “చేసిన పనులు చెబితేనే ప్రజల్లో ప్రభుత్వంపట్ల నమ్మకం పెరుగుతుంది.ప్రజలతో మమేకమే కాదు.. మంచి పేరు తెచ్చుకోవాలి. పార్టీకి ప్రజా ప్రతినిధులు, నేతలే ప్రతినిధులు. వారి వ్యవహారశైలితో పార్టీకి, ప్రభుత్వానికి మంచి పేరు తేవాలి. గత ప్రభుత్వం ట్రూ అప్ పేరుతో విద్యుత్ ఛార్జీలను పెంచింది. కూటమి ప్రభుత్వం ట్రూడౌన్ పేరుతో తగ్గించింది. పీక్ లోడ్‌లో కరెంట్ కొనుగోలు చేయకుండా.. స్వాపింగ్ విధానాన్ని అనుసరించాం. దీంతో తక్కువ ధరకు విద్యుత్ అందుబాటులోకివచ్చింది. సోలార్, విండ్ సంప్రదాయేతర ఇంధన వనరుల ఉత్పత్తిపై దృష్టిపెట్టాం. సమర్థ పాలనకు.. అసమర్థ పాలనకు ఉన్న తేడాను ప్రజలకు వివరించాలి. జీఎస్టీ సంస్కరణలతో కలిగే లాభాలను ప్రజలకు తెలపాలి. ఏపీలోని కూటమి ప్రభుత్వం ఏడాదికి రూ.33వేల కోట్లకు పైగా నిధుల్ని పెన్షన్ల రూపంలో పంపిణీ చేస్తోంది. ఆటోడ్రైవర్ల సేవలో పథకం కింద ఆటో, క్యాబ్ డ్రైవర్లకు రూ.15 వేలు ఇవ్వనున్నాం. సూపర్ సిక్స్-సూపర్ హిట్ దీన్ని ప్రజలకు చెప్పాలి. ఓనర్‌షిప్ తీసుకోవాలి. ప్రజలు మనవైపు ఉంటే రాష్ట్రం అభివృద్ధి చెందుతుంది.కూటమిగా ఉన్నాం..అద్భుత విజయాన్ని కట్టబెట్టారు. అంతకుమించిన స్థాయిలో మళ్లీ విజయం దక్కేలా కూటమి పార్టీలు బలపడాలి” అని చంద్రబాబు దిశానిర్దేశం చేశారు.

## ఏరోస్పేస్ దిగ్గజం ఎయిర్‌బస్ కోసం..

# రంగంలోకి మంత్రి లోకేష్



- ఢిల్లీలో ఎయిర్‌బస్ పూర్తిస్థాయి బోర్డుతో సమావేశం
- రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలని ఆహ్వానం
- ప్రపంచస్థాయి ఏరోస్పేస్ తయారీ కేంద్రం ఏర్పాటుకు ప్రతిపాదన
- రాష్ట్రంలో పెట్టుబడుల అనుకూల వాతావరణాన్ని వివరించిన మంత్రి
- యూనిట్ ఏర్పాటుకు పూర్తిగా సహకరిస్తామని హామీ

న్యూఢిల్లీ (చైతన్యరథం): విమానాల తయారీ సంస్థ,ప్రపంచ ప్రఖ్యాత ఏరోస్పేస్ దిగ్గజం ఎయిర్ బస్ పెట్టుబడుల కోసం రాష్ట్రం మరో ముందడుగు వేసింది. న్యూఢిల్లీలో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ మంగళవారం ఎయిర్ బస్ సంస్థ పూర్తిస్థాయి బోర్డుతో ఉన్నత స్థాయి సమావేశంలో పాల్గొన్నారు. ఈ భేటీలో ఎయిర్ బస్ ఛైర్మన్ రెనీ ఒబెర్మన్‌తోపాటు ఎయిర్ బస్ ఇండియా, సౌత్ ఏషియా ప్రెసిడెంట్,మేనేజింగ్ డైరెక్టర్ పాల్గొన్నారు. మేకిన్ ఇండియా,స్వదేశీకరణ అవకాశాల అన్వేషణలో భాగంగా ఎయిర్ బస్ బోర్డ్ మొదటిసారి భారతదేశానికి వచ్చింది. ఈ సందర్భంగా రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలని ఎయిర్‌బస్ ప్రతినిధులను మంత్రి లోకేష్ ఆహ్వానించారు. ఏపీలో ప్రపంచస్థాయి ఏరో స్పేస్ తయారీ కేంద్రం ఏర్పాటుకు ప్రతిపాదన చేశారు. రాష్ట్రంలో ఎయిర్ బస్ ఆధారిత ప్రపంచ స్థాయి ఏరోస్పేస్ మ్యానుఫాక్చరింగ్ ఫెసిలిటీతో పాటు దీనికి అనుబంధంగా టైర్-1, టైర్-2 సరఫరాదారుల సహ ఉత్పత్తి యూనిట్ల రూపంలో కలిసి పని చేసేలా ప్రతిపాదనను మంత్రి లోకేష్ వారి ముందుంచారు. ఏపీలో ఇప్పటికే అందుబాటులో ఉన్న భూమి లభ్యతతో పాటు ప్రాజెక్ట్ వేగవంతంగా పూర్తి, గ్లోబల్ క్వాలిటీ మాన్యుఫాక్చరింగ్, టెక్నాలజీ ట్రాన్స్‌ఫర్‌కు అనుకూలంగా ఉన్న రాష్ట్ర ఏరో స్పేస్ పాలసీని వివ రించారు. తద్వారా రాష్ట్రాన్ని ఎగుమతి ఆధారిత ఏరోస్పేస్ హబ్‌గా తీర్చిదిద్దనున్నట్లు వెల్లడించారు.

### ప్రధాన యూనిట్‌తో పాటు ఇంటిగ్రేటెడ్ క్లస్టర్

ప్రధాన యూనిట్‌తోపాటు సరఫరాదారులు, ఎంఎస్ఎంఈలు, భాగస్వాములు కలిసి పనిచేయగల ఇంటిగ్రేటెడ్ క్లస్టర్‌ను ఏర్పాటుచేయాలని ఎయిర్ బస్‌ను మంత్రి నారా లోకేష్ కోరారు. దీనివల్ల టైమ్ లైన్ రిస్కులు తగ్గడంతో పాటు లోకలైజేషన్ పెరిగి తక్కువ ఖర్చుతో విస్తృతస్థాయిలో తయారీ సాధ్యం అవుతుందని వివరించారు. ప్రస్తుతం అభివృద్ధి చేస్తున్న ఏరోస్పేస్ కారిడార్‌ల్లో అనేక సైటింగ్ ఆప్షన్స్ ఉన్నాయని, అవి ఎయిర్ బస్ ప్రోగ్రామ్ అవసరాలకు, సరఫరాదారుల క్లస్టరింగ్, రవాణ సౌకర్యాలు, భవిష్యత్ విస్తరణలకు అనుగుణంగా ఉంటాయని వివరించారు.





ఈ భేటీ కోసం మంత్రి నారా లోకేష్ ప్రత్యేకంగా న్యూఢిల్లీ వెళ్లారు.రాష్ట్రప్రభుత్వ పెట్టుబడిదారుల ప్రాధాన్య విధానాన్ని, వేగవంతమైన అనుమతులు, సింగిల్ విండో సౌకర్యం, నిర్దిష్ట గడువులోగా ప్రాజెక్ట్ అమలు వంటి అంశాలతోపాటు సీఎం చంద్రబాబు బ్రాండ్, ప్రపంచస్థాయి పెట్టుబడులను రాష్ట్రానికి రప్పించిన ఆయన ట్రాక్‌రికార్డ్‌ను వివరించారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌పై ఏపీ దృష్టి పెట్టిందని తెలిపారు. ప్రపంచ ఏరోస్పేస్ రంగంలో ప్రఖ్యాతిగాంచిన ఎయిర్ బస్ రాష్ట్రంలో యూనిట్ నెలకొల్పేందుకు అవసరమైన పూర్తి ఎకో సిస్టమ్ అందిం చేందుకు ఏపీ సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు.

## మరో రెండు కార్పొరేషన్లకు

# డైరెక్టర్ల నియామకం

### - మొత్తం 35 మందిలో జనసేనకు 5, బీజేపీకి 2

అమరావతి (చైతన్యరథం) మరో రెండు కార్పొరేషన్లకు డైరెక్టర్లను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఏపీ కనీస వేతనాల సలహా మండలి, బెస్త అభివృద్ధి,సంక్షేమ కార్పొరేషన్లకు మంగళవారం డైరెక్టర్లను నియమించారు. ఈ రెండు కార్పొరేషన్లలో మొత్తం 35మంది డైరెక్టర్లను నియమించగా,వీటిలో జనసేనకు 5,బీజేపీకి 2 కేటాయించారు.

### 1. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి

| పేరు | నియోజకవర్గం | పార్టీ |
|---|---|---|
| 1. అశోక్ తాళ్ల | మంగళగిరి | టీడీపీ |
| 2. బాబు దాసరి | మైదుకూరు | టీడీపీ |
| 3. బాలిరెడ్డి అప్పారావు | పెందుర్తి | జనసేన |
| 4. ఎంకటేశ్వర్లు బొమ్మనబోయిన | కనిగిరి | టీడీపీ |
| 5. కాటం ఆరెడ్డి శ్రీకాంత్ | ఆళ్లగడ్డ | టీడీపీ |
| 6. కేతుబోయిన సురేష్ బాబు | కడప | జనసేన |
| 7. మధుసూదన్ ఆర్ తాళ్లపనేని | ఉదయగిరి | టీడీపీ |
| 8. పెంచలయ్య మన్నెం | నెల్లూరు రూరల్ | టీడీపీ |
| 9. పొలిమేర శ్రీనివాసరావు | విశాఖపట్నం | బీజేపీ |
| 10. పుల్లయ్య దుస్సుపూడి | ఉంగుటూరు | టీడీపీ |
| 11. రామ్ కుమార్ వాసుపల్లి | విశాఖపట్నం సౌత్ | టీడీపీ |
| 12. సాంబశివరావు ఆకుల | పొన్నూరు | టీడీపీ |
| 13. శరవణ కుమార్ ఆర్ | కుప్పం | టీడీపీ |
| 14. శ్రీమతి తెలుగు లక్ష్మి | విశాఖపట్నం సౌత్ | జనసేన |
| 15. శ్రీనివాసులు కాకర్ల | మార్కాపురం | టీడీపీ |
| 16. సుబ్బారావు తుడుము | అరకు వ్యాలీ | టీడీపీ |
| 17. సుబ్రహ్మణ్యం బచ్చుల | మచిలీపట్నం | టీడీపీ |
| 18. టి.లక్ష్మి పెద్దక్క | జమ్మలమడుగు | టీడీపీ |
| 19. తేరణి జయరాం రెడ్డి | సత్యవేడు | టీడీపీ |
| 20. వెంకట చంద్రసూరి బాబు.వి | శ్రీకాకుళం | టీడీపీ |

### 2. ఏపీ బెస్త సంక్షేమం, అభివృద్ధి కార్పోరేషన్

| పేరు | నియోజకవర్గం | పార్టీ |
|---|---|---|
| 1. బెస్త పవన్ కుమార్ | అనంతపురం అర్బన్ | టీడీపీ |
| 2. బెస్త శ్రీనివాసులు | ధర్మవరం | జనసేన |
| 3. బెస్త మల్లికార్జున | డోన్ | టీడీపీ |
| 4. బెస్త మనోహర్ | శ్రీ సత్యసాయి | బీజేపీ |
| 5. చంద్రశేఖర్ మాన | రాయచోటి | టీడీపీ |
| 6. కరిమద్దెల భాస్కర్ రావు | కర్నూలు | జనసేన |
| 7. కొడిపర్తి శ్రీధర్ | గూడూరు | టీడీపీ |
| 8. మల్లె వెంకట సుబ్బయ్య | కమలాపురం | టీడీపీ |
| 9. పి.అమరావతి | పూతలపట్టు | టీడీపీ |
| 10. పి.తిరుమగల్ | కుప్పం | టీడీపీ |
| 11. పళని బొమ్మన | సూళ్లూరుపేట | టీడీపీ |
| 12. రాంప్రసాద్ వట్గిరి | కడప | టీడీపీ |
| 13. రామాంజనేయులు బెస్త | ఆదోని | టీడీపీ |
| 14. సోమయ్య చాప | బాపట్ల | టీడీపీ |
| 15. టీజీ రమేష్ బాబు | కర్నూలు | టీడీపీ |

## ప్రభుత్వ పాఠశాలలకు

# లక్ష నోట్ పుస్తకాలు, పెన్నులు విరాళం




- కేఎల్ఎస్ఆర్ ఇన్‌ఫ్రాటెక్ ఔదార్యం
- పంపిణీని లాంఛనంగా ప్రారంభించిన మంత్రి లోకేష్

ఉండవల్లి (చైతన్యరథం): డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్ పథకానికి హైదరాబాద్‌కు చెందిన కేఎల్ఎస్ఆర్ ఇన్ ఫ్రాటెక్ లిమిటెడ్ సంస్థ లక్ష నోట్ పుస్తకాలు, పెన్నులను విరాళంగా అందించింది. సుమారు రూ.40 లక్షల విలువైన నోట్ పుస్తకాలు, పెన్నులను కేఎల్ఎస్ఆర్ సంస్థ విరాళంగా అందించింది. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు వీటిని అందజేయనున్నారు. ఈ మేరకు నోట్ పుస్తకాల పంపిణీని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ మంగళవారం లాంఛనంగా ప్రారం భించారు.పుస్తకాల ట్రక్‌ను జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బీద రవిచంద్ర యాదవ్‌తో పాటు కేఎల్ఎస్ఆర్ ఇన్‌ఫ్రాటెక్ లిమిటెడ్ ఎండీ కేఎల్ శ్రీధర్‌రెడ్డి,డైరెక్టర్ కే.ప్రీతమ్‌రెడ్డి, సమగ్ర శిక్ష స్టేట్‌ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.



చైతన్యరథం

# ఏపీలో పెట్టుబడులు పెట్టండి

- దక్షిణ కొరియా కంపెనీలకు మంత్రుల ఆహ్వానం
- సియోల్‌లో కొనసాగుతున్న మంత్రులు నారాయణ,జనార్దన్ రెడ్డి పర్యటన
- కియా, లొట్టే గ్రూప్ ప్రతినిధులతో భేటీ
- విశాఖ పార్టనర్ షిప్ సమ్మిట్‌కు రావాలని కోరిన మంత్రులు
- సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో పారిశ్రామిక అనుకూల విధానాలను వివరించిన వైనం
- స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌ను చేతల్లో చూపిస్తున్నామన్న మంత్రులు



సియోల్ (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టేందుకు రావాలని దక్షిణ కొరియా పెట్టుబడిదారులను మంత్రులు నారాయణ, బీసీ జనార్దన్ రెడ్డి ఆహ్వానించారు. విజనరీ లీడర్ చంద్రబాబు నాయకత్వంలో ఏపీలో స్పీడ్ ఆఫ్ డూయింగట్ బిజినెస్‌ను చేతల్లో చూపిస్తున్నామన్నారు. సమర్థ నాయకత్వంతో కేవలం 15 నెలల్లోనే ఏపీకి రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు ఆకర్షించగలిగామని తెలిపారు. ఈ ఏడాది నవంబర్ లో విశాఖపట్నంలో జరిగే సీఐఐ పార్టనర్ షిప్ సమ్మిట్‌కు రావాల్సిందిగా దక్షిణ కొరియా ఇన్వెస్టర్స్‌ను ఆహ్వానించారు. మూడు రోజులుగా దక్షిణ కొరియా రాజధాని సియోల్‌లో పర్యటిస్తున్న మంత్రులు....ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు ఉన్న అవకాశాలు, ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను అక్కడి పారిశ్రామిక వేత్తలకు వివరిస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం సియోల్‌లో కియా కార్ల పరిశ్రమ ప్రధాన కార్యాలయానికి వెళ్లిన మంత్రులు, ఇండియన్ ఎంబసీ, ఏపీ అధికారులకు కంపెనీ ప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. కియా సంస్థ స్ట్రాటజిక్ బిజినెస్ ప్లానింగ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్, గ్లోబల్ ఆపరేషన్స్ డివిజన్ ప్రతినిధులతో మంత్రుల బృందం సమావేశమయింది. ఇప్పటికే అనంతపురంలోని కియా యూనిట్ కార్ల ఉత్పత్తిలో ముందంజలో ఉన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో గ్లోబల్ మార్కెట్‌లో కియా కార్ల అమ్మకాలు, కియా యూనిట్‌ల విస్తరణపై మంత్రులు, కంపెనీ ప్రతినిధుల మధ్య చర్చ జరిగింది. ఏపీలో కియా యూనిట్‌కు ప్రభుత్వం అందిస్తున్న సహకారం, ప్లాంట్ విస్తరణ వంటి అంశాలపై చర్చించారు. సీఎం చంద్రబాబు నాయకత్వంలో ఏపీలో పెట్టుబడిదారులకు కల్పిస్తున్న అవకాశాలను కియా ప్రతినిధులకు మంత్రులు వివరించారు. విశాఖలో నవంబర్ లో జరిగే పెట్టుబడిదారులకు హాజరుకావాలని ఆహ్వానించారు.

**లొట్టే ప్రతినిధులతో భేటీ**

మధ్యాహ్నం సియోల్‌లో లొట్టే(రాశీవ)సంస్థ ప్రతినిధులతో మంత్రులు భేటీ అయ్యారు. లొట్టే కార్పొరేషన్ కార్పొరేట్ డెవలప్‌మెంట్ టీమ్ హెడ్, మేనేజర్, గ్లోబల్ స్ట్రాటజీ డివిజన్ వైస్ ప్రెసిడెంట్‌తో పాటు ఇతర ప్రతినిధులతో మంత్రులు, అధికారులు సమావేశమయ్యారు. ప్రపంచవ్యాప్తంగా ఫుడ్, కెమికల్స్, ఫార్మా రంగాలలో పెట్టుబడులు పెట్టిన లొట్టే గ్రూప్‌ను ఏపీకి ఆహ్వానించారు. ఏపీలో పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వచ్చే వారికోసం ఎలాంటి జాప్యం లేకుండా సింగిల్ విండో విధానంలో అనుమతులు ఇస్తూ, ప్రత్యేకంగా అధికారుల కమిటీతో వందరోజుల్లో పనులు ప్రారంభించే విధంగా చర్యలు తీసుకుంటున్న విధానాన్ని లొట్టే కార్పొరేషన్ ప్రతినిధులకు వివరించారు. సుస్థిరమైన నాయకత్వంలో పెట్టుబడులు పెట్టేందుకు రావాలని, విశాఖ భాగస్వామ్య సదస్సుకు హాజరుకావాలని ఆహ్వానించారు.

సియోల్ పర్యటనలో మంత్రులతో పాటు దక్షిణ కొరియాలోని ఇండియన్ ఎంబసీ డిప్యూటీ చీఫ్ ఆఫ్ మిషన్నిషి కాంత్ సింగ్, ఫస్ట్ సెక్రటరీ సంజనా ఆర్యతో పాటు పెట్టుబడులు, మౌలిక వసతుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణ బాబు, ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ పీయూష్ గోయల్, ఏపీఈడీబీ అధికారులు పాల్గొన్నారు.

## బంగాళాఖాతంలో అల్పపీడనం

- వాయుగుండంగా మారే అవకాశం
- రానున్న నాలుగురోజులు వర్ష సూచనలు
- విపత్తుల నిర్వహణ ఎండీ ప్రఖర్‌జైన్

*అమరావతి(చైతన్యరథం): పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం ప్రభావంతో అల్పపీడనం ఏర్పడిందని విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు. ఇది గురువారానికి వాయుగుండంగా బలపడే అవకాశం ఉందన్నారు.*

*అది పశ్చిమ వాయువ్య దిశగా కదులుతూ శుక్రవారం ఉదయానికి దక్షిణ ఒడిశా- ఉత్తరాంధ్ర తీరాలను దాటే అవకాశం ఉందని పేర్కొన్నారు. శనివారం వరకు మత్స్యకారులు వేటకు వెళ్లరాదని హెచ్చరించారు. దీని ప్రభావంతో బుధవారం శ్రీకాకుళం, అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో అక్కడక్కడ ఈ మోస్తరు వర్షాలు, మిగతా జిల్లాల్లో పలు చోట్ల తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. తీరం వెంబడి గంటకు 40-60 కిమీ వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం ఉందన్నారు. ప్రజలు చెట్ల కింద, శిథిలావస్థలో ఉన్న భవనాలు, హోర్డింగ్స్ వద్ద ఉండరాదని సూచించారు. పొంగి పొర్లే వాగులు, కాలువలు, రోడ్లు దాటే ప్రయత్నం చేయరాదన్నారు.*

**కృష్ణా, గోదావరి నదులకు వరద ప్రవాహం**

*మరోవైపు కృష్ణా, గోదావరి నదుల వరద ప్రవాహం కొనసా గుతుందని వెల్లడించారు. మంగళవారం సాయంత్రం 6 గంటల నాటికి ప్రకాశం బ్యారేజ్ వద్ద ఇన్ ఫ్లో, అవుట్ ఫ్లో 6,69,188 క్యూసెక్కులు ఉందని, రెండవ ప్రమాద హెచ్చరిక కొనసాగు తుందని తెలిపారు. 7 లక్షల క్యూసెక్కుల లోపు వరద చేరే అవ కాశం ఉందన్నారు.*

*గోదావరి నది భద్రాచలం వద్ద 50.30 అడుగుల నీటిమట్టం ఉందన్నారు. ధవళేశ్వరం కాటన్ బ్యారేజి వద్ద ఇన్ ఫ్లో 11,03,802 క్యూసెక్కులు ఉండి మొదటి హెచ్చరిక కొనసాగుతుందన్నారు. దాదాపు 12 నుంచి 12.5 లక్షల క్యూసె క్కుల వరకు వరద చేరి ఆ తరువాత గురువారం నుంచి క్రమంగా తగ్గే అవకాశం ఉందని పేర్కొన్నారు. సహాయక చర్యల కోసం 3 ఎన్డీఆర్ఎఫ్, 4 ఎస్డీఆర్ఎఫ్ బృందాలు ఏలూరు, కృష్ణా, బాప ట్ల, గుంటూరు, కోనసీమ, అల్లూరి సీతారామరాజు, కర్నూలు జిల్లా ల్లో ఉన్నాయని తెలిపారు. కృష్ణా, గోదావరి నదీపరీవాహక లోతట్టు ప్రాంత ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.*

## పేదల వైద్యం, ఆరోగ్యంపై సీఎం చంద్రబాబు ప్రత్యేక శ్రద్ధ

- రాష్ట్రంలోని ప్రజలందరి హెల్త్ ప్రొఫైల్ డిజిటలైజేషన్ చేస్తాం
- దసరా రోజు ఆటో డ్రైవర్లకు రూ.15 వేలిస్తాం
- రాష్ట్రం ఆర్థికంగా ఇబ్బందుల్లో ఆగని అభివృద్ధి, సంక్షేమం
- మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి
- క్యాంపు కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన మంత్రి
- కొండపి నియోజవర్గంలో ఇప్పటి వరకు 880 మందికి రూ.7.27 కోట్లు పంపిణీ



తూర్పు నాయుడుపాలెం (చైతన్యరథం): ప్రజల ఆరోగ్యం, సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.32.23 లక్షల నిధుల చెక్కులను 63 మంది లబ్ధిదారులకు మంత్రి చేతుల మీదుగా అందజేశారు. ప్రకాశం జిల్లా కొండపి నియోజకవర్గం తూర్పు నాయుడుపాలెం గ్రామంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో మంగళవారం సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి డా. స్వామి మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతున్న ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వం కొండంత అండగా నిలిచిందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నప్పటికీ సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తోందన్నారు. ప్రజల ఆరోగ్యం కోసం రూ.కోట్ల నిధులను వెచ్చిస్తుందన్నారు. అనారోగ్యంతో వైద్యశాలలలో చేరి, అధిక ఖర్చుతో ఇబ్బందులు పడుతున్న వారిని ప్రభుత్వం ఆదుకుంటోంద న్నారు. దుర్గాష్టమి పండుగ రోజున 63 మందికి రూ.32.23 లక్షల విలువైన ముఖ్య మంత్రి సహాయనిధి చెక్కులను లబ్ధిదారులకు అందజేశామన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఇప్పటివరకు కొండపి నియోజకవర్గం లో 880 మందికి రూ.7.27 కోట్ల నిధులను సీఎంఆర్ఎఫ్ కింద అందజేశా న్నారు. ప్రజల ఆరోగ్యం, సంక్షేమం కోసం త్వరలోనే సంజీవిని కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టనుందన్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్ పథకంతో పేదలను ప్రతినెల ఆదుకుంటోందన్నారు. స్త్రీ శక్తి పేరుతో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని ప్రభుత్వం కల్పించింద న్నారు. ఆటో డ్రైవర్లకు రూ.15వేలు ఆర్థిక సహాయాన్ని మరో రెండు రోజుల్లో అందిస్తుందన్నారు. ఇప్పటికే అన్నదాత సుఖీభవ పేరుతో రైతులకు పెట్టుబడి నిధి అందిస్తోందన్నారు. దీపం-2 పథకం కింద ఉచిత గ్యాస్ సిలిండర్లను అర్హులైన వారందరికీ ఇస్తున్నట్లు వివరించారు. అన్న క్యాంటీన్ల ద్వారా పేదలందరికీ ఐదు రూపాయలకే భోజనం అందిస్తున్నట్లు చెప్పారు. నిరుద్యోగ సమస్య పరిష్కారం కోసం మెగా డీఎస్సీ ద్వారా 16 వేల టీచర్ పోస్టులను భర్తీ చేయగా, మరో ఆరువేల పోస్టులను పోలీస్ శాఖలో భర్తీ చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు అవిశ్రాంతంగా కృషి చేస్తున్నారని మంత్రి డా. స్వామి వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## ఏపీ పర్యాటక శాఖకు గ్లోబల్ టూరిజం అవార్డు

**- ఢిల్లీలో అందుకున్న రాష్ట్ర ప్రతినిధి నిషితా గోయల్**



అమరావతి (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్‌ను భారతదేశంలోని అత్యంత ఆకర్షణీయమైన పర్యాటక గమ్యస్థానంగా మార్చేందుకు అమలు చేసిన అద్భుతమైన కార్యక్రమాలతో ఆంధ్రప్రదేశ్ టూరిజం శాఖను గ్లోబల్ టూరిజం అవార్డు -2025 వరించింది. ఈ మేరకు మంగళవారం ద్వారక ఢిల్లీలోని యశోభూమిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఏపీ ప్రభుత్వ పర్యాటక శాఖ తరపున టూరిజం కన్సల్టెంట్ నిషితా గోయల్ ఈ అవార్డును అందుకున్నారు. నూతన పర్యాటక విధానాన్ని రూపొందించడంలో దార్శనిక నాయకత్వం, గమ్యస్థాన అభివృద్ధిలో ఇన్వెస్టర్లకు అందించిన మార్గదర్శకత్వం, పర్యావరణ అనుకూలమైన కొత్త రాజధానిని నిర్మించడం, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం, భారతదేశ పర్యాటక వృద్ధిలో కీలక పాత్ర పోషించడం, పెద్ద ఎత్తున పెట్టుబడులను ఆకర్షించినందుకు ఆంధ్రప్రదేశ్ టూరిజంకు అవార్డు కేటాయించామని గ్లోబల్ న్యూస్ నెట్‌వర్క్ యాజమాన్యం పేర్కొంది. ప్రధానంగా గండికోటను అత్యంత ఆశాజనకమైన కొత్త పర్యావరణ, సాహస గమ్యస్థానాలలో ఒకటిగా విజయవంతంగా నిలపడం, మౌలిక సదుపాయాల కల్పన, ఆతిథ్య సామర్థ్యం, ఉపాధిని పెంచడానికి పీపీపీ విధానంలో గణనీయమైన ప్రైవేట్ రంగ పెట్టుబడులను ఆకర్షించడం, 15 నెలల కాలంలో ప్రఖ్యాత సంస్థలతో 103 ఎంవోయూలను కుదుర్చుకోవడం అవార్డు సాధించడానికి కారణాలు అయ్యాయి. అంతేగాక బీచ్, టెంపుల్, ఎకో టూరిజం ప్రక్రియలతో కూడిన టూరిజం సర్క్యూట్లను అభివృద్ధి చేయడంతో పాటు, యువత భాగస్వామ్యాన్ని, స్థిరమైన పర్యాటక అభివృద్ధిని ప్రోత్సహించడం, తదితర కారణాల వల్ల గ్లోబల్ టూరిజం అవార్డుకు ఎంపికైందని ఏపీ పర్యాటకశాఖ ఒక ప్రకటనలో పేర్కొంది. సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, అధికారులు పర్యాటక రంగంపై చూపిస్తున్న ప్రత్యేక శ్రద్ధ వల్లే అవార్డులు సాధించగలుగుతున్నామని పర్యాటక శాఖ ఈ సందర్భంగా పేర్కొంది.

# పేర్ని నానీని ప్రజలే తరిమికొడతారు

- మంత్రి కొల్లు రవీంద్ర హెచ్చరిక
- ఐదేళ్ల పాలనలో బందరుకు ఏం చేశావో చెప్పగలవా?
- అభివృద్ధి గురించి ప్రశ్నిస్తే వ్యక్తిగత విమర్శలు సిగ్గుచేటు
- సినీ అభిమానుల మధ్య రాజకీయ చిచ్చుకు ప్రయత్నిస్తే సహించం
- బందరు అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది

మచిలీపట్నం(చైతన్యరథం): ఐదేళ్ల పాలనలో చెప్పుకునేందుకు ఒక్క మంచిపని కూడా లేని వైసీపీ నేతలు నేడు వ్యక్తిగత విమర్శలకు దిగుతున్నారని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సయిజ్ శాఖల మంత్రి కొల్లు రవీంద్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన తప్పులను ప్రశ్నించే వారిపై వ్యక్తిగత విమర్శలకు దిగితే ప్రజలు తరిమి తరిమి కొడతారని వైసీపీ నేత పేర్ని నానిని మంత్రి కొల్లు రవీంద్ర హెచ్చరించారు. మచిలీపట్నం చిలకలపూడి సెంటర్లో ఏర్పాటు చేసిన ఫౌంటెయిన్‌ను మంత్రి కొల్లు రవీంద్ర మంగళవారం ప్రారంభించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ మచిలీపట్నం సుందరీకరణ పనులకు 2014-19 మధ్య కాలంలోనే శంకుస్థాపన చేశామని చెప్పారు. కొన్ని సెంటర్లలో మన సంస్కృతి, సంప్రాయాలు ఉట్టిపడేలా ఏర్పాట్లు చేశాం. చిలకలపూడి వద్ద డ్రైనేజీ ఆధునికీకరణ పనులు చేపట్టాం. రూ.5 లక్షల వ్యయంతో వాటర్ ఫౌంటెయిన్ కూడా ఏర్పాటు చేశాం. తరువాత ప్రభుత్వం మారడంతో పనుల్ని గాలికి వదిలేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక తిరిగి పనులు పూర్తి చేసి ప్రారంభించడం సంతోషంగా ఉంది. ఇదే





స్ఫూర్తితో మచిలీపట్నం అభివృద్ధికి కార్యాచరణ రూపొందిస్తున్నాం. జిల్లా పరిషత్ వద్ద ఉన్న చెరువు ఆధునికీకరణకు రూ.2.90 కోట్లతో పనులు చేపట్టబోతున్నాం. చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్, వాటర్ ఫౌంటెయిన్, పచ్చదనం ఏర్పాటు చేయబోతున్నాం. గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా అమృత్ పథకం ద్వారా రావాల్సిన రూ.100 కోట్ల నిధులు మురిగిపోయాయి. కేంద్రం నిధుల్ని వినియోగించుకోవడం చేతకాని వాళ్లు వ్యక్తిగత విమర్శలు చేయడం అత్యంత హేయమని మండిపడ్డారు. ప్రజలకు మంచి చేయకపోగా ప్రశ్నించే వారిపై వ్యక్తిగత విమర్శలు సిగ్గుచేటు అన్నారు. ప్రజలకు మేం ఇది చేశామని చెప్పుకోలేక వైసీపీ నేతలు వ్యక్తిగత విమర్శలకు దిగుతున్నారు. ఐదేళ్లలో ఏం చేశారో చెప్పగలరా.. ప్రజలు చిత్తుచిత్తుగా ఓడించినా బరితెగించి వాగుతున్నారని మంత్రి రవీంద్ర మండిపడ్డారు.

**సినిమా పరిశ్రమన వేధించి నేడు నీతులా..**

సీఎం చంద్రబాబు, నందమూరి బాలకృష్ణ, మెగాస్టార్ చిరంజీవి గురించి మాట్లాడే అర్హత పేర్ని నానికి లేదని హెచ్చరించారు. సినిమా ప్రముఖుల్ని గుమ్మం వద్దనే నిలబెట్టి అవమానించినోళ్లు.. ఇప్పుడు ఉద్ధరించేశామని మాట్లాడుతున్నారు. జగన్ రెడ్డి సినిమా టికెట్ల విషయంలో తాడేపల్లి పిలిపించి చిరంజీవి సహా సినీ పెద్దలను అవమానించడం వాస్తవం కాదా? సినిమా ఇండస్ట్రీ మొత్తాన్ని వేధించి, నేడు నీతులు మాట్లాడుతున్నారు. అధికారం ఉందని నాడు అడ్డగోలుగా వ్యవహరించారు. సినిమా పరిశ్రమను నిలబెట్టాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పని చేస్తోంది. కులాలు, మతాల మధ్య చిచ్చు పెట్టాలనుకుంటే ప్రజలు చూస్తూ ఊరుకోరు. అభిమానులు సమావేశం పెట్టుకుంటే వారించిన పెద్దమనసు చిరంజీవిది. ఈ సందర్భంగా సినీ అభిమానుల సంయమనాన్ని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నా. చిరంజీవి గానీ, బాలకృష్ణ గానీ వారి అభిమానుల్ని వదిలేస్తే.. వైసీపీ నాయకుల పరిస్థితి ఏంటో ఆలోచించుకోవాలి. వ్యక్తిగత విమర్శలు చేసుకుంటూ ముందుకు వెళ్తామంటే ప్రజలు తరిమికొడతారు. మైక్ ఉంది కదా అని ఇష్టానుసారం మాట్లాడుతామంటే చూస్తూ ఊరుకోం. బియ్యం మాఫియా నుండి పేర్ని ఖాతాల్లోకి డబ్బులు జమ అయినప్పటికీ.. సిగ్గులేకుండా అబద్ధాలు చెబుతున్నారు. ఇళ్ళస్థలాల పేరుతో మోసం చేశారు. నాటి అక్రమాలు బయట పడుతుండడంతో.. బెయిల్ కోసం పరుగులు పెడుతున్నవారు కూటమి నాయకుల గురించి మాట్లాడడం హేయం. జగన్ రెడ్డి లాంటి 420లను నమ్ముకుంటే నీ బతుకు అంతకు మించి అన్నట్లుగా తయారవుతుందని పేర్ని నానిని మంత్రి కొల్లు రవీంద్ర హెచ్చరించారు.

## బడుగుల వంచనలో మహాఘనుడు జగన్

- వారికి న్యాయం చేస్తుంటే అడ్డుకుంటున్నారు
- గృహ నిర్మాణ మంత్రి కొలుసు పార్థసారథి



మంగళగిరి(చైతన్యరథం): బడుగుల వంచనలో మహాఘనుడు జగన్ అని గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. మంగళగిరి టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ నా ఎస్సీ, నా ఎస్టీ, నా బీసీ అని చెప్పుకునే వర్గాలపై జగన్ ప్రేమ నేతి బీరలో నెయ్యి చందమేనని వ్యాఖ్యానించారు. బీసీ నాయకుడు చంద్రయ్య కుటుంబానికి న్యాయం చేస్తుంటే వైసీపీ అడ్డుకోవడం బీసీలపై వారి కపట ప్రేమకు నిదర్శనమన్నారు. జగన్ పాలనలో ప్రభుత్వంలోని అన్ని ముఖ్య పదవులన్నీ, చైర్మన్ పోస్టులు, ముఖ్య సలహాదారుల పదవులు ఏకపక్షంగా అగ్రవర్ణాలకు, వారి సొంత సామాజిక వర్గానికి మాత్రమే ఇచ్చారన్నారు. ప్రజలు ఈ విషయాలను మర్చిపోలేదని, చంద్రయ్య కుటుంబానికి ఒక మంచి పరిష్కారం రావాలనే సందర్భంలో ఎందుకు అడ్డుకుంటుందో వైసీపీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బలహీన వర్గాల ఆర్థిక పరిస్థితి మెరుగుపరచడానికి, వారి సామాజిక గౌరవానికి ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యంలో కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలను ప్రజలు పరిశీలించా లన్నారు. వైన్ షాపులు, మద్యం దుకాణాల్లో గౌడ కులస్తులకు కోసం 10 శాతం రిజర్వేషన్లు కల్పించి కూటమి ప్రభుత్వం అండగా నిలిచింది. గౌడ సోదరుల ఆర్థిక స్థితిని బలోపేతానికి ప్రభుత్వం కృషి చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం బలహీన వర్గాల పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని ఆర్థిక సహాయం పెంచడం, గౌరవ వేతనాల్ని పెంచడం, హ్యాండ్లూమ్‌కి విద్యుత్ యూనిట్లు మంజూరు చేయడం, నేతన్నలకు సంవత్సరానికి ఆర్థిక సహాయం వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలే నిదర్శనమని స్పష్టం చేశారు. బలహీన వర్గాలకు ఉద్యోగాల పెంపు, డీఎస్సీ మాదిరిగా 16,500 మందిని నియమించడం, పోలీస్, ఆరోగ్య శాఖల్లో వేలాది ఉద్యోగాల కల్పన వంటివి చేపట్టామని గుర్తుచేశారు. చంద్రయ్య కుటుంబానికి ఉద్యోగం ఇవ్వాలన్నప్పుడు ఎందుకు ఆపేస్తున్నారనే ప్రశ్నకు సమాధానం చెప్పి తీరాలని డిమాండ్ చేశారు. గతంలో టీడీపీ లేదా ప్రభుత్వ స్థాయిలో పలుమార్లు ఉద్యోగాలు, ఆర్థిక సహాయం సమకూర్చిన విషయాలను గుర్తు చేశారు. అదే తత్వాన్ని ఇక్కడ కూడా పాటించాలన్నారు. స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు 34 శాతం నుంచి 24 శాతానికి తగ్గించడం వల్ల వేలాది మంది రాజ్యాంగబద్ధమైన పదవులకు దూరం అయ్యారని గుర్తు చేశారు. వైసీపీ పాలనలో జరిగిన దాడులు, బలహీన వర్గాలపై అవమానాల సంఘటనలు ప్రజలు చూడలేదా..? అన్ని గమనించారు కాబట్టే వైసీపీకి అంతకుముందు ఎన్నికల్లో 151 సీట్ల అత్యధిక మెజార్టీతో ప్రజలే 2024 ఎన్నికల్లో కేవలం 11 సీట్లకే పరిమితం చేశారనే విషయాన్ని వైసీపీ నాయకులు గ్రహించాలి. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం బలహీన వర్గాలను రక్షించేందుకు, శిక్ష విధించేందుకు సిద్ధంగా ఉందని స్పష్టం చేసారు.

# దళితవాడల్లో 5 వేల ఆలయాలు

- భక్తుల నుంచి వచ్చిన డబ్బుతో నిర్మాణం
- గత ప్రభుత్వంలో ఎన్నో అపచారాలు
- ఆ తప్పులు పునరావృతం కానివ్వం
- మంత్రి ఆనం రామనారాయణరెడ్డి



నెల్లూరు (చైతన్యరథం): రాష్ట్రంలో నిర్మించిబోయే 5000 దేవాలయాలకు సంబంధించిన నిధులు భక్తుల నుంచి వచ్చిన వేనని దేవాదాయ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి వెల్లడించా రు. మంగళవారం స్థానిక మంత్రి వారి క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రానున్న ఐదేళ్ల కాల పరిమితిలో రాష్ట్రంలోని దళిత గిరిజనవాడలలో 5000 ఆలయాలు నిర్మించడం జరుగుతుందని స్పష్టం చేశారు. గత ప్రభుత్వ హయాంలో దేవాదాయ శాఖ మను గడ కోల్పోయిందని మంత్రి ఆనం ఆవేదన వ్యక్తం చేశారు. అనేక దేవాలయాల్లో ఎన్నో అవాంఛనీయ సంఘటనలు జరిగాయన్నారు. కొండ బిట్రగుంట వద్ద రథం దగ్ధం, అంతర్వేదిలో రథం తగల బడటం, నాయుడుపేటలోని ఆంజనేయస్వామి విగ్రహానికి తోకను కత్తిరించడం, విజయవాడ అమ్మవారి దేవస్థానంలో వెండి సింహాలు మాయం అవడం వంటి సంఘటనలు అనేకం జరిగాయని వివరించారు. వైసీపీ పాలనలో భగవంతునికి రక్షణ, భద్రత లేకుండా పోయిందన్నారు. నేడు విజయవాడలో కనకదుర్గమ్మ నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా వేల జ్యోతుల కాంతిలో విరాజిల్లుతుందని తెలిపారు.

హిందూ ధర్మ మనోభావాలు దెబ్బ తినకుండా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టడం జరిగిందని ఆయన తెలిపారు. హిందూ ధర్మంతో పాటు సనాతన ధర్మాన్ని కాపాడే విధంగా ముందస్తు చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. గతంలో జరిగిన తప్పులు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టా మన్నారు. దూప దీప నైవేద్యాలకు సుమారు 5523 దేవాల యాలకు నెలకు రూ.10 వేల నిధులు కేటాయించడం జరిగిందని, అర్చకులకు కూడా జీతం పెంచడం జరిగిందన్నారు. వేద అభ్యస నం చేసిన వేద విద్యార్థులకు నెలకు సంభావన కింద రూ.3000 చొప్పున దాదాపు 600 మందికి మూడేళ్ల పాటు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవడం జరిగిందని, ఇది నిరంతర ప్రక్రియ అని తెలిపారు.

**ఆగమ పండితుల సూచనల మేరకే జరగాలి**

దేవాలయంలో ఉదయాన్నే ముఖ్యద్వారాలు తెరిచినప్పటి నుంచి రెండు గంటల పాటు ఓంకార నాదాలు వినపడే విధంగా చర్యలు తీసుకోవడం జరిగిందని వివరించారు. ప్రతి దేవాలయం లో పూజా కార్యక్రమాలు, సేవలు, పూజా కైంకర్యాలు ఆగమ పండితుల సూచనలు మేరకే జరిగే విధంగా ఉత్తర్వులు జారీ చేయడం జరిగిందన్నారు. రాష్ట్రంలోని అనేక ఆలయాలను పున ర్ నిర్మాణం చేసే విధంగా చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. సుమారుగా 5523 దేవాలయాలలో దూప దీప నైవేద్యాల నిమి త్తం నెలకు రూ.10 వేలు కేటాయించడం జరిగిందని, అక్టోబర్ నవంబర్ నెలలో మరో వెయ్యి దేవాలయాలకు ఈ పథకం విస్తరించడం జరుగుతుందన్నారు. నెల్లూరు నుంచి తూర్పుగోదావరి వరకు ఉన్న దేవాలయాలలో 33 శాతం ఆలయం నుంచి, 61 శాతం దేవాదాయ శాఖ నుంచి ప్రభుత్వం చెల్లిస్తుందని తద్వారా అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుందన్నారు.

**అలయాల్లో అభివృద్ధి పనులు**

అదేవిధంగా ఆంధ్రాలో మూడు జిల్లాలు, రాయలసీమలోని నాలుగు జిల్లాల లో 20 శాతం దేవాలయ నిధులు..80 శాతం ప్రభుత్వ నిధులతో అభివృద్ధి చేపట్టడం జరుగుతుందన్నారు. ఏజెన్సీ..ట్రైబల్ ఏరియా ప్రాంతాలలో 10 శాతం దేవాలయ నిధులు, 90 శాతం ప్రభుత్వ నిధులతో అవసరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని వివరించారు. అటవీ ప్రాంతంలో ఉన్న దేవాలయాల అభివృద్ధికి 100 శాతం నిధులు కేటాయిం చడం జరుగుతుందని తెలిపారు. 210 దేవాలయాల్లో సీజీఎఫ్ నిధులతో సుమారుగా 232.75 కోట్లతో అభివృద్ధి పనులను చేపట్టడం జరిగిందన్నారు. అందులో 30 శాతం దేవాలయాలు, భక్తుల నుంచి వచ్చిన డబ్బేనని తెలిపారు.

రాబోయే ఒకటిన్నరేళ్ల లో ఆలయాల నిర్మాణం, అభివృద్ధి పనులు పూర్తి చేయడం జరుగుతుంద న్నారు. రాష్ట్రంలో ఐదు లక్షల ఆదాయం ఉన్న గుడులు సుమా రుగా 1153 ఉన్నాయని, అందులో 926 దేవాలయాలకు పాలకవర్గాలను ఏర్పాటు చేసే విధంగా నోటిఫికేషన్ జారీ చేయడం జరిగిందని, కాల పరిమితి ఇంకా ఉన్న వారిని ఉంచడం జరిగిందని తెలిపారు. 25 లక్షల నుంచి ఒక కోటి రూపాయలు ఆదాయం ఉన్న దేవాలయాలు 218 ఉన్నాయన్నారు. అందులో 167 దేవాలయాలకు పాలక మండలి ఏర్పాటుకు నోటిఫికేషన్ జారీ చేయడం జరిగిందని చెప్పారు. 67 దేవాలయాలకు పాలక మండళ్లు నియమించడం జరిగిందన్నారు. కోటి రూపాయల నుంచి ఐదు కోట్ల ఆదాయం ఉన్న దేవాలయాలు 75 ఉన్నాయ న్నారు. 58 దేవాలయాలకు నోటిఫికేషన్ జారీ చేయడం జరిగిందని, అలాగే 22 దేవా లయాలకు పాలకమండలి నియమించడం జరిగిందన్నారు. డిసెంబర్ మార్చి నాటికి అన్ని దేవాలయాల్లో పూర్తిస్థాయిలో పాలక మండలి ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు.

# విద్యార్థులను తీర్చిదిద్దటంలో టీచర్లే కీలకం

- ప్రభుత్వ పాఠశాలల్లో చదివేది పేద పిల్లలే భావిపౌరులుగా తయారు చేయాలి
- మెగా డీఎస్సీలో 50 శాతం ఉద్యోగాలు ఎస్ఎస్ పబ్లికేషన్స్ కృషికి నిదర్శనం
- గృహ నిర్మాణ మంత్రి కొలుసు పార్థసారథి
- మొదటి ర్యాంకు విజేతలకు ప్రోత్సాహకాలు

విజయవాడ (చైతన్యరథం): సమాజంలో ఉత్తమపౌరులుగా విద్యార్థులను తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని సమా చార పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖల మంత్రి కొలుసు పార్థసారథి పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని ఎస్ఎస్ కన్వెన్షన్ హాలులో ఎస్ అండ్ ఎస్ పబ్లికేషన్స్ ఆధ్వర్యంలో మెగా డీఎస్సీ-2025 సక్సెస్ మీట్ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా మంత్రి హాజరయ్యారు. గత ప్రభుత్వంలో డీఎస్సీ అంటే అందని ద్రాక్షలా ఉండేదని..దానిని అందేలా చేసిన ఘనత ముఖ్య మంత్రి చంద్రబాబుకు దక్కుతుందన్నారు. మంత్రి నారా లోకేష్ రాష్ట్రంలో 16 వేల టీచర్ పోస్టులను సకాలంలో పారదర్శకంగా భర్తీ చేశారు. ఇందులో ఎక్కువగా ఎంపికైన వారు పేద కుటుంబాల నుంచి వచ్చిన వారే ఉంటారు. పిల్లలను సక్రమమైన దారిలో పెట్టి విద్యాబుద్ధులు నేర్పించాల్సిన బాధ్యత ఉపాధ్యాయు లపై ఉంటుంది.



స్వర్ణాంధ్ర 2047కు ప్రపంచంలో భారతదేశం నెంబర్‌వన్‌గా నిలిచేలా విద్యార్థులను సన్నద్ధం చేయాలని పేర్కొన్నా రు. విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత అధ్యాపకులపై ఉందని తెలిపారు. ఆలాకాకుండా సింప్లీ సిటింగ్ అండ్ మంత్లీ టేకింగ్‌లా ఉంటే వారికి సమాజంలో అంత గౌరవం ఉండదని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో 95 శాతం పేదవర్గాల పిల్లలే చదువుకుంటుంటారు. పిల్లవాడు బాగా చదువుకుని పట్ట ణంలో మంచి ఉద్యోగం చేసుకోవాలని తల్లిదండ్రులు ఆశిస్తారు.. స్కూల్ దశలోనే విద్యార్థులకు మంచి పునాది వేయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యకు ఎక్కువ ప్రాముఖ్యత ఇస్తుందని, అందుకు నిదర్శనం మంత్రి నారా లోకేష్ విద్యా శాఖ మంత్రిగా చేస్తున్న సంస్కరణలేనన్నారు. మెగా డీఎస్సీని రికార్డు స్థాయిలో పూర్తి చేసి మాట నిలబెట్టుకున్నారని ప్రశంసించారు. మెగా డీఎస్సీలో 50 శాతం ఉద్యోగాలు సాధిం చడంలో ఎస్ అండ్ ఎస్ పబ్లికేషన్స్ కృషి అనితర సాధ్యమన్నారు. లాభాపేక్ష లేకుండా ఈ సంస్థను నిర్వహించడం చాలా గొప్ప విషయమని కొనియాడారు.

ఎస్అండ్ఎస్ పబ్లికేషన్స్ మేనేజింగ్ డైరెక్టర్ మాకం శేషావలి మాట్లాడుతూ రాష్ట్రంలో మెగా డీఎస్సీలో 50 శాతం కంటే పైన ఉద్యోగాలు సాధించడం మా సంస్థ పురోభివృద్ధికి నిదర్శనం. మా సంస్థ నుంచి రాష్ట్రంలో మొదటి ర్యాంకు సాధించి ముఖ్యమంత్రి చేతులమీదుగా అవార్డు అందుకోవడం గర్వకారణమన్నారు. అనంతరం మెగా డీఎస్సీలో రాష్ట్రస్థాయి మొదటి ర్యాంకు పొందిన శ్రీకాకుళం జిల్లాకు చెందిన శేషాద్రినాయుడు, విత్తనాల వంశీ కృష్ణలకు రూ.50 వేల చెక్కులను మంత్రి పార్థసారథి అందజేశా రు. అదేవిధంగా ఎస్ అండ్ ఎస్ పబ్లికేషన్స్ మేనేజింగ్ డైరెక్టర్ మాకం శేషావలి కుటుం బాన్ని మంత్రి సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ కె.లక్ష్మణరావు, కే.శ్రీనివాస్, ఐపీఎస్, సైకాలజిస్ట్ నాగేశ్వరరావు, అంగలూరు డైట్ కాలేజ్ మాజీ ప్రిన్సిపాల్ ఎస్వీజీ ఆంజనేయులు, మెగా డీఎస్సీలో ఉద్యోగాలు సాధించిన ఉపాధ్యాయులు వారి తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

## 92 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కులు

- పంపిణీ చేసిన మంత్రి మండిపల్లి



రాయచోటి (చైతన్యరథం): పట్టణంలోనే మంత్రి క్యాంపు కార్యాలయంలో మంగళవారం రోజు ఉదయం ముఖ్యమంత్రి సహాయ నిధి కింద 92 మంది లబ్ధిదారులకు రూ.72 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అందజేశారు. ఇప్పటివరకు కూటమి ప్రభుత్వం ఏర్పడిన నుంచి రూ.5.32 కోట్ల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందించినట్లు చెప్పారు. చెక్కులు పంపిణీ సందర్భంగా వైద్య సహాయం అం దుకున్న రోగుల ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిని, యోగక్షేమా లను ప్రత్యక్షంగా అడిగి తెలుసుకున్నారు. నిరుపేదల ఆరోగ్య సమస్య లను పరిష్కరించడానికి కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని తెలిపారు.

## దసరా కానుకతో ఆటోడ్రైవర్లకు ఆర్థిక భరోసా

- గత ప్రభుత్వంలో వారిని వేధించారు
- చంద్రబాబు హామీలు అమలుచేశారు
- ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ అహ్మద్

మంగళగిరి (చైతన్యరథం): కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ సూపర్ సిక్స్ పథకా లను సూపర్‌హిట్ చేసిందని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ అహ్మద్ పేర్కొన్నారు. మంగళవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు చెప్పిన ప్రతి హామీని అమలు చేసి ముఖ్యమంత్రి చంద్రబాబు మాట నిలబెట్టుకున్నారు. యువగళం పాదయాత్ర ఆటో డ్రైవర్ల సమస్యలు విన్న లోకేష్ నేడు అండగా నిలిచారు. గ్రీన్ ట్యాక్స్ తగ్గించి లారీ డ్రైవర్లకు ఆర్థిక భరోసానిచ్చారు. ఆటో కార్మికులకు దసరా కానుకగా రూ.15 వేలు అందజేస్తుందని తెలిపారు. ఈ పథకం అమలుకు రూ.435 కోట్లు కూటమి ప్రభుత్వం కేటాయించిందని, అక్టోబర్ 4న సుమారు 2.90 లక్షల మంది ఆటో డ్రైవర్లకు రూ.15 వేల చొప్పున ఆర్థిక సాయం అందించనున్నట్లు



చెప్పారు. ఆటోడ్రైవర్లను ఆర్థికంగా ఆదుకునేందుకే ఈ పథకానికి సీఎం చంద్రబాబు శ్రీకారం చుట్టారు. గత వైసీపీ ప్రభుత్వంలో కార్మికులను, కర్షకులను తీవ్ర ఇబ్బందులకు గురిచేశారు. జగన్ హయాంలో ఆటోడ్రైవర్లను వేధించుకుతిన్నారు. గ్రీన్ ట్యాక్స్ పేరుతో లారీ డ్రైవర్ల నుంచి వందల కోట్లు దోచుకున్నారు. నేడు ఎక్కడా పోలీసుల వేధింపులు లేవు. ఆటోడ్రైవర్లకు ఆర్థిక సాయం, లారీ డ్రైవర్లకు గ్రీన్ ట్యాక్స్ తగ్గింపుతో కూటమి ప్రభుత్వం కార్మికుల ప్రభు త్వమని నిరూపితమైంది. కార్మికుల పిల్లలు చదువుకోవాలనే లక్ష్యంతో తల్లికి వందనం ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉంటే అంత మందికి అందజేశాం. నిరుద్యోగులకు అండగా నిలిచేలా 16,347 డీఎస్సీ పోస్టులను ఏడాదిలోనే మంత్రి నారా లోకేష్ భర్తీ చేశారు. రూ.3 వేలు ఉన్న పెన్షన్ ను రూ.4 వేలు చేసి పేద ప్రజలను ఆదుకున్న ప్రభుత్వం మాది. అక్టోబర్ 4న ఆటో డ్రైవర్లకు పండుగ రోజు. సీఎం చంద్రబాబు ఆటో డ్రైవర్లకు దసరా కానుకగా రూ.435 కోట్లు అందజేస్తున్నారు. ఆటో డ్రైవర్లకు గత ప్రభుత్వంలో మాదిరి అరకొరగా కాకుండా ప్రతిఒక్కరికీ అందజేసే విధంగా ఈ పథకాన్ని కూటమి ప్రభుత్వం అమలు చేస్తోంది. దేశంలో ఎక్కడా ఏ రాష్ట్రం కూడా రూ.15 వేలు ఆటో డ్రైవర్లకు ఆర్థిక సాయంగా ఏ ప్రభుత్వం ఇవ్వడం లేదు. కేవలం సీఎం చంద్రబాబు ఆటో డ్రైవర్లకు ఆర్థికంగా అండ గా నిలవాలనే రూ.15 వేలు ఇస్తున్నారు. రాష్ట్రంలో కార్మిక కర్షక ప్రభుత్వం కొనసాగుతుంది. అన్ని వర్గాల అభివృద్ధి, సంక్షేమం కోరే సీఎం చంద్రబాబు పాలన సాగిస్తున్నారు. ఇప్పటికే రూ.11 లక్షల కోట్ల పెట్టుబడులను రాష్ట్రానికి తీసుకొచ్చి... 4.5 లక్షల ఉద్యోగాలు కల్పించినట్లు చెప్పారు.

## భూమి ఆక్రమణ..టీడీపీ నేతకు బెదిరింపులు

- వైసీపీ నేతల దౌర్జన్యంపై గ్రీవెన్స్‌లో ఫిర్యాదు
- అర్జీలు స్వీకరించిన స్వామినాయుడు, సత్తిబాబు

మంగళగిరి(చైతన్యరథం): టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం ప్రజావినతుల స్వీకరణ కార్యక్రమంలో అమలా పురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ ఆలాడ స్వామి నాయుడు, ఏపీ శెట్టి బాలిజ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ కుడిపూడి సత్తిబాబు అర్జీలు స్వీకరించారు. ప్రకాశం జిల్లా కురిచేడు మండలం పడమర నాయుడుపాలెంకు చెందిన పామూరి అరుణ నేడు నేతలకు అర్జీ ఇచ్చి అభ్యర్థిస్తూ.. తమ గ్రామంలో వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుంటాను. తమ గ్రామానికి తూర్పున, పడమర దిక్కున వాయిదా సామాన్లు అమ్ముకునే వారు వచ్చి సామగ్రి అమ్ము కుంటున్నారు. వాహనాన్ని పక్కకు తీసే క్రమంలో చెట్టు కింద ఉన్న బైక్‌ను రెండు మంచాలను ఢీకొట్టింది దీంతో మంచాలు విరిగాయి. దీనికి నష్టపరిహారం గురించి మాట్లాడుతుం డగా..వైసీపీ నాయకులు పామూరి బాలంకయ్య, చలంచర్ల బాల వెంకటేశ్వర్లు, పామూరి లక్ష్మీరాజ్యం, పామూరి సాయిలక్ష్మి, పామూరి నవీన్, పామూరి ప్రియాంకలు ఆమెపై దాడి చేసి అసభ్యపదజాలంతో దూషించారు. దీనిపై పోలీసులు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. వారిపై చర్యలు తీసుకోని తమ సమస్యను పరిష్కరించాలని అభ్యర్థించారు.

**భూమి ఆక్రమించి బెదిరింపులు**

పల్నాడు జిల్లా నాదెండ్ల మండలం కనపర్రు గ్రామానికి చెందిన ప్రకాశ్ రావు గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. తమ గ్రామంలో తమకు వారసత్వంగా ఆస్తి సక్రమించింది. గత ప్రభుత్వంలో ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి వద్ద గన్‌మెన్‌గా పనిచేసిన వ్యక్తి తమ స్థలాన్ని ఆక్రమించి తన అత్తగారింటికి అక్రమంగా రోడ్డు వేశాడు. దీనిపై ఫిర్యాదు చేయగా పోలీసులు, పెద్దలు, పంచాయతీ కార్యదర్శి సమక్షంలో అధికారులు సర్వే చేసి కబ్జాకు గురైన స్థలం చుట్టూ సర్వే హద్దురాళ్లు ఏర్పాటు చేయించారు. మళ్లీ పైరవీలు చేస్తూ రాత్రికి రాత్రే హద్దులు రాళ్లను తొలగించారు. అంతేకాకుండా పంచాయతీ కార్యదర్శిని పిలిపించి జిల్లా అధికారి మందలించేలా ఆ గన్‌మెన్ చక్రం తిప్పాడు. ఈ వ్యవహారంలో పెద్ద మనిషిగా వ్యవహరిస్తున్న టీడీపీ నేతను ఫోన్‌లో బెదిరించాడు. వారిపై చర్యలు తీసుకుని తమ సమస్యను పరిష్కరించాలని కోరాడు.

**అత్తింటి వేధింపులపై ఫిర్యాదు**

ఎన్టీఆర్ జిల్లా విజయవాడకు చెందిన కలపాల ఆనంద్ సుధాకర్ గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. తమ కుమార్తె కావ్యసుధను 09-10-2023న పందిరి రాహుల్‌రాజ్‌తో వివా హం జరిపించగా మూడు నెలల నుంచి భర్త, అత్తింటి వారు వేధింపులకు గురిచేస్తున్నారు. దీనిపై పెద్దల సమక్షంలో అనేక సార్లు మాట్లాడినా తమని లెక్కచేయకుండా చంపేస్తామని బెదిరిస్తున్నారు. దీనిపై కృష్ణలంక స్టేషన్లో ఫిర్యాదు చేస్తే ఎలాంటి చర్యలు తీసుకోలేదు. వారిపై చర్యలు తీసుకుని తమ సమస్యను పరిష్కరించాలని కోరాడు.

**స్థలాన్ని సర్వే చేయించి హద్దులు చూపాలి**

విశాఖపట్నానికి చెందిన గిరిజ గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. జీవీఎంసీ జోన్ 8, దుగ్గివానిపాలెం, ప్రకాశ్‌నగర్‌లో జీవనం సాగిస్తున్నాను. తమ కుటుంబానికి చెందిన ఇంటి స్థలం 1997లో రిజిస్టర్



చేయబడింది. ఇప్పటికి ఆ స్థలం కొనుగోలు చేసి 43 ఏళ్లు అవుతుంది.. ప్రస్తుతం ఈ స్థలం లేఅవుట్లో ఉంది. సర్వే నెం.123/2లో ఉన్న ఈ స్థలాన్ని సర్వే చేయించ డానికి రెవెన్యూ అధికారులకు అనేకసార్లు విజ్ఞప్తి చేసినప్పటికీ ఏటువంటి చర్యలు తీసుకోలేదు. తమ స్థలాన్ని సర్వే చేయించి హద్దులను నిర్ధారించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

**భూమిలోకి వెళ్లకుండా అడ్డుకుంటున్నారు**

విశాఖపట్నం జిల్లా రాయిపాలెం గ్రామానికి చెందిన అప్పల రెడ్డి గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. తమ గ్రామంలో సర్వే నం. 256/35 22 సెంట్లు, సర్వే నెం.250/38 5 సెంట్లు భూమి ఉంది. అయితే తమ మామ ఆదినారాయణ ఆయన కుమారుడు జూట్ మిల్లులో పనిచేయడానికి తగరపువలస వెళుతుంటారు. దీంతో తమ భూమి పక్కావారు తమ భూమిని ఆక్రమించి భూమిలోకి రానివ్వకుండా చేస్తున్నారు. భూమి సర్వే చేసేటప్పుడు వారు తమపై దాడి చేసి బెదిరించారు. వారిపై చర్యలు తీసుకుని తమ భూమి సమస్యను పరిష్కరించాలని కోరాడు.

# రాష్ట్రంలో అర్హతగల ప్రతి పేదవానికి పక్కాఇల్లు ఉండాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యం

●రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

●26 మంది పేదలకు ఇళ్ల పట్టాలు మంత్రి చేతుల మీదుగా పంపిణీ



నిమ్మాడ (చైతన్యరథం): అర్హులైన ప్రతీ పేదవాని సొంతింటి కలను నెరవేర్చేందుకు కూటమి ప్రభుత్వం దృఢసంకల్పంతో ముందుకెళ్తుందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. నియోజకవర్గంలోని కోటబొమ్మాళి మండలం కొత్తపేట గ్రామానికి చెందిన 26 మంది లబ్ధిదారులకు నిమ్మాడ క్యాంప్ కార్యాలయంలో మంత్రి చేతుల మీదుగా ఇళ్ల పట్టాలను మంగళవారం పంపిణీ చేశారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ... గత ప్రభుత్వం ఇళ్ల పట్టాల కోసం భూముల కొనుగోలులో పెద్దఎత్తున అవకతవకలకు పాల్పడ్డారని అన్నారు. నివాసయోగ్యం కాని భూములను, శ్మశానాలు, డంపింగ్ యార్డులు పక్కనున్న భూములను, వర్షం వస్తే మునిగిపోయే భూములను రెండింతల, మూడింతలుగా అధిక ధరలకు ప్రభుత్వంతో కొని పించారని పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం మాత్రం పేదలకు మేలు చేయాలనే లక్ష్యంతో అందరికీ పక్కా ఇళ్ల పథకాన్ని చేపట్టిందని తెలిపారు. అర్హులైన ప్రతిపేద వాడికి ఇంటి పట్టా ఇచ్చి ఇళ్లు కట్టించి ఇచ్చే బాధ్యతను కూటమి ప్రభుత్వం తీసుకుంటుందని స్పష్టం చేశారు. రాష్ట్రంలో వచ్చే నాలుగేళ్లలో అర్హతగల ప్రతి పేదవానికి పక్కాఇల్లు నిర్మించాలన్నదే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. గత ప్రభుత్వం రాష్ట్రంలో ఒక ప్రణాళిక, నిర్దిష్టమైన విజన్ లేకుండా గృహనిర్మాణ పథకం అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని దుయ్యబట్టారు. ఫలితంగా లబ్ధిదారులు తీవ్రంగా నష్ట పోయారని ఆరోపించారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం వచ్చే నాలుగేళ్లలో అర్హత కలిగిన మిగిలిన ప్రతి పేదవానికి అర్బన్‌లో 2 సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు చొప్పున ఇంటి స్థలాలు మంజూరు చేయడం జరుగుతుందని అన్నారు. ప్రజలందరికీ అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందాలన్నదే రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ అధ్యక్షులు కింజరాపు హరివర ప్రసాద్ పాల్గొన్నారు.

## ముంపు ప్రాంతాల శాశ్వత పరిష్కారానికి పటిష్ట చర్యలు

◆ప్రజల ఆరోగ్యం, సంక్షేమమే ప్రధాన లక్ష్యం

◆శ్రీకాకుళం శాసనసభ్యులు గొండు శంకర్




శ్రీకాకుళం (చైతన్యరథం): శ్రీకాకుళం నగరంలో ముంపు ప్రాంతాల శాశ్వత పరిష్కారానికి సమగ్ర ప్రణాళిక రూపొందించమని శ్రీకాకుళం శాసనసభ్యులు గొండు శంకర్ పేర్కొన్నారు. గడచిన 30 ఏళ్లలో శ్రీకాకుళం నగర పరిసర ప్రాంతాలు ముఖ్యంగా చాపురం పంచాయతీ పరిధి గోవిందనగర్, ఇందిరానగర్, రాంనగర్, తిలక్ నగర్, భాస్కర్ నగర్ తదితర ప్రాంతాలలో సరైన ప్రణాళిక లేకుండా వేసిన లేఔట్లు వల్ల చిన్న వర్షం పడినప్పటికీ రహదారులంతా జలమయం అవుతున్నాయి. గత పాలకుల నిర్లక్ష్యంతో నేడు ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. ముంపు సమస్య శాశ్వత పరిష్కార నిమిత్తం ఆగస్టు 27 వినాయక చవితి పర్వదినమున ఎమ్మెల్యే శంకర్ స్వయంగా పర్యటించారు. తనతోపాటు మున్సిపల్ కమిషనర్ ఇతర ఇంజనీరింగ్ అధికారులు సిబ్బందిని వెంట తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి అవసరమైన ప్రణాళికలు రచించాలని తక్షణమే ఆదేశించారు. నాటి ఆదేశాలు మేరకు అధికారులు ఎస్టిమేషన్స్ వేసి వర్క్ ఆర్డర్ తయారు చేశారు. త్వరలో పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ముంపు ప్రాంతాల ప్రజలు గమనించగలరని పేర్కొన్నారు. తక్షణం ముంపు ప్రాంతాల సమస్య పరిష్కారానికి కోటి 72 లక్షల రూపాయల నిధులను, అదేవిధంగా నగరంలో నీలమ్మ తల్లి కాలనీ ముంపు సమస్య నివారణకు కోటి 60 లక్షలు ప్రభుత్వం మంజూరు చేసిందని అన్నారు.

నగరంలో డ్రైనేజీ సమస్య పరిష్కారానికి శాశ్వతమైన భూగర్భ డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు అనుకూలంగా ఉన్నదా లేదా అని తెలుసుకునేందుకు ఓ అనుభవజ్ఞ సంస్థతో సమగ్ర ప్రాజెక్టు రిపోర్ట్ తయారు చేస్తున్నామని నివేదిక ఆధారంగా త్వరలో చర్యలు చేపడతామని తెలిపారు. ప్రజా ప్రతినిధిగా సమస్య పరిష్కారానికి ముందుగానే చర్యలు తీసుకున్నప్పటికీ సమాచారం తెలుసుకోకుండా ఆందోళన చేయడం సరికాదని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

# పేదలకు అండగా సీఎం సహాయ నిధి : మంత్రి గుమ్మిడి సంధ్యారాణి

● సాలూరులో రూ.8.55 లక్షల చెక్కులు పంపిణీ




సాలూరు (చైతన్యరథం): పేదల ఆర్థిక సమస్యలపై ప్రభుత్వం అండగా సీఎం సహాయ నిధి నిలుస్తుందని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి వ్యాఖ్యానించారు. మంగళవారం సీఎం సహాయ నిధి ద్వారా పలు మండలాల్లో చికిత్స కోసం సహాయం సీఎంఆర్ఎఫ్‌కు ధరఖాస్తు చేసుకోగా... అందుకు సంబంధించిన చెక్కులను మంగళవారం మంత్రి గుమ్మిడి సంధ్యారాణి వాటిని లబ్ధిదారులకు అందజేశారు. రూ.8,55,105 విలువైన పది చెక్కులను లబ్ధిదారులకు అందజేసిన అనంతరం ఆమె మాట్లాడుతూ... "ప్రభుత్వం నిరంతరం ప్రజల సంక్షేమం కోసం కృషి చేస్తోంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలో ప్రతి పౌరునికి అండగా ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నాం" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో అనేక గ్రామాల నుంచి లబ్ధిదారులు హాజరయ్యారు. శివరాంపురం, సాలూరుకి చెందిన కారిబుగత జోగారావుకి 71,087 చెక్కు అందింది. కూర్మారాజుపేట, సాలూరుకు చెందిన కనిరెడ్డి అప్పలనాయుడుకి రూ.55,077, 25వ వార్డ్ సాలూరు టౌన్‌కు చెందిన నల్ల వరుణ్‌కి రూ.44,555, 18వ వార్డ్‌కు చెందిన మాచర్ల మంజూషకి రూ.57,515, 14వ వార్డ్‌కు చెందిన పనస జగదీశ్‌కి రూ.56,715 ఆర్థిక సహాయం అందింది. అలాగే 19వ వార్డ్, సాలూరు టౌన్‌కు చెందిన చీపురుపల్లి సత్య గంగాధర్‌కి రూ.1,80,273, కర్రివలస, పాచిపెంటకు చెందిన కండి శంకరరావుకి రూ.1,25,956, మోసూరు, పాచిపెంటకు చెందిన కరతన తౌడుకి రూ.1,21,427, బాడెవలస, మెంటాడకు చెందిన జొన్నాడ సత్యంకి రూ.1,02,500, కొంపంగి, మెంటాడకు చెందిన డాడీ అప్పలనాయుడుకి రూ.40,000 చెక్కులు అందించారు. లబ్ధిదారులు తమకు చికిత్స సమయంలో వచ్చిన ఆర్థిక ఒడిదుడుకుల సమయంలో ప్రభుత్వం అండగా నిలిచిందని హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో దోహదపడిందని పేర్కొన్నారు. ప్రభుత్వ అనుభూతిని వ్యక్తీకరిస్తూ, వారు సీఎం చంద్రబాబుకి, మంత్రి సంధ్యారాణికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# విద్యార్థులకు మంచి బోధన అందించాలి : ఎమ్మెల్యే అతిథి

విజయనగరం (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి లోకేశ్‌ల విజ్ఞానం, కృషితోనే విజయవంతంగా ఉపాధ్యాయ డీఎస్సీని పూర్తి చేశారని ఎమ్మెల్యే పూసపాటి అదితి గజపతిరాజు కొనియాడారు. డీఎస్సీలో ఉపాధ్యాయ ఉద్యోగం పొందిన విజయనగరం నియోజకవర్గం అభ్యర్థులు మంగళవారం విజయనగరంలో అదితి గజపతిరాజుని కలిశారు. విద్యార్థులకు మంచి బోధన అందించాలని, వారిని ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోరారు. కొత్త ఉపాధ్యాయులను ఎమ్మెల్యే అభినందించారు.



# నందిగామలో 55 మంది ఉపాధ్యాయులకు సన్మాన కార్యక్రమం

నందిగామ (చైతన్యరథం): రాష్ట్ర వ్యాప్తంగా మెగా డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ ఉద్యోగాలు పొందిన అభ్యర్థులలో నందిగామ నియోజకవర్గం నుంచి 69 మంది ఎంపికయ్యారు. ఈ సందర్భంగా నందిగామలో 55 మంది ఉపాధ్యాయులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా తంగిరాల సౌమ్య మాట్లాడుతూ.. కేవలం 15 నెలల వ్యవధిలోనే మెగా డీఎస్సీ నిర్వహించి 16,347 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించారన్నారు. సీఎం చంద్రబాబు డీఎస్సీపై తొలి సంతకం చేసి, ఈ ప్రక్రియకు శ్రీకారం చుట్టారన్నారు. 15 సంవత్సరాల పాలనలో 12 సార్లు డీఎస్సీ నిర్వహించి దాదాపు 2 లక్షల మందిని ఉపాధ్యాయులుగా తీర్చిదిద్దిన చంద్రబాబు సేవలు ఆజన్మాంతం గుర్తుంచుకోవాల్సినవే అని కొనియాడారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్ పర్సన్ మండవ కృష్ణకుమారి పాల్గొన్నారు.



# ఉత్తరకోస్తాకు భారీ వర్ష సూచన... 24 గంటల్లో అల్పపీడనం

అమరావతి (చైతన్యరథం): ఉత్తర కోస్తా పరిసర ప్రాంతాల్లో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. ఇది 24 గంటల్లో అల్పపీడనంగా మారే అవకాశం ఉంది. దీని ప్రభావంతో రాగల 24 గంటల్లో ఉత్తరకోస్తాలో ఒకటి రెండు చోట్ల భారీ వర్షాలు.. దక్షిణ కోస్తా ప్రాంతంలో కొన్నిచోట్ల ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. కోస్తాంధ్ర అంతటా ఎల్లో అలర్ట్ జారీ చేశారు.

**ప్రకాశం బ్యారేజ్ వద్ద కొనసాగుతున్న వరద ఉద్ధృతి**

మరోవైపు విజయవాడ ప్రకాశం బ్యారేజ్ వద్ద వరద ఉద్ధృతి కొనసాగుతోంది. బ్యారేజ్ దిగువన వారధి వద్ద ముందస్తు చర్యల్లో భాగంగా 3 వేల ఇసుక బస్తాలను అధికారులు సిద్ధం చేసి ఉంచారు. ఇప్పటికే రెండో ప్రమాద హెచ్చరికను ప్రకటించారు. బ్యారేజ్‌లోకి 6.55 లక్షల క్యూసెక్కుల నీరు చేరుతుండగా.. సముద్రంలోకి 6.39 లక్షల క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. మరోవైపు ధవళేశ్వరం బ్యారేజ్ వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక కొనసాగుతోంది. సముద్రంలోకి 10.20 లక్షల క్యూసెక్కుల మిగులు జలాలను విడుదల చేస్తున్నారు.



# కోనసీమలో జరిగిన పేలుడు ఘటనపై మంత్రి అచ్చెన్నాయుడు దిగ్భ్రాంతి

టెక్కలి (చైతన్యరథం): కోనసీమ జిల్లా అయినవిల్లి మండలం విలస దగ్గర కిరాణా దుకాణంలో జరిగిన పేలుడు ఘటనపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఈ ఘటనలో దంపతులు శ్రీనివాసరావు (50), సీత (48) మృతి చెందడం పట్ల ప్రగాఢ సంతాపం తెలిపారు. వారి కుటుంబ సభ్యులకు ధైర్యం నింపుతూ ప్రభుత్వం పూర్తిగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలు పొందిన యువకుడికి మెరుగైన వైద్యం అందచేయాలని అధికారులను ఆదేశించారు. అతను త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఇలాంటి విషాదకర ఘటనలు మరలా జరగకుండా ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా ఇళ్లలో మరియు దుకాణాల్లో పేలుడు పదార్థాలు లేదా ప్రమాదకర వస్తువులను నిల్వచేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రి అచ్చెన్నాయుడు సూచించారు.

# కృష్ణమ్మ చెంత అమ్మవారు, రాజకీయ చైతన్యానికి పుట్టినిల్లు విజయవాడ ప్రత్యేకత

**●మైసూరు, కలకత్తా దసరా ఉత్సవాలకు సమానంగా విజయవాడ ఉత్సవ్**

**●ఎంపీ కేశినేని శివనాథ్ నాకు స్ఫూర్తి : కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ.**




విజయవాడ (చైతన్యరథం): పున్నమి ఘాట్‌లో జరుగుతున్న విజయవాడ ఉత్సవ్ వేడుకలకు కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "విజయవాడ చరిత్రకు అద్భుతమైన గట్టానికి తెరదీసిన వ్యక్తి ఎంపీ కేశినేని శివనాథ్" అని ప్రశంసించారు. "విజయవాడకు గొప్ప చరిత్ర ఉంది. కృష్ణమ్మ చెంత వెలసిన అమ్మవారితో పాటు దేశంలో రాజకీయ చైతన్యం కలిగిన ప్రాంతంగా ఈ నగరానికి ప్రత్యేక గుర్తింపు ఉంది."నవరాత్రుల సందర్భంలో ఇక్కడి అమ్మవారి సాక్షిగా ఇలాంటి ఉత్సవాలు ఇప్పటివరకు జరగకపోవడం ఆశ్చర్యకరం. దసరా సందర్భంగా మైసూరు, కలకత్తా ఉత్సవాలను చూసేందుకు ప్రజలు దేశం నలుమూలల నుంచి వెళ్తారు. ఇకపై విజయవాడ కూడా ఆ స్థాయిలో ఉత్సవాలకు వేదిక కావాలి." ఎంపీ కేశినేని శివనాథ్ చొరవతో సొసైటీ ఫర్ వైబ్రెంట్ సంస్థ రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో నిర్వహిస్తున్న ఈ ఉత్సవం నగర చరిత్రలో మరొక మైలురాయిగా నిలుస్తుందని ఆయన అభినందించారు. మన సంస్కృతి, సంప్రదాయాలు, కళలను భవిష్యత్తు తరాలకు అందించేందుకు ఇలాంటి వేడుకలు ఎంతో అవసరం. చాలా తక్కువ సమయంలో ఇంత పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేసిన ఎంపీ కేశినేని శివనాథ్‌ను అభినందిస్తున్నాను. రాబోయే సంవత్సరాల్లో విజయవాడ ఉత్సవం మరింత అద్భుతంగా జరుగుతుంది. ఎంపీ కేశినేని నాకు కూడా స్ఫూర్తి. ఆయన సూచనతో రాబోయే సంక్రాంతికి మా జిల్లాలో సంప్రదాయ పద్ధతిలో నాలుగు రోజుల పాటు ఒక ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తాను." అని మంత్రి అన్నారు.

**ఈ సందర్భంగా ఎంపీ శివనాథ్ మాట్లాడుతూ...** "విజయవాడకు ఉన్న చారిత్రక, సాంస్కృతిక, ఆధ్యాత్మిక వైభవాన్ని విజయవాడ ఉత్సవ్ వంటి వేదికల ద్వారా దేశం మొత్తం ఎదుట ప్రదర్శించాలన్నది నా లక్ష్యం." అని అన్నారు.

**కేడీసీసీ బ్యాంకు అధ్యక్షుడు నెట్టెం రఘురాం మాట్లాడుతూ...** ఈ వేడుకలు నగర గౌరవానికి ప్రతీకగా నిలుస్తున్నాయని అన్నారు. విజయవాడ సాంస్కృతిక వైభవం దేశవ్యాప్తంగా ప్రతిధ్వనించేలా ఎంపీ కేశినేని శివనాథ్ చొరవ తీసుకోవడం అభినందనీయమని ఆయన పేర్కొన్నారు.

**మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న మాట్లాడుతూ...** నవరాత్రి సందర్భంలో నిర్వహిస్తున్న విజయవాడ ఉత్సవ్, కేవలం వినోదం మాత్రమే కాకుండా ప్రజల ఐక్యతకు ప్రతీక అని ఆయన అన్నారు. స్థానిక కళలు, సాంప్రదాయాలు, సంస్కృతిని భవిష్యత్తు తరాలకు అందించేందుకు ఇలాంటి ఉత్సవాలు ఎంతో అవసరమని పేర్కొన్నారు.

**స్వచ్ఛంద కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభి మాట్లాడుతూ...** భవిష్యత్తులో విజయవాడ ఉత్సవ్‌ను రాష్ట్ర స్థాయి సాంస్కృతిక వేడుకగా జరుగుతుందని, విజయవాడ ఉత్సవ్ నగరానికి మరొక గుర్తింపు తీసుకువచ్చింది. ఈ ఉత్సవం ప్రతి ఏటా మరింత అద్భుతంగా జరుగుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నాగుల్ మీరా, నియోజకవర్గ పరిశీలకులు చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

# విజయవాడ ఉత్సవ్ వేదికపై కాంతారా మూవీ టీం సందడి

**●ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు విచ్చేసిన హీరో, దర్శకుడు రిషబ్ శెట్టి, అతని భార్య ప్రగతిశెట్టి, హీరోయిన్ రుక్మిణి వసంత్**

**●చిత్ర బృందానికి స్వాగతం పలికిన ఎంపీ కేశినేని శివనాథ్**

**●వేలాదిగా తరలివచ్చిన ప్రజలతో కిటకిటలాడిన ప్రాంగణం**




విజయవాడ (చైతన్యరథం): విజయవాడ ఉత్సవ్‌లో భాగంగా గొల్లపూడి ఎగ్జిబిషన్ మైదానం వేదికపై కాంతారా మూవీ టీం మంగళవారం రాత్రి సందడి చేసింది. కాంతారా చాప్టర్ 1 మూవీ ప్రీ రిలీజ్ ఈవెంట్ కు హీరో, దర్శకుడు రిషబ్ శెట్టి, అతని సతీమణి ప్రగతి శెట్టి, హీరోయిన్ రుక్మిణి వసంత హాజరయ్యారు. విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ చిత్ర బృందానికి ఘన స్వాగతం పలికారు. ప్రేక్షకుల కరతాళ ధ్వనులు, కేరింతల నడుమ సినిమా ట్రైలర్ ను విడుదల చేశారు. అలాగే మూవీలోని ఒక సాంగ్ విడుదల చేయగా, ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ సందర్భంగా హీరో రిషబ్ శెట్టి మాట్లాడుతూ తెలుగు ప్రేక్షకుల ఆశీర్వాదం వల్లే కాంతారా మూవీ విజయవంతమైందని, అలాగే అక్టోబర్ 2న విడుదలవుతున్న కాంతారా చాప్టర్ 1మూవీని సినిమా థియేటర్లో తిలకించి విజయవంతం చేయాలని కోరారు. తమ సినిమాను ఆశీర్వదించిన జూనియర్ ఎన్టీఆర్ ప్రభాస్, ప్రభాస్ కు అలాగే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు కృతజ్ఞతలు తెలిపారు. హీరోయిన్ రుక్మిణి వసంత, ఈ సినిమాకు కాస్ట్యూమ్స్ డిజైనర్ గా పనిచేసిన ప్రగతి శెట్టి మాట్లాడుతూ కాంతారా చాప్టర్ 1 మూవీ ప్రేక్షకుల అభిరుచికి తగినట్టుగా ఉంటుందని, ఈ సినిమాను తిలకించి ఆశీర్వదించాలని కోరారు. ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ ఈ సినిమా ఘనవిజయం సాధిస్తుందని, అలాగే సినిమా విజయోత్సవాన్ని విజయవాడలో జరుపుకుంటారని ఆకాంక్షించారు. కార్యక్రమానికి హాజరైన ప్రముఖులు ప్రతి ఒక్కరు ఈ సినిమా ఘన విజయం సాధిస్తుందని మాట్లాడారు. చిత్ర బృందానికి ఆశీస్సులు అందించారు. సొసైటీ ఫర్ వైబ్రెంట్ విజయవాడ ప్రెసిడెంట్ ముత్తవరపు మురళీ కృష్ణ, మైత్రి మూవీ మేకర్స్ నిర్మాత రవి శంకర్, విజయవాడ ఉత్సవ్ కమిటీ సభ్యుడు, నిర్మాత అనిల్ సుంకర, కలెక్టర్ లక్ష్మీశా, లక్ష్మీశా సతీమణి సుప్రీత, హోంబలే కో ఫౌండర్ చలువే గౌడ, కేడీసీసీ బ్యాంకు చైర్మన్ నెట్టెం రఘురాం, స్వచ్ఛఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభి, మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న, టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి నాగుల్ మీరా, జిల్లా పరిషత్ మాజీ చైర్ పర్సన్ గద్దె అనురాధ తదితరులు పాల్గొన్నారు.

# సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన మంత్రులు



విజయనగరం (చైతన్యరథం): దత్తిరాజేరు మండలం దత్తిలో బుధవారం జరిగే ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన ఏర్పాట్లను మంగళవారం జిల్లా ఇన్చార్జి మంత్రి, హోంమంత్రి వంగలపూడి అనిత, శిశు సంక్షేమశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు పరిశీలించారు. అనంతరం ఏర్పాట్లపై కలెక్టర్ రామసుందర్ రెడ్డి, ఎస్పీ దామోదర్‌తో చర్చించారు. సీఎం పర్యటనకు అన్ని ఏర్పాట్లు సిద్ధమయ్యాయని కలెక్టర్ వివరించారు.

# కాకినాడకు చేరుకున్న తప్పిపోయిన మత్స్యకారులు



కాకినాడ (చైతన్యరథం): నావిగేషన్ లోపంతో శ్రీలంకలో చిక్కుకున్న మత్స్యకారులను కూటమి ప్రభుత్వం కృషితో విడుదల చేయడంతో వారు మంగళవారం వారు కాకినాడకు చేరుకున్నారు. శ్రీలంక నుండి విడుదలై కాకినాడ చేరుకున్న మత్స్యకారులకు ఎమ్మెల్యే కొండబాబు, ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, శాసనమండలి సభ్యులు పేరాబత్తుల రాజశేఖర్, జనసేన నాయకులు తుమ్మలబాబు తదితరులు స్వాగతం పలికారు. మత్స్యకారులను కేంద్ర ప్రభుత్వ సహాయంతో విడిపించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చిత్రపటానికి మత్స్యకారులు పాలాభిషేకం నిర్వహించారు.

# ప్రజలకు అమ్మవారు సకల విజయాలు చేకూర్చాలి

**●ప్రజానీకానికి దుర్గాష్టమి శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే వెనిగండ్ల రాము**



గుడివాడ (చైతన్యరథం): ప్రజలందరూ దసరా పండుగను సంతోషంగా జరుపుకోవాలని ప్రజలందరిపై అమ్మవారి కరుణాకటాక్షాలు ఉండాలని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఆకాంక్షించారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలు మరియు కూటమి ప్రభుత్వానికి సకల విజయాలు చేకూరాలని ఆయన ప్రార్థించారు. గుడ్లవల్లేరు మండలం వేమవరంలో ప్రసిద్ధిగాంచిన శ్రీ కొండాలమ్మ అమ్మవారి దేవస్థానంలో శ్రీదేవి శరన్నవరాత్రుల గ్రామోత్సవ ఊరేగింపు మంగళవారం అత్యంత వైభవంగా ప్రారంభమైంది. ముందుగా దుర్గాష్టమి సందర్భంగా శ్రీ కనకదుర్గ దేవి అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చిన అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించిన ఎమ్మెల్యే రాము అమ్మవారి ఉత్సవ విగ్రహాలు ఏర్పాటు చేసిన వాహన రథానికి శాస్త్రోక్త పూజలు నిర్వహించి గ్రామోత్సవ ఊరేగింపును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఊరేగింపు వాహనాన్ని స్వయంగా నడిపిన ఎమ్మెల్యే రాము భక్తులను ఉత్సాహపరిచారు. ఊరేగింపులో ఏర్పాటు చేసిన శక్తి వేషాలు, డప్పు వాయిద్యాలు, కోలాట ప్రదర్శనలు, కేరళ, దక్షిణ భారతదేశ సాంప్రదాయ వాయిద్యాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఎమ్మెల్యే రాము మరియు కూటమి నాయకులతో కలిసి వేడుకల్లో పాల్గొన్న ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు... అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేశారు. కన్నుల పండుగగా జరుగుతున్న అమ్మవారి గ్రామోత్సవ ఊరేగింపులో పాల్గొనడం సంతోషంగా ఉందని ఎమ్మెల్యే రాము హర్షం వ్యక్తం చేశారు. అమ్మవారి ఆశీస్సులతో ఈ ఏడాది శరన్నవరాత్రి ఉత్సవాలు ఎంతో వైభవంగా ఎంతో వైభవంగా జరిగాయని.... ఉత్సవాల్లో భాగస్వామ్యం కావడం సంతోషంగా ఉందని ఎమ్మెల్యే రాము అన్నారు. పెద్ద ఎత్తున ఊరేగింపు మరియు 20వేల మంది భక్తులకు పైగా అఖండ అన్న సమారాధన ఏర్పాట్లను లోటుపాట్లు లేకుండా చేసిన దేవాదాయ శాఖ అధికారులు.... ధర్మకర్తల కమిటీ సభ్యులను ఎమ్మెల్యే రాము అభినందించారు. ఊరేగింపు వేడుకల్లో ఏపీ స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి కొనకళ్ల బుల్లయ్య, దేవస్థాన ధర్మకర్తల కమిటీ చైర్మన్ ఈడే మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# 75 మంది డీఎస్సీ అభ్యర్థులను సన్మానించిన ఎమ్మెల్యే

నందిగామ (చైతన్యరథం): జగ్గయ్యపేట నియోజకవర్గంలో డీఎస్సీ 2025లో విజయం సాధించిన 75 మంది అభ్యర్థులను ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయులుగా, భాషా పండితులుగా, ఫిజికల్ డైరెక్టర్లుగా 75 మంది అభ్యర్థులు ఎంపికయ్యారు. జగ్గయ్యపేటలో ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ నివాసంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. అభ్యర్థులకు ఎమ్మెల్యే దుస్తులు పంపిణీ చేశారు. జీవితాంతం గుర్తుండే సర్వీస్ రిజిస్టర్ కూడా అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. "అన్ని వృత్తుల్లో నాకు అత్యంత ఇష్టమైనది ఉపాధ్యాయ వృత్తి. ఒక ఉపాధ్యాయుడు సమాజాన్ని తీర్చిదిద్దగలడు. విద్యార్థులను ఉన్నత శిఖరాలకు చేర్చగలడు. నా నియోజకవర్గంలో 75 మంది కొత్త ఉపాధ్యాయులు ఎంపిక కావడం పూర్వజన్మ సుకృతం.. మీరందరూ ఉత్తమ ఉపాధ్యాయులుగా నిలిచి, విద్యార్థులకు వెలుగునిచ్చే మార్గదర్శకులుగా నిలవాలని కోరుకుంటున్నాను" అని అన్నారు.

# నవరాత్రుల బందోబస్తు విధులకు వచ్చిన ఎస్సై మృతి

విజయవాడ (చైతన్యరథం): విజయవాడలో దసరా నవరాత్రులు బందోబస్తు విధులకు వచ్చిన విజయనగరం జిల్లా పూసపాటిరేగ పోలీస్ స్టేషన్ ఎస్సై వద్దాది శ్రీనివాసరావు ఆకస్మిక మృతి ఆవేదన కలిగించిందని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. 57 ఏళ్ల శ్రీనివాసరావు గుండెపోటుతో చనిపోవడం విచారకరమన్నారు. శ్రీనివాసరావు కుటుంబ సభ్యులకు సీఎం ప్రగాఢ సానుభూతి తెలిపారు. ప్రభుత్వ పరంగా ఆయన కుటుంబాన్ని ఆదుకుంటామని భరోసానిచ్చారు.

## వరద ప్రభావిత లంక గ్రామాల పునరావాసం కోసం అధికారులతో సమీక్షా సమావేశం



వేమూరు (చైతన్యరథం): కొల్లూరు మండలంలోని ఎంప్లాయిస్ రిక్రియేషన్ క్లబ్‌లో మంగళవారం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు నియోజకవర్గ శాసనసభ్యులు నక్కా ఆనందబాబు. వరద ప్రభావిత లంక గ్రామాల పరిస్థితిని సమీక్షించి కీలక సూచనలు చేశారు. ఇటీవలి వరదల కారణంగా తీవ్రంగా నష్టపోయిన కొల్లూరు మండలంలోని లంక గ్రామాల ప్రజల పునరావాసం, సహాయక చర్యలు, అవసరమైన మౌలిక సదుపాయాల పునరుద్ధరణ వంటి అంశాలపై అధికారులు సమగ్ర నివేదిక అందించాలని ఎమ్మెల్యే ఆదేశించారు. ప్రజలకు తక్షణ సహాయం అందించడంతో పాటు, భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా శాశ్వత చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. ప్రతి గ్రామంలో పరిస్థితులను దగ్గరగా పరిశీలించి, ఆహారం, తాగునీరు, వైద్య సదుపాయాలు, రహదారి మౌలిక సదుపాయాలు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు అధికారులను కోరారు. అలాగే, ప్రభుత్వం అందించే అన్ని సహాయక పథకాల ప్రయోజనాలు ప్రతి బాధిత కుటుంబానికి చేరేలా పర్యవేక్షణ బృందాలు ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో మున్సిపల్, రెవెన్యూ, పంచాయతీ రాజ్, ఆరోగ్య శాఖ అధికారులతో పాటు స్థానిక ప్రజా ప్రతినిధులు కూడా పాల్గొన్నారు.

## కుమ్మర వృత్తుల వారికి చేయూతనివ్వాలి

**●పల్నాడు జిల్లా కలెక్టర్ కృతికా శుక్లని కోరిన శాలివాహన సంఘం అధ్యక్షుడు నడికుడి వెంకటేశ్వరరావు, సంఘం నాయకులు**



నరసరావుపేట (చైతన్యరథం): పల్నాడు జిల్లా నరసరావుపేట పట్టణం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ కృతికా శుక్లని కుమ్మర శాలివాహన సంక్షేమ సంఘం అధ్యక్షులు నడికుడి వెంకటేశ్వరావు, నరసరావుపేట నియోజకవర్గం మరియు పట్టణ, మండల కుమ్మర శాలివాహన సంక్షేమ సంఘం నాయకులు కలిసి వినతి పత్రం అందజేశారు. జిల్లాలో పలు మండలాల్లో, గ్రామాల్లో కుమ్మర్లు ఎదుర్కొంటున్న సమస్యల గురించి,1076 జీవో గురించి, కుండలు, ఇటుక తయారు చేసుకునే వారికి మట్టి సరిగా అందక ఇబ్బందులు పడుతున్నారని, గ్రామాల్లో కుల వృత్తి చేసుకునే వారికీ చెరువు భూముల్లో ఉండే బంకమట్టిని సంవత్సరానికి కనీసం పది ట్రక్కులు ఇప్పించే విధంగా చూడాలని కోరారు. జిల్లాకి ప్రధాన నగరమైన నరసరావుపేట పట్టణంలో తొలి తెలుగు కవయిత్రి మొల్లమాంభ విగ్రహాన్ని లేదా ప్రధమంద్రపాలకుడు శాలివాహన శకపురుషుడు శాలివాహన చక్రవర్తి విగ్రహాన్ని ఏర్పాటు చేసే విధంగా స్థలం కేటాయించాలని కోరారు.

## దళితవాడల్లో ఆలయాల నిర్మాణం తప్పా?

**● కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు షర్మిల వ్యాఖ్యలపై టీడీపీ నేత ఈమని సూర్యనారాయణ మండిపాటు**




ఎన్టీఆర్ జిల్లా (చైతన్యరథం): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పేద, బడుగు, బలహీన వర్గాల, దళితవాడల ప్రాంతాల్లో 5వేల ఆలయాలు నిర్మిస్తామని ప్రకటన చేయడంపై కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు షర్మిలకు వచ్చిన ఇబ్బంది ఏంటని రాష్ట్ర బ్రాహ్మణ సాధికారిక సమితి అధికార ప్రతినిధి, ఎన్టీఆర్ జిల్లా తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి ఈమని సూర్యనారాయణ ప్రశ్నించారు. షర్మిల మాట్లాడుతూ... విద్యార్థులకు హాస్టల్లో, స్కూల్లు కట్టవచ్చు కదా అన్నారని, ప్రజలు కట్టే పన్నులతో గాని, రాష్ట్ర ప్రభుత్వం ఆదాయం నుండి గాని దేవాలయాలు నిర్మించడం లేదనే సంగతి షర్మిల అర్థం చేసుకోవాలన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం నుండి వచ్చే ఆదాయం నుండి, దాతలు నుండి వచ్చే కానుకలతో ఇటువంటి దైవ కార్యక్రమం చేస్తున్నారని, దీనిని రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు స్వాగతించారు అన్నారు. గతంలో షర్మిల తండ్రి రాజశేఖర్ రెడ్డి, అన్న జగన్ రెడ్డి పాలనలో హిందూ దేవాలయాలపై జరిగిన దాడులు, హిందువుల అణచవేత, దేవాలయాల ఆస్తులు అన్యాక్రాంతం, దేవాదాయ భూములకు కబ్జాలు షర్మిల మర్చిపోయారా అని ఎద్దేవా చేశారు. హిందువులపై రాజశేఖర్ రెడ్డి కుటుంబం విషం కక్కుతుందని అనడానికి షర్మిల వ్యాఖ్యలు నిదర్శనం అన్నారు. హిందూ ధర్మంపై వైయస్ కుటుంబం నిత్యం దాడి చేసిందన్నారు. షర్మిల వ్యాఖ్యలు హిందువుల మనోభావాలను దెబ్బతీసేలా ఉన్నాయన్నారు. పదేపదే అవమానించడం పరిపాటిగా మారిందని అన్నారు.

## అధికారమంటే ప్రజలకు సేవ చేయడమని నిరూపించిన నాయకుడు చంద్రబాబు : ప్రత్తిపాటి

**● జీఎస్టీ సంస్కరణల వల్ల కలిగే లబ్ధిని, ట్రూ డౌన్ ఛార్జీల మొత్తాన్ని ప్రజలకే అందివ్వడం నూతన చరిత్రనే చెప్పాలి**



చిలకలూరిపేట (చైతన్యరథం): "అధికారమంటే అవినీతి.. అప్పనంగా దోచుకోవడం.. వ్యవస్థలను నిర్వీర్యం చేయడం.. ఎదిరించిన వారిని హింసించడమే అన్నట్టుగా సాగిన జగన్ దుర్మార్గపు పాలనకు.... పరిపాలనంటే ప్రజాహితం.. వారి సంతోషం.. సంక్షేమమనే దిశగా, పాలకుల ప్రతి ఆలోచనా ప్రజలకు మేలుచేసే దిశగా ఉండాలన్న సమున్నత లక్ష్యంతో సాగుతున్న కూటమిపాలనకు మధ్య వ్యత్యాసాన్ని ప్రతి ఒక్కరూ గ్రహించాలి." అని నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు వ్యాఖ్యానించారు. ప్రజలు ఎన్నుకున్న ప్రజాప్రభుత్వం సాగిస్తున్న అభివృద్ధి, సంక్షేమం సమపాళ్ల పాలనలో నిత్యం ప్రజలకు పండగే అనడానికి కూటమి ప్రభుత్వ తాజా నిర్ణయాలు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి ఆలోచనాత్మక విధానాలే నిదర్శనం. ప్రజల ముక్కుపిండి విద్యుత్ ఛార్జీలు వసూలుచేసిన గత పాలకులకు భిన్నంగా ప్రజలకే తిరిగిస్తున్న నేటి పాలకుల ఆలోచన సదా ప్రశంసనీయం అని తెలిపారు.

**15 నెలల్లో విద్యుత్ రంగాన్ని తిరిగి గాడిలో పెట్టిన ఘనత చంద్రబాబుదే**

జగన్ అవినీతికి పూర్తిగా కుదేలైన రాష్ట్ర విద్యుత్ రంగాన్ని కేవలం 15 నెలల్లోనే గాడిలో పెట్టి, విద్యుత్ తయారీ, సరఫరాలో తలెత్తే నష్టాలను అధిగమించి, పంపిణీ సంస్థలపై పడిన భారాన్ని తగ్గించడం సామాన్య విషయం కాదు. ట్రూ అప్ లకే పరిమితమైన గత పాలకుల చర్యలతో విద్యుత్ భారాలతో అల్లాడిపోయిన రాష్ట్ర ప్రజానీకానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నేడు ట్రూ డౌన్‌ను పరిచయం చేయడం ఆయన పనితీరుకు నిదర్శనమనే చెప్పాలి. విద్యుత్ కొనుగోళ్లలో ఆదా అయిన రూ.1000కోట్లను (రూ.923.55కోట్లు) నేరుగా ప్రజలకే అందించేలా ఆయన తీసుకున్న నిర్ణయం సదా ప్రశంసనీయం. ప్రజల నుంచి ముక్కుపిండి వసూలు చేసిన గత పాలకులకు భిన్నంగా ప్రజలకే తిరిగివ్వాలనే నేటి పాలకుల ఆలోచనా విధానం గురించి ఎంతచెప్పినా తక్కువే. మొన్నటికి మొన్న జీఎస్టీ 2.0 సంస్కరణల వల్ల రాష్ట్రానికి కలిగే రూ.8వేల కోట్ల ప్రయోజనాన్ని, నేరుగా ప్రజలకే అందించిన చంద్రబాబు... తాజాగా మరో వెయ్యికోట్ల లబ్ధిని ట్రూ డౌన్ రూపంలో వారికే అందివ్వడం చరిత్రలో నిచిపోయే అంశం. తన పాలనలో జగన్ ప్రజలపై రూ.32వేలకోట్ల విద్యుత్ ఛార్జీల భారం మోపాడు. పీపీఏల రద్దు మొదలు అనాలోచిత నిర్ణయాలతో ఏపీ విద్యుత్ రంగాన్ని కోలుకోలేని విధంగా దెబ్బతీసి 11 సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచి, అదనంగా ట్రూ అప్, ఇంధర సర్దుబాటు ఛార్జీల పేరుతో పట్టపగలే వినియోగదారులకు చుక్కలు చూపించాడు.

**రాష్ట్ర ఖజానా కంటే ప్రజల సంతోషమే కూటమి ప్రభుత్వానికి ముఖ్యం**

సూపర్ జీఎస్టీ.. సూపర్ సేవింగ్స్ తోపాటు.. ట్రూ డౌన్ ఛార్జీల రాయితీ అందివ్వడంతో పాటు 50 గజాల్లో నిర్మించే ఇంటినిర్మాణ అనుమతి ఫీజును కేవలం రూపాయిగా నిర్ణయించడం మరో విశేషం. పట్టణాలు, నగర పంచాయతీల్లో ఇళ్లు నిర్మించుకునే పేద, మధ్యతరగతి ప్రజలకు ఇది ఎంతగానో ఉపయోగడే నిర్ణయం. దీనివల్ల ఖజానాకు జమయ్యే రూ.4వేలకోట్లను కూడా కాదనుకొని ప్రభుత్వం ప్రజల సంతోషానికే ప్రాధాన్యతనిచ్చింది. ఇకపైనా ఇదే ఒరవడి కొనసాగిస్తుంది." అని మాజీమంత్రి ప్రత్తిపాటి ఒక ప్రకటనలో తెలియచేశారు.

## ఆర్థికంగా తోడ్పాటు ఇచ్చేందుకు సీఎంఆర్ఎఫ్ ఎంతో ఉపకరిస్తుంది



పెనమలూరు (చైతన్యరథం): నియోజకవర్గం పోరంకి తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన 72 మందికి షుమారు 46లక్షల84వేల 831రూపాయల చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బోడే ప్రసాద్ మాట్లాడుతూ... నియోజకవర్గంలో పేద బడుగువర్గాల ప్రజలు, హస్పిటల్ వెళ్లి నగదు చెల్లించిన పేదవారికి అండగా ఉండాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సహాయం చేయడం ద్వారా ఆయా వర్గాల ప్రజలకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నారని, గడచిన సంవత్సరంలో 976 మందికి 8 కోట్ల 66లక్షలు రూపాయల మేర పేదవారికి సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సహాయం చేయడం సంతోషంగా భావిసున్నాననీ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకి నియోజకవర్గ ప్రజల తరపున కృతజ్ఞతలు తెలుపుతున్నాను అన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## చంద్రయ్య కుమారుడి ఉద్యోగ కల్పన బిల్లును అడ్డుకోవడం దారుణం

**● వైసీపీ నాయకులపై గౌడ కార్పొరేషన్ ఛైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి మండిపాటు**



విజయవాడ (చైతన్యరథం): వైసీపీకి బీసీల పట్ల చిత్తశుద్ధి అంకితభావం లేదని మరోసారి తేటతెల్లమైందని, ప్రజలు 2024లో కేవలం 11 సీట్లు ఇచ్చి బుద్ధి చెప్పినా, వైసీపీ ఇంకా అదే క్రూరత్వం, అదే అరాచక ధోరణితో ముందుకు సాగుతోందని గౌడ కార్పొరేషన్ ఛైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి అన్నారు. తెలుగుదేశం జెండాను మోస్తున్నాడన్న కసితో బీసీ వర్గానికి చెందిన తోట చంద్రయ్యను ఆనాటి వైసీపీ ప్రభుత్వం అండతో, స్థానిక వైసిపి నాయకులు, పట్టపగలు నడి రోడ్డుపై దారుణంగా హత్య చేశారని అన్నారు. చంద్రయ్య కుమారుడు తన తండ్రి ప్రాణం కోసం వేడుకున్నా, కనికరించని వైసీపీ గుండాలు కత్తులతో పొడిచి, రాళ్లతో కొట్టి గొంతు కోసి చంపారని అన్నారు. ఆ హత్య కేసును "వ్యక్తిగత కక్ష"గా వక్రీకరించి నిందితులకు రాజకీయ ఆశ్రయం ఇచ్చినది కూడా ఆనాటి వైసీపీ ప్రభుత్వ పెద్దలేనని దుయ్యబట్టారు. కూటమి ప్రభుత్వం చంద్రయ్య కుటుంబానికి న్యాయం చేయాలని ముందుకు రావడంతో, కుమారుడు వీరాంజనేయులకు ఇవ్వబోయే ప్రభుత్వ ఉద్యోగాన్ని శాసనమండలిలో అడ్డుకోవడం వైసీపీ ద్వేషపూరిత వైఖరికి నిదర్శనమని. చంద్రయ్య కుమారుడికి ప్రభుత్వ ఉద్యోగ కల్పన బిల్లును అడ్డుకోవడం బీసీల ఆత్మగౌరవంపై ప్రత్యక్ష దాడికి వైసీపీ పార్టీ దిగజారిందని ఎద్దేవా చేశారు. ఈ విషయంలో బీసీల పట్ల జగన్మోహన్‌రెడ్డికి ఉన్న చిత్త శుద్ధి ఏమిటో అర్ధమవుతుందని అన్నారు. బడుగు, బలహీనవర్గాల ఎదుగుదలను అడ్డుకోవడం, వారి ఆత్మగౌరవాన్ని కించపరచడమే వైసీపీ ఎజెండా అని, ఇకనైనా వైసీపీ తన దుర్మార్గపు ధోరణి విడిచిపెట్టకపోతే ప్రజలు మరింత గట్టిగా బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని వెంకట గురుమూర్తి అన్నారు. వైసీపీ ప్రభుత్వ హయంలో ఐదు సంవత్సరాలలో, స్థానిక సంస్థల్లో బీసీలకు ఉన్న రిజర్వేషన్ 10 శాతం పోయిందని, 29 బీసీ పథకాలను రద్దు చేశారని, బీసీ నిధులను దారి మళ్లించి, బీసీ కార్పొరేషన్ మరియు కుల కార్పొరేషన్‌లకు ఒక రూపాయి నిధులు ఇవ్వకుండా, బీసీలను నానా ఇబ్బందులు పెట్టడమే కాకుండా, బీసీలపై హత్యలు దాడులు చేయించిన దుర్మార్గుడు జగన్మోహన్‌రెడ్డి అని ధ్వజమెత్తారు. అందుకే ఈ రాష్ట్రంలో బడుగు బలహీన వర్గాలు జగన్మోహన్‌రెడ్డికి 11 సీట్లు ఇచ్చి బుద్ధి చెప్పారని, అయినా కూడా బీసీల పట్ల జగన్మోహన్ రెడ్డి బుద్ధి మారలేదని, భవిష్యత్తులో బీసీలు బడుగు బలహీన వర్గాల వారు వైసీపీ పార్టీని నామరూపాలు లేకుండా చేస్తారని వెంకట గురుమూర్తి హెచ్చరించారు.

## నూతన కలెక్టర్ దృష్టికి.. ధర్మవరం నియోజకవర్గ సమస్యలు

**●కలెక్టర్, ఎస్పీలతో పరిటాల శ్రీరామ్ మర్యాదపూర్వక భేటీ**

**●చేనేతలు, రైతుల సమస్యలపై కలెక్టర్‌తో చర్చించిన శ్రీరామ్**



ధర్మవరం (చైతన్యరథం): నియోజకవర్గంలో పలు సమస్యల్ని తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ శ్రీ సత్యసాయి జిల్లా నూతన కలెక్టర్ శ్యాం ప్రసాద్ దృష్టికి తీసుకెళ్లారు. జిల్లా నూతన కలెక్టర్, ఎస్పీ వచ్చిన నేపథ్యంలో శ్రీరామ్ వారితో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. మంగళవారం కలెక్టరేట్ లో కలెక్టర్ శ్యాంప్రసాద్ కు పుష్పగుచ్ఛాలు అందజేసి జిల్లాకు స్వాగతం పలుకుతూ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ధర్మవరం నియోజకవర్గ సమస్యల గురించి చర్చించారు. ముఖ్యంగా చేనేతలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, ఇటీవల వర్షాలకు నష్టపోయిన చేనేత కార్మికులకు పరిహారం, మహిళలకు ఉపాధి కల్పించే అంశాల గురించి మాట్లాడారు. అలాగే రైతు సమస్యలు, హంద్రీనీవా ద్వారా చెరువులకు నీరందించే వాటి గురించి చర్చించారు. అన్ని అంశాల మీద కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. త్వరలోనే అన్ని అంశాలను క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలిస్తానని.. నియోజకవర్గ అభివృద్ధికి మా వైపు నుంచి సహకారం ఉంటుందని స్పష్టం చేశారు. మరోవైపు జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ సతీష్ కుమార్ ను కలిశారు. నియోజకవర్గంలో ఉన్న శాంతి భద్రతల గురించి చర్చించారు. ధర్మవరంలో ఒకప్పటి పరిస్థితులు, ఇప్పటి పరిస్థితుల గురించి ఎస్పీ దృష్టికి తీసుకెళ్లారు. ధర్మవరం ప్రాంతం ప్రశాంతంగా ఉండాలన్నదే తమ లక్ష్యమని.. ఇందుకు తమ వైపు నుంచి పూర్తి సహకారం ఉంటుందని శ్రీరామ్ తెలిపారు.

## డ్రైనేజీ నిర్మాణ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే రాజు

**● పాత సంతమార్కెట్ రూముల పరిశీలన**



మడకశిర (చైతన్యరథం): మడకశిర నియోజకవర్గంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను మడకశిర శాసనసభ్యులు, టీడీపీ పాలకమండలి సభ్యులు ఎం.ఎస్.రాజు పరిశీలించారు. పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్ హిందూపూర్ రోడ్డుకు ఇరువైపులా జరుగుతున్న డ్రైనేజీ అభివృద్ధి పనులను ఎమ్మెల్యే పార్టీ నేతలతో కలిసి పరిశీలించారు. డ్రైనేజీల నిర్మాణం, నాణ్యత తదితర అంశాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. పాతసంత మార్కెట్‌లో నిరుపయోగంగా ఉన్న రూములను, మున్సిపల్ స్థలాలను ఎమ్మెల్యే పరిశీలించారు. పాత కర్ణాటక బ్యాంకు వద్ద నిర్మిస్తున్న బ్రిడ్జి పనులను కూడా ఎమ్మెల్యే పరిశీలించి, అధికారులను ఆరాతీశారు. వాహనదారులు ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యే స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ట్రాఫిక్ సమస్యలను త్వరగా పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రాజీవ్ గాంధీ సర్కిల్‌లో సంతమార్కెట్ వద్ద డ్రైనేజీ నిర్మాణానికి స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్రకార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

## వైసీపీ నుండి టీడీపీలోకి చేరిన ఏడు కుటుంబాలు

**●కూటమి ప్రభుత్వం అభివృద్ధిని చూసి వైసీపీ వీడి తెలుగుదేశం పార్టీలోకి చేరిక**

**●కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన మంత్రి సవిత**



పెనుకొండ (చైతన్యరథం): సత్యసాయి జిల్లా పెనుకొండ నియోజకవర్గం సోమందేపల్లి మండలం ఛాలకూరు గ్రామానికి చెందిన ఏడు వైసీపీ కుటుంబాలు వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీలోకి చేరారు. ఈ సందర్భంగా వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు రాష్ట్ర బీసీ సంక్షేమ చేనేత జౌళి శాఖల మంత్రి సవిత. ఈ సందర్భంగా పార్టీలోకి చేరిన వారు మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్రంలోనూ సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై పార్టీలోకి చేరేమన్నారు. అదేవిధంగా పెనుకొండ నియోజకవర్గంలో మంత్రి సవితమ్మ సారథ్యంలో నియోజకవర్గం అభివృద్ధి చెస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సోమందేపల్లి మండల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## వైసీపీ బెదిరింపు దోరణి రాజకీయాలు మానుకోవాలి

**●మెడికల్ కళాశాలలపై దుష్ప్రచారం ఆపరా..? పరిటాల సునీత ఆగ్రహం**

**●వెంకటాపురంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే సునీత**



రాప్తాడు (చైతన్యరథం): అధికారం ఉన్న ఐదేళ్లు బెదిరింపులు, దౌర్జన్యాలతో పాలన సాగించిన వైసీపీ.. ఇంకా ఆ దోరణి మానలేదని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. రాప్తాడు నియోజకవర్గంలోని పలువురు లబ్ధిదారులకు ఆమె రామగిరి మండలం వెంకటాపురంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. మొత్తం 23మంది లబ్ధిదారులకు 28లక్షల 06వేల రూపాయల విలువైన చెక్కులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయా మండలాల ముఖ్యనాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు. చెక్కులు అందుకున్న లబ్ధిదారులు ఎమ్మెల్యే సునీతతో పాటు ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ప్రజల ఆరోగ్యం విషయంలో ఖర్చులు చూడటం లేదన్నారు. ఎన్టీఆర్ వైద్య సేవల్ని మరింత విస్తృతం చేస్తున్నారన్నారు. కానీ దీనిపై వైసీపీ నాయకులు దుష్ప్రచారం చేయడం తగదన్నారు. ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్సలు పొందిన వారికి సైతం సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థికంగా ఆదుకుంటున్నారన్నారు. మెడికల్ కళాశాలలను పీపీపీ మోడల్లో నిర్మాణాలు చేపడితే ప్రైవేటు పరం అంటూ దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. వైసీపీ నాయకులకు పీపీపీకి ప్రైవేటుకు తేడా గురించి అర్థమయ్యేలా ఎన్నిసార్లు చెప్పినా అర్థం కానట్టు నటిస్తున్నారన్నారు. పైగా డిజిటల్ బుక్కుల పేరుతో అధికారులను, పోలీసుల్ని బెదిరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వారు ఇలాగే వ్యవహరిస్తే.. రానున్న రోజుల్లో ప్రజలే తగిన బుద్ధి చెబుతారని ఎమ్మెల్యే సునీత అన్నారు.

## దూసుకొచ్చిన మృత్యు శకటం... పండగ వేళ విషాదం




కర్నూలు (చైతన్యరథం): దసరా పండుగ ఆ కుటుంబానికి తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. పల్లె నుండి పట్టణానికి వచ్చిన ముగ్గురు మృత్యువాత పడ్డారు. దసరా పండుగ రోజు సరదాగా గడిపేందుకు కొత్త బట్టలు, సరుకుల కోసం వెళ్లి ప్రాణాల మీదకు తెచ్చుకున్నారు. ఈ విషాద సంఘటన కర్నూలు జిల్లాలో చోటుచేసుకుంది. పత్తికొండ పట్టణం గుత్తి సర్కిల్ సాయిబాబా గుడి రోడ్డులో పండుగ సరుగుల కోసం వచ్చిన ముగ్గురు అనుకోని ప్రమాదానికి గురయ్యారు. ఈ ఘటన శిరీష, భూమిక, మితుకలు ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందారు. తుగ్గలి మండలం ముక్కెళ్ల గ్రామానికి చెందిన శిరీష, భూమిక, మితుకలు పండుగ సరుకుల కోసం పత్తికొండకు వచ్చారు. పండుగ, సరుకులు తీసుకుని తమ గ్రామమైన ముక్కెళ్ల గ్రామానికి వెళ్లడానికి ఆటోలో బయలుదేరారు. అప్పుడే బియ్యం లోడుతో మిట్టపై వెళ్తున్న లారీ వేగంగా వచ్చింది. బ్రేకులు ఫెయిలవడంతో పైభాగం నుండి కింది భాగంలో ఉన్న ఆటోలను లారీ ఢీకొట్టింది. దీంతో శిరీష భూమిక, మితుకలు అక్కడికక్కడే మృతి చెందారు. వెంటనే సంఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు సహాయక చర్యలు చేపట్టారు. భూమిక కుమార్తె మితుక, కుమారుడితో పండుగ సరుకుల కోసం కుటుంబంతో వచ్చింది. భూమిక అమె కూతురు మితుక చనిపోగా, ఏడాది వయస్సు ఉన్న బాబు బ్రతికి బయటపడ్డాడు. చనిపోయిన భార్య భూమిక, కూతురు మితుకను చూసిన భర్త సుమన్ తల్లడిల్లిపోయాడు. ఒకేసారి చనిపోవడంతో కన్నీరు మున్నీరు అయ్యాడు. ఈ ఘటనకు సంబంధించి కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## సౌదీలో చిక్కుకున్న నిజాంను వారం రోజుల్లో అనంతపురం తీసుకొస్తాం

**● బాధిత కుటుంబసభ్యులకు అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ హామీ**



అనంతపురం (చైతన్యరథం): రెండు నెలల క్రితం సౌదీ వెళ్లిన ఆజాద్ నగర్‌కి చెందిన నిజాం... అక్కడ ఓనర్ల వేధింపులతో రోడ్డున పడ్డ నిజాం.. తినేందుకు తిండి కూడా లేక తీవ్ర అవస్థలు పడుతున్న విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మంగళవారం బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. అనంతరం ముఖ్యమంత్రి కార్యాలయానికి ఫోన్ చేసి జరిగిన విషయాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకొచ్చారు. దీంతో పాటుగా సౌదీలో తన స్నేహితుల ద్వారా నిజాంను ఏపీ తెలుగు అసోసియేషన్‌కు అప్పగించాలని కోరారు. జెడ్డా నుంచి సౌదీ రాజధాని రియాద్‌కు నిజాంను తీసుకొచ్చేందుకు ఏర్పాట్లు చేస్తామని కుటుంబ సభ్యులకు హామీ ఇచ్చారు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్... అనంతరం బాధితుడు నిజాంతో వీడియో కాల్ ద్వారా మాట్లాడిన ఎమ్మెల్యే ధైర్యంగా ఉండాలని వారం రోజుల్లో అనంతపురంకు తీసుకొస్తామని హామీ ఇచ్చారు. తన కుమారుడి కిడ్నీ ఆపరేషన్ కారణంగా అప్పులు ఎక్కువ అయ్యాయని, నిజాం భార్య రేష్మ ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆదుకుంటామని దగ్గుపాటి ప్రసాద్ భరోసా కల్పించారు. నిజాం కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## తిరుమలలో శోభాయమానంగా స్నపన తిరుమంజనం

తిరుమల: శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం శ్రీవారి ఆలయంలో పవిత్రాలు, డ్రై ఫ్రూట్స్, రోజామాలల అలంకారంతో స్నపన తిరుమంజనం శోభాయమానంగా జరిగింది. ఆలయంలోని రంగనాయకుల మండపంలో జరిగిన ఈ కార్యక్రమంలో వివిధ రకాల ఫలాలు, పుష్పాలతో స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను అందంగా అలంకరించారు. నీలి పవిత్రాలు, లవంగాలు, వట్టివేరు, తులసి, డ్రైఫ్రూట్స్, రోజామాలలతో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్పస్వామివారి ఉత్సవమూర్తులను అలంకరించారు. వివిధ రంగుల పుష్పాలు, ఫలాలు, సాంబ్రాణి, ధూపదీప నైవేద్యాల నడుమ రంగనాయకుల మండపం నూతనత్వాన్ని సంతరించుకుంది. ఈ సందర్భంగా పాలు, పెరుగు, తేనే, చందనం, పసుపు కొబ్బరినీళ్ల తదితర సుగంధద్రవ్యాలతో విశేషంగా అభిషేకం చేశారు. వేదపండితులు చతుర్వేదపారాయణం ఆలపించారు. బ్రహ్మోత్సవాల సమయంలో వాహన సేవల్లో తిరువీధుల్లో ఊరేగి అలసిపోయే స్వామివారు స్నపన తిరుమంజనంతో సేదతీరుతారని ఆలయ అర్చకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్, ఈవో, జేఈవో తదితరులు పాల్గొన్నారు.

## బీహార్ ఓటర్లు 7.42 కోట్లు

### తుది జాబితా విడుదల చేసిన ఈసీ
### 47 లక్షల మంది పేర్ల తొలగింపు

న్యూఢిల్లీ: స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియను పూర్తి చేస్తూ ఎన్నికల కమిషన్ బీహార్ ఓటర్ల తుది జాబితాను మంగళవారం విడుదల చేసింది. 22 ఏళ్ల తర్వాత ఎస్ఐఆర్ ప్రక్రియను బీహార్‌లో ఎన్నికల కమిషన్ చేపట్టింది. తుది ఎన్నికల జాబితా ప్రకారం 47 లక్షల మంది అనర్హులైన ఓటర్లను ఎన్నికల జాబితా నుంచి ఎలక్షన్ కమిషన్ తొలగించింది. జూన్ 24వ తేదీ నాటికి ఓటర్ల జాబితాలో 7.89 కోట్ల ఓటర్లు ఉండగా, రివిజన్ తర్వాత 65 లక్షల మందిని అనర్హులైన ఓటర్లుగా గుర్తించి ఓటర్ల జాబితా నుంచి ఈసీ తొలగించింది. దీంతో ఆగస్టు 1న ప్రచురించిన ఎన్నికల జాబితాలో మొత్తం ఓటర్ల సంఖ్య 7.24కు చేరింది. అనంతరం ముసాయిదా జాబితాకు సంబంధించి




వచ్చిన ఫిర్యాదులు, అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుని తుది జాబితాను సెప్టెంబర్ 30న ప్రకటించింది. ఇందులో అదనంగా 3.66 లక్షల అనర్హులైన ఓటర్లను తొలగించగా, 21.53 లక్షల అర్హులైన ఓటర్లను జాబితాలోకి చేర్చింది. ఆ ప్రకారం సెప్టెంబర్ 30న ప్రచురించిన తుది జాబితాలో మొత్తం అర్హులైన బీహార్ ఓటర్ల సంఖ్య 7.42 కోట్లకు చేరింది.

ఓటర్ల తుది జాబితాను అధికారిక వెబ్‌సైట్‌లో ఉంచినట్టు ఈసీ తెలిపింది. నేషనల్ ఓటర్ సర్వీస్ పోర్టల్‌లోని 'సెర్చ్ ఇన్ ఎలక్టోరల్ రోల్' ఫీచర్‌లో ఎపిక్ నెంబర్ ఎంటర్ చేయడం కానీ, పేరు, పుట్టిన తేదీ వంటి పర్సనల్ డిటైల్స్‌తో సెర్చ్ చేయాలి. రాష్ట్ర ఎలక్షన్ కమిషన్ వెబ్‌సైట్ లేదా అఫీషియల్ ఓటర్ హెల్ప్‌లైన్ మొబైల్ యాప్‌తో ఓటర్ల జాబితాలో పేరును వెరిఫై చేసుకోవచ్చు. కాగా అసెంబ్లీ ఎన్నికల సన్నద్ధత ను సమీక్షించేందుకు ఎన్నికల కమిషన్ టీమ్ ఈనెల 4,5 తేదీల్లో బీహార్‌లో పర్యటించనుంది. వచ్చే వారం లో ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేసే అవకాశం ఉంది. ఛాత్ పండుగ పూర్తయిన తర్వాత అక్టోబర్‌లో తొలి విడత ఎన్నిక జరగవచ్చని అంచనా వేస్తున్నారు.

## దుర్గా మండపాల్లో మోదీ పూజలు

న్యూఢిల్లీ: దుర్గా శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మంగళవారం ఢిల్లీలోని సీఆర్ పార్క్ వద్దనున్న కాళి బరి ఆలయ దుర్గా పూజా మండపాన్ని సందర్శించారు. అష్టమి సందర్భంగా అమ్మవారిని దర్శించి పూజలు జరిపారు. అనంతరం మరో మండపాన్ని కూడా ఆయన దర్శించారు. ప్రధాని వెంట ఢిల్లీ ముఖ్య మంత్రి రేఖా గుప్తా కూడా పాల్గొన్నారు. ఢిల్లీలోని మినీ బెంగాల్‌గా చిత్తరంజన్ పార్క్ ప్రసిద్ధి చెందింది. బెంగాలీ సంప్రదాయ రీతిలో ఇక్కడ ఏటా ఘనంగా శరన్నవరాత్రి వేడుకలు జరుగు తుంటాయి. భారీ మండపాలు, ఫుడ్ స్టాల్స్, సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహిస్తుంటారు. నగరంలోని



వేలాది మంది ఈమండపాలను దర్శించి పూజల్లో పాల్గొంటారు. ఈ ఏడాది దుర్గా పూజ సెప్టెంబర్ 28న (షష్టి) ప్రారంభమైంది. అక్టోబర్ 2వ తేదీ విజయదశమితో ఈ వేడుకలు ముగుస్తాయి.

**ట్రాఫిక్ ఆంక్షలు**

ప్రధాని మోదీ రాక సందర్భంగా సీఆర్ పార్క్, గ్రేటర్ కైలాస్-2కు చేరుకునే రోడ్లపై వాహనాల రాకపోకలపై ఆంక్షలు విధిస్తూ గ్రేటర్ కైలాస్-2 వెల్ఫేర్ అసోసియేషన్ అడ్వయిజరీ జారీచేసింది. మధ్యాహ్నం 3గంటల నుంచి అర్ధరాత్రి వరకూ ఈఆంక్షలు అమల్లో ఉంటాయి.గురుద్వార రోడ్, బిపిన్ చంద్రపాల్ మార్గ్‌తో రెండు ప్రాంతాలకు చెందిన అంతర్గత రోడ్లలో ట్రాఫిక్‌ను పూర్తిగా నిలిపివేశారు. ఆంక్షల సమయంలో ఎంపీ రోడ్, అరబిందో మార్గ్, మధుర రోడ్, లాలా లజపతి రాయ్ రోడ్డు, మెహ్రౌలి-బదర్‌పూర్ రోడ్లను ఉపయోగించుకోవాల్సిందిగా ప్రయాణికులకు సూచనలు చేశారు.

## కరూర్ మృతులకు బీజేపీ సంతాపం

నటుడు, రాజకీయ నాయకుడు విజయ్ శనివారం తమిళనాడులోని కరూర్‌లో నిర్వహించిన ర్యాలీలో జరిగిన తొక్కిసలాటలో 41 మంది మరణించారు. వందల మంది గాయపడ్డారు. ఈ ఘటనకు దారితీసిన పరిస్థితులను పరిశీలించడానికి బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా సోమవారం నేషనల్ డెమోక్రటిక్ అలయన్స్ (ఎన్డీఏ) నుంచి ఎనిమిది మంది నాయకులతో కూడిన బృందాన్ని ఏర్పాటు చేశారు. మృతులకు జేపీ నడ్డా సంతాపం ప్రకటించారు. గాయప డిన వారి త్వరితగతిన కోలుకోవాలని ప్రార్థించారు. ఘటనపై నివేదిక ఇవ్వడానికి ఎన్డీఏ ప్రతినిధుల బృందాన్ని ఏర్పాటు చేశారు. హేమామాలిని నేతృత్వంలో ఎనిమిది మంది సభ్యుల



తో కూడిన బృందం విచారణ చేయనుంది. మృతుల కుటుంబాలను పరామర్శించి అధినాయకత్వానికి నివేదిక సమర్పించనుంది. 'కరూర్‌ను సందర్శించడానికి, ఈ సంఘటనకు దారితీసిన పరిస్థితులను పరిశీలించడానికి, బాధిత కుటుంబాలను కలవడానికి, వీలైనంత త్వరగా తన నివేదికను సమర్పించడానికి ఎన్డీఏ ప్రతినిధి బృందాన్ని ఏర్పాటు చేశారు' అని పార్టీ తెలిపింది. సాధారణంగా ఇలాంటి ఘటనలను సమీక్షించడానికి బీజేపీ తన పార్టీ నాయకులనే పంపుతుంది. కానీ తాజా కమిటీలో దాని మిత్రదేశాలైన శివసేన, తెలుగుదేశం పార్టీ ఎంపీలను కూడా ప్యానెల్‌లో చేర్చింది. హేమామాలిని నేతృత్వంలోని ఈ కమిటీలో సభ్యులుగా అనురాగ్ ఠాకూర్ (ఎంపీ), తేజస్వి సూర్య (ఎంపీ), బ్రజ్‌లాల్ (మాజీ డీజీపీ, ఎంపీ), శ్రీకాంత్ శిండే (ఎంపీ, శివసేన), అపరాజితా సారంగి (ఎంపీ), రేఖా శర్మ (ఎంపీ), పుట్టా మహేష్‌కుమార్ (ఎంపీ, టీడీపీ) తదితరులు ఉన్నారు.

## తప్పును సమర్థించుకున్న విజయ్

### - ప్రతీకారం తీర్చుకోండంటూ వీడియో సందేశం

చెన్నై: కరూర్ తొక్కిసలాట ఘటన తనను తీవ్రంగా కలచివేసిందని టీవీకే పార్టీ చీఫ్, హీరో విజయ్ తెలిపారు. త్వరలో నిజం వెలుగులోకి వస్తుందని అన్న ఆయన తప్పును కప్పిపుచ్చుకునే వ్యాఖ్యలు చేశారు. అందుకు సంబంధించిన వీడియోను మంగళవారం విడుదల చేశారు. తనపై అమిత ప్రేమతో ప్రజలు ఈ సభకు తరలివచ్చారు. బాధిత కుటుంబాలను త్వరలో పరామర్శిసా. ప్రజల భద్రతకే తాను ప్రాధాన్యం ఇస్తానని చెప్పారు. తనను టార్గెట్ చేయండి.. అంతేకానీ ప్రజలను మాత్రం ఇబ్బంది పెట్టొద్దంటూ చేసిన తప్పును సమర్థించుకుంటూ తన ప్రత్యర్థులకు సూచించే ప్రయత్నం చేశారు. తమ తప్పు లేకపోయినా.. తమపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారని పేర్కొన్నారు. కావాలనుకుంటే తనపై ప్రతీకారం తీర్చుకోవచ్చంటూ తమిళనాడు సీఎం స్టాలిన్‌కు విజయ్ సవాల్ విసిరారు. కానీ తన పార్టీ కార్యకర్తల జోలికి మాత్రం వెళ్లకండంటూ వారికి విజ్ఞప్తి చేశారు. తమకు అనుమతి ఇచ్చిన ప్రాంతంలోనే సభ నిర్వహించామని గుర్తు చేశారు. ఉదయం సభకు అనుమతిస్తే రాత్రి వేళ ఆలస్యంగా ఎందుకు వచ్చారో ఆయ



న వివరించే ప్రయత్నం చేయకపోవడం గమనార్హం. కాగా ఈ వీడియో చేసేందుకు నాలుగురోజులు పట్టిందా అంటూ డీఎంకే పార్టీ కౌంటర్‌గా స్పందించింది. విజయ్ తీరును ఎద్దేవా చేసింది.

**టీవీకే కార్యకర్త ఆత్మహత్య**

తమిళగ వెట్రి కళగం కార్యకర్త విల్లుపురం జిల్లాకు చెందిన అయ్యప్పన్ (51) ఆదివారం తన తల్లిదండ్రులను చూసేందుకు స్వగ్రామమైన మైలంకు వెళ్లాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో గదిలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కరూర్ తొక్కిసలాటకు డీఎంకే మంత్రి సెంథిల్ బాలాజీ కారణమని సూసైడ్ లేఖలో రాశారు. ఇందులో పోలీసుల ప్రమేయం కూడా ఉంది. మంత్రిని అరెస్టు చేసి జైల్లో పెట్టాలి అని తన పేర్కొన్నారు. పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

## పీఓకేలో రెండో రోజూ కొనసాగిన నిరసనలు

పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో రెండో రోజూ ప్రజా నిరసనలు కొనసాగాయి. పాక్ ప్రభుత్వ అణిచివేత ధోరణికి వ్యతిరేకంగా జనాలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. వంతెనపై నుంచి జనాలు వెళ్లకుండా అడ్డంగా పెట్టిన కంటెయినర్లను నదిలోకి తోసి మరీ ముందుకు సాగారు. తొలి రోజు ఘర్షణలు హింసాత్మకంగా మారాయి. పోలీసు కాల్పుల్లో ఇద్దరు మరణించగా డజనుకు పైగా జనాలు గాయపడ్డారు. వీటిని లెక్క చేయకుండా స్థానికులు రెండో రోజు కూడా నిరసనలకు దిగారు. నిరసనకారులు మొత్తం 38 డిమాండ్లను పెట్టారు. కశ్మీర్ నుంచి వలసొచ్చిన వారికి పీఓకే అసెంబ్లీ సీట్లలో కొన్ని కేటాయించడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇలాంటి కోటా ప్రజాప్రాతినిధ్య వ్యవస్థకు విఘాతమని అన్నారు. మా నిరసనలు ప్రాథమిక హక్కులను సాధించుకునేందుకే 70 ఏళ్లుగా మేము వీటి కోసం పోరాడుతున్నాము. మాకు స్వేచ్ఛ ఇవ్వకపోతే ప్రజాగ్రహానికి గురికాక తప్పదు' అని పాక్ ప్రధాని షహబాస్ షరీఫ్, ఇతర కీలక నేతలను ఏసీసీ నేత షౌకత్ నవాజ్ మీర్ హెచ్చరించారు. మరోవైపు.. నిరసనలను అణచివేసేందుకు పాక్ ప్రభుత్వం బలప్రయోగానికి దిగింది. మరో 100 మందితో కూడిన దళాలను పంపించింది. ఇంటర్నెట్ సేవలను నిలిపివేసింది.

## చెన్నై ఎన్నోర్ పవర్ ప్లాంట్‌లో ఘోర ప్రమాదం

### నిర్మాణ కట్టడం కూలి 9 మంది మృతి

చెన్నై ఎన్నోర్ పవర్ ప్లాంట్‌లో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. నిర్మాణంలో ఉన్న కట్టడం కూలి 9 మంది కూలీలు మృతిచెందారు. పలువురు తీవ్రంగా గాయపడ్డారు. వారిని ఆసు పత్రికి తరలించారు. ప్రస్తుతం సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. మంగళవారం ఎన్నోర్ పవర్ ప్లాంట్‌లో ఆర్చ్ నిర్మాణం జరుగుతుండగా ఆర్చ్ ఒక్కసారిగా కుప్పకూలింది. 30 అడు గుల పైనుంచి కిందపడింది. శిథిలాల కింద పడి 9 మంది కార్మికులు చనిపోయారు. ఓ కార్మికుడు అత్యంత తీవ్రంగా గాయపడగా.. పది మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు, రెస్క్యూ సిబ్బంది గాయపడ్డ వారిని స్టేన్లీ గవర్నమెంట్ ఆస్పత్రికి తరలించారు. దీనిపై ది అవడీ పోలీస్ కమిషనరేట్ స్పందిస్తూ.. 'ఆర్చ్ ఎందుకు కూలిందో సరైన కారణంగా ఇంకా తెలియ రాలేదు. సంఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నాము' అని తెలిపింది.

## 9 విదేశీ ఎంబసీలకు బాంబు బెదిరింపు

చెన్నై (ప్యారిస్): చెన్నైలోని 9 విదేశీ ఎంబసీలకు బాంబు బెదిరింపు మెయిల్స్ కలకలం సృష్టించాయి. మంగళవారం చెన్నైలోని తేనాంపేటలోని అమెరికా కాన్సులేట్ సహా సింగపూర్, కొరియా, స్వీడన్, ఆస్ట్రేలియా, శ్రీలంక, బ్రిటన్ మొదలైన 9 ఎంబసీలకు ద్వారా బాంబు బెదిరింపులు వచ్చాయి. కరూర్ తొక్కిసలాట ఘటన, డీఎంకే మాజీ మంత్రి సెంథిల్ బాలాజీ పేరును ప్రస్తావిస్తూ పది వేరువేరు ఈమెయిల్ ఐడీలతో డీజీపీ కార్యాలయానికి ఈ బెదిరింపులు వచ్చినట్లు పోలీసులు పేర్కొన్నారు. భద్రతా బలగాలు గాలింపు చర్యలు చేపట్టాయి. అన్ని కాన్సులేట్లలో బాంబు స్క్వాడ్ బృందాలు, డాగ్ స్క్వాడ్ల సహాయంతో క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహిస్తున్నట్లు చెన్నై పోలీసులు పేర్కొన్నారు. కాన్సులేట్ల చుట్టూ భద్రతను పెంచినట్లు తెలిపారు.

**విమానానికి బాంబు బెదిరింపు**

ముంబయి నుంచి ఢిల్లీ వెళుతున్న ఇండిగో విమానానికి మంగళవారం బాంబు బెదిరింపు మెయిల్స్ వచ్చాయి. 200 మంది ప్రయాణికులు ఉన్న విమానం గాల్లో ఉండగా బాంబు బెదిరింపు మెయిల్ రావడంతో అప్రమత్తమైన ఎయిర్‌లైన్స్ అధికారులు ఢిల్లీ విమానాశ్రయ అధికారులకు సమాచారమిచ్చారు. పైలెట్లు విమానాన్ని సురక్షితంగా ఢిల్లీలో ల్యాండ్ చేసిన అనంతరం గాలింపు చర్యలు చేపట్టగా ఎటువంటి పేలుడు పదార్థాలు లభ్యం కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

## సుశాంత్ సింగ్ కేసులో రియా చక్రవర్తికి బిగ్ రిలీఫ్



బాంబే హైకోర్టులో ప్రముఖ బాలీవుడ్ నటి రియా చక్రవర్తికి భారీ ఊరట లభించింది. ప్రముఖ బాలీవుడ్ హీరో సుశాంత్ సింగ్ రాజ్‌పుత్ కేసులో ఆమె పాస్‌పోర్టును ఎన్సీబీ స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే. పాస్ పోర్టుకు సంబంధించిన విషయంలో కోర్టు రియాకు సానుకూలంగా తీర్పు నిచ్చింది. రియా పాస్ పోర్టును వెంటనే తిరిగి ఇచ్చేయాలని నార్కోటిక్స్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్‌ని ఆదేశించింది.

## ఢిల్లీలో భారీ వర్షం

### విమాన సర్వీసులపై ప్రభావం

దేశ రాజధాని ఢిల్లీ ప్రాంతంలో మంగళవారం ఉదయం భారీ వర్షం కురిసింది. పండుగ సీజన్‌లో ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు, విమాన సేవల్లో అంతరాయం వంటి సమస్యలను తెచ్చిపెట్టింది. ఢిల్లీతో పాటు నోయిడా, గాజియాబాద్‌లోని కొన్ని ప్రాంతాల్లో కూడా భారీ వర్షం కురిసింది.

## అయ్యప్ప స్వామి భక్తులకు శుభవార్త

శబరిమల ఆలయానికి నేరుగా వెళ్లలేని భక్తుల కోసం ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డు గుడ్ న్యూస్ చెప్పింది. త్వరలో ఆన్‌లైన్‌లో ప్రసాదం బుక్ చేసుకునే సౌకర్యం అందుబాటులోకి తెస్తున్నట్లు ప్రకటించింది. భక్తులు తమ ఇంటి నుంచే ఆన్‌లైన్ ద్వారా స్వామివారి ప్రసాదాలు బుక్ చేసుకునే సదుపాయాన్ని మరో నెలలో ప్రారంభించనుంది. ఈ కొత్త సదుపాయంతో శబరిమల ఆలయంతో పాటు ట్రావెన్‌కోర్ దేవస్థానం పరిధిలోని 1252 ఆలయాల ప్రసాదాలు కూడా భక్తులు ఆన్‌లైన్ ద్వారా తమ ఇంటి నుంచే బుక్ చేసుకునే

## చెప్పినట్టే చేశారుగా..

# మళ్లీ టారిఫ్‌ల బాంబు పేల్చిన ట్రంప్

### కిచెన్, బాత్రూం ఎక్విప్‌మెంట్‌పై భారీసుంకాలు



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి టారిఫ్ బాంబు పేల్చారు. అన్నట్టుగానే.. ఫర్నిచర్, కలపపై సుంకాల మోత మోగించారు. ఇటీవల కిచెన్ క్యాబినెట్, బాత్రూమ్ పరికరాలతోపాటు అప్‌హోల్‌స్టర్డ్ ఫర్నిచర్, భారీ ట్రక్కులపై భారీ సుంకాలు విధిస్తానంటూ ట్రంప్ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఆమేరకు తాజాగా కలపపై 10 శాతం, కిచెన్ క్యాబినెట్లు, అప్‌హోల్‌స్టర్డ్ ఫర్నిచర్‌పై 25 శాతం సుంకాలను తాజాగా విధించారు. ఇవి అక్టోబరు 14నుంచి అమల్లోకి రానున్నట్టు తెలిపారు. చైనాతో సహా ఇతర దేశాల దిగుమతుల కారణంగా ఫర్నిచర్ వ్యాపారానికి కేంద్రస్థానంగా ఉండే అమెరికాలోని నార్త్ కరోలినా దాని ప్రాభవాన్ని కోల్పోయిందన్నారు. అమెరికాలో ఫర్నిచర్ తయారు చేయకపోతే భారీస్థాయిలో సుంకాలను విధిస్తామని ట్రూత్ సోషల్లో హెచ్చరించారు. ఇక, సిమాలపై కూడా ట్రంప్ భారీగా సుంకాలు ప్రకటించిన సంగతి తెలిసిందే. యూఎస్ వెలుపల నిర్మించే సినిమాలపై 100 శాతం అదనపు టారిఫ్‌లు విధిస్తానని ఆయన ప్రకటించారు. ఇది భారతీయ చిత్ర పరిశ్రమపై తీవ్ర ప్రభావం చూపనుంది.

**ట్రంప్ తప్పు చేస్తున్నారు: జాన్ బోల్డన్**

రష్యానుంచి చమురు కొనొద్దన్న తన హెచ్చరికలను పట్టించుకోని భారత్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాల మోత మోగిస్తున్నారు. అమెరికా అధ్యక్షుడు భారత్‌పట్ల వ్యవహరిస్తున్న తీరుపై సొంతదేశం నుంచే అనేక విమర్శలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో అమెరికా మాజీ జాతీయ భద్రతా సలహాదారు జాన్ బోల్టన్ సైతం ట్రంప్ చర్యలపై మండిపడ్డారు. ఈ విషయంలో రష్యానుంచి పెద్దమొత్తంలో చమురు కొనుగోలు చేస్తున్న చైనాను వదిలేసి.. కేవలం భారత్‌పైనే ఆంక్షలు విధించడాన్ని తప్పుపట్టారు. చైనా, రష్యాను వదిలేసి భారత్‌పై మాత్రమే సుంకాలు విధించటం ఏమిటని ప్రశ్నించారు. ఈ సుంకాలను వాణిజ్యం గురించి కాకుండా వ్యక్తిగత కక్షతో విధిస్తున్నట్టు ఉందన్నారు. సరిగ్గా ఆలోచించకుండా ట్రంప్ తీసుకున్న నిర్ణయాలవల్ల అమెరికా ముఖ్యమైన వ్యూహాత్మక భాగస్వామిని కోల్పోయే ప్రమాదం ఉందని జాన్ బోల్టన్ ఆందోళన వ్యక్తం చేశారు. ట్రంప్ కొన్ని లక్ష్యాలతో రెండోసారి అధికారంలోకి వచ్చారని.. వాటిని నెరవేర్చుకోవడం కోసం దేనికైనా సిద్ధమైపోతున్నారని ఆరోపించారు. అమెరికా రాజకీయాల్లో ఆయన ఏమాత్రం ఆమోదయోగ్యం కాని విధంగా వ్యవహరిస్తున్నారన్నారు. అమెరికాలో గతంలో ఎప్పుడూ ఈవిధంగా జరగలేదని.. భవిష్యత్తులో మళ్లీ ఈ పరిస్థితులు రావద్దని కోరుకుంటున్నట్టు తెలిపారు.

# వచ్చే ఫిబ్రవరికి ముందే హెచ్1బీ వీసాలలో మార్పులు

**అమెరికా వాణిజ్యమంత్రి హెూవార్డ్ లుట్నిక్**



హెచ్–1బీ వీసాల విషయంలో అమెరికా కఠిన చర్యలు తీసుకుంటోంది. ఇటీవల వాటి ఫీజును 215 డాలర్ల నుంచి లక్ష డాలర్లకు పెంచుతూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. తాజాగా అమెరికా వాణిజ్య మంత్రి హెవార్డ్ లుట్నిక్ కీలక వ్యాఖ్యలు చేశారు. 2026 ఫిబ్రవరికి ముందే ఆ వీసాల జారీ ప్రక్రియలో గణనీయమైన మార్పులు ఉంటాయని వెల్లడించారు. పాత విధానంలో లోపాలున్నాయని వ్యాఖ్యానించారు. ఇటీవల ట్రంప్ ప్రకటించిన వీసా ఫీజు ప్రపంచవ్యాప్తంగా పెను సంచలనం సృష్టించింది. హెచ్–1బీ వీసాపై విధించిన లక్ష డాలర్ల రుసుము వార్షిక ఫీజు కాదని, దరఖాస్తు చేసుకొనే సమయంలో కట్టాల్సిన వన్‌టైం ఫీజు మాత్రమేనని వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లీవిట్ స్పష్టత ఇచ్చిన సంగతి తెలిసిందే. ఈ వన్‌టైం లక్ష డాలర్ల రుసుము ఇకపై కొత్తగా హెచ్–1బీ వీసాకు దరఖాస్తు చేసుకునేవారికే అమలుచేస్తామని, ప్రస్తుత వీసాదారులకు, రెన్యూవల్‌కు వర్తించదని చెప్పారు. దీనిని ఉద్దేశించి వాణిజ్య మంత్రి మాట్లాడారు. “2026 నుంచి ఈ ప్రక్రియ అంతా అమల్లోకి వస్తుంది. నా అంచనా ప్రకారం ఇప్పుడు.. 2026లో గణనీయమైన మార్పులు ఉంటాయి” అని పేర్కొన్నారు. లక్ష డాలర్ల ఫీజు కారణంగా రానున్న రోజుల్లో ఆ వీసాపై వచ్చేవారి సంఖ్యలో మార్పు ఉంటుందని అంచనా వేశారు. లాటరీ విధానంలో కూడా మార్పులు ఉండొచ్చనేలా వ్యాఖ్యలు చేశారు. ఒక దేశం లాటరీ ద్వారా నైపుణ్యం కలిగిన కార్మికులను తెచ్చుకోవడం ఏంటని ప్రశ్నించారు. పాత వీసా విధానంలో లోపాలున్నాయని, ఫలితంగా అనుభవం లేని టెక్ కన్సల్టెన్సీలు దేశంలో కుటుంబాలతో సహా ప్రవేశించాయని అసంతృప్తి వ్యక్తంచేశారు.

నిపుణులైన కార్మికులు మాత్రమే దేశంలోకి వచ్చేలా అమెరికా ప్రభుత్వం ప్రతిపాదనలు సిద్ధం చేస్తోందని ఇప్పటికే వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. హెచ్–1బీ కోసం ప్రస్తుతమున్న లాటరీ విధానాన్ని మార్చాలని డిపార్ట్మెంట్ ఆఫ్ హోంల్యాండ్ సెక్యూరిటీ భావిస్తోంది. అధిక నైపుణ్యం కలిగిన విదేశీయులను మాత్రమే అనుమతించడం, అమెరికన్లకు ప్రాధాన్యం కల్పించే ఉద్దేశంతో వీటిని రూపొందించినట్లు తెలుస్తోంది. ఉద్యోగి వేతనస్థాయిని అనుసరించి రిజిస్ట్రేషన్‌లో ప్రాధాన్యం కల్పించడం, వేతన వర్గీకరణ (ఒకటి నుంచి నాలుగు) ఆధారంగా దరఖాస్తులను విభజించడం వంటి చర్యలు తీసుకోనున్నారు.

వీసాలపై అమెరికా కాంగ్రెస్‌లో మరో బిల్లు..

హెచ్–1బీ, ఎల్–1 వీసాలను సంస్కరించాలని, విదేశీ ఉద్యోగుల నియామకం విషయంలో కఠిన నిబంధనలు ఉండాలని పలువురు యూఎస్ సెనెటర్లు డిమాండ్ చేస్తున్నారు. ఈమేరకు సెనెటర్లు చక్ గ్రాస్లీ, డిక్ డర్బిన్ బిల్లును ప్రవేశపెట్టారు. కార్పొరేట్ దుర్వినియోగాన్ని అరికట్టి అమెరికా ఉద్యోగులను రక్షించడమే లక్ష్యమని ఈసందర్భంగా వారు వెల్లడించారు.

# కుప్పకూలిన పాఠశాల భవనం

**- ఇండోనేసియాలో ఘోర దుర్ఘటన**

**- శిథిలాలకింద పదుల సంఖ్యలో పిల్లలు**



ఇండోనేసియాలో నిర్మాణంలో ఉన్న పాఠశాల భవనం కుప్పకూలింది. ఈ ఘటనలో ఓ విద్యార్థి ప్రాణాలు కోల్పోగా.. దాదాపు 65మంది విద్యార్థులు శిథిలాల్లో చిక్కుకున్నారు. అంతర్జాతీయ మీడియా వర్గాలు తెలిపిన వివరాల ప్రకారం.. జావాలోని సిడోర్జో పట్టణంలో నిర్మాణంలో ఉన్న బహుళ అంతస్తుల ఇస్లామిక్ పాఠశాల భవనం సోమవారం కుప్పకూలింది. మధ్యాహ్న సమయంలో భారీ సంఖ్యలో విద్యార్థులు పాఠశాల భవనంలో ప్రార్థనల కోసం గుమిగూడారు. అదే సమయంలో భవనం కూలిపోవడంతో స్థానికులు 79మంది విద్యార్థులను కాపాడారు. ఇంకా దాదాపు 65మంది విద్యార్థులు శిథిలాల కింద చిక్కుకున్నట్టు భావిస్తున్నారు. విద్యార్థులంతా 12నుంచి 17 ఏళ్లలోపు ఉన్నట్లు తెలిపారు. ఘటనా స్థలంలో విద్యార్థుల కుటుంబాల రోదనలు మిన్నంటాయి. సంఘటనా స్థలంలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయని అధికారులు తెలిపారు. శిథిలాలలో చిక్కుకొన్న విద్యార్థుల సంఖ్యను నిర్ధరించడానికి పోలీసులు పాఠశాల అధికారుల సాయం తీసుకుంటున్నట్టు సమాచారం. మూడు అంతస్తుల భవనంపై నాలుగో అంతస్తును నిర్మిస్తున్నట్టు అధికారులు తెలిపారు. దీని నిర్మాణానికి మూడో అంతస్తులో భారీగా కాంక్రీటు వేయడంతో భవనం కూలిపోయి ఉంటుందని అధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. రెండు అంతస్తుల్లో తరగతులు నిర్వహిస్తుండగా.. కింది అంతస్తును ప్రార్థనా మందిరంగా వాడుతున్నట్టు పాఠశాల యాజమాన్యం వెల్లడించింది. ప్రమాదంలో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశమున్నట్లు తెలిపారు.

## గాంధీ విగ్రహంపై పిచ్చిరాతలు

**లండన్‌లో జాత్యాహంకారుల దారుణం**



లండన్‌లో జాత్యహంకారులు రెచ్చిపోయారు. మహాత్మాగాంధీ విగ్రహం వద్ద పిచ్చి రాతలు రాశారు. గాంధీ జయంతి వేడుకలకు కొన్ని రోజులముందు ఇది చోటుచేసుకోవడం గమనార్హం. లండన్‌లోని టావిస్టాక్ స్క్వేర్ వద్ద ధ్యానం చేస్తున్నట్లుగా మహాత్మాగాంధీ విగ్రహం ఉంది. అక్టోబరు 2న గాంధీ జయంతి నేపథ్యంలో ఇక్కడ వేడుకలు జరగనున్నాయి. ఈ క్రమంలో అక్కడి జాత్యహంకారులు గాంధీ విగ్రహంపై భారత వ్యతిరేక రాతలు రాశారు. ఈ ఘటనను అక్కడి భారత రాయబార కార్యాలయం తీవ్రంగా ఖండించింది. ఈ చర్యను సిగ్గుచేటుగా అభివర్ణించింది. ‘లండన్‌లోని టావిస్టాక్ స్క్వేర్లోని మహాత్మాగాంధీ విగ్రహం వద్ద జరిగిన చర్య సిగ్గుచేటు. దీన్ని మేం తీవ్రంగా ఖండిస్తు న్నాం. అహింసా దినోత్సవానికి కొన్ని రోజుల ముందు జరిగిన ఈ ఘటన కేవలం విధ్వంసం మాత్రమే కాదు. మహా త్ముడి వారసత్వంపై జరిగిన హింసాత్మక దాడి, దీనిపై తక్షణ చర్యలు తీసుకోవాలని స్థానిక అధికారులను కోరుతున్నాం’ అని కార్యాలయం ఓ ప్రకటనలో పేర్కొంది. ఈసందర్భంగా విగ్రహ గౌరవం పునరుద్ధరణపై చర్యలు చేపట్టినట్లు వెల్లడిం చింది. కాగా.. ఈ ఘటనపై చర్యలు ప్రారంభించామని స్థానిక మెట్రోపాలిటన్ పోలీసులు పేర్కొన్నారు.

**ఫ్రాంటియర్ కోర్ టార్గెట్‌గా..**

## పాక్‌లో భారీ పేలుడు

**13మంది మృత్యువాత, 32మందికి గాయాలు**



పాకిస్థాన్‌లోని క్వెట్టా ప్రాంతం భారీ పేలుడుతో దద్దరిల్లింది. అక్కడే కాల్పుల మోత వినిపించింది. ఫ్రాంటియర్ కోర్ కేంద్రకార్యాలయం సమీపంలో ఈ ఘటనలు చోటుచేసుకున్నాయి. భద్రతాసిబ్బంది లక్ష్యంగా దాడి జరిగినట్టు తెలుస్తోంది. స్థానిక మీడియా కథనాల ప్రకారం... బలోచిస్థాన్‌లోని క్వెట్టా నగరంలో పారామిలిటరీ బలగాలకు చెందిన ఫ్రాంటియర్ కోర్ కేంద్ర కార్యాలయం సమీపంలో పేలుళ్ల ఘటన జరిగింది. దాంతో దాని చుట్టుపక్కల ప్రాంతాల్లోని ఇళు ్ల, భవనాల కిటికీ అద్దాలు పగిలిపోయాయి. అప్పటికే ఆందోళన చెందుతున్న ప్రజలకు కాల్పుల మోత వినిపించింది. ఈ వరుస ఘటనలు స్థానికంగా తీవ్ర కలకలం సృష్టించాయి. దాడులకు పాల్పడిన వారిని గుర్తించేందుకు బలగాలు గాలింపు చేపట్టాయి. అత్యంత తీవ్రతతో జరిగిన పేలుడుకు గల కారణాలపై దర్యాప్తు జరుగుతోంది. క్షతగాత్రులను వెంటనే దగ్గర్లోని ఆసుపత్రులకు తరలించారు. దాంతో ఆ చుట్టుపక్కల ప్రాంతాల్లో అత్యవసర పరిస్థితిని విధించారు. ఈ ఘటనలో ఇప్పటివరకు 13మంది ప్రాణాలు కోల్పోయినట్టు సమాచారం ఈ ఘటనలో 32 మంది గాయపడ్డారు. ఈ నెల ప్రారంభంలో క్వెట్టాలో బలోచిస్థాన్ నేషనల్ పార్టీ వ్యవస్థాపకుడు అతావుల్లా మెంగల్ వర్ధంతి నేపథ్యంలో కూడా ఆత్మాహుతి దాడి జరిగింది. ఆ ఘటనలో 11మంది మరణించగా, సుమారు 18 మంది గాయపడ్డారు.



## మహిళల వన్డే ప్రపంచ కప్..

# భారత్ శుభారంభం

**- 59 పరుగుల తేడాతో శ్రీలంకపై విజయం**
**- బ్యాటింగ్‌లో అమన్‌జ్యోత్, దీప్తిశర్మ మెరుపులు**

మహిళల క్రికెట్లో అత్యున్నత టోర్నీ వన్డే ప్రపంచకప్‌లో భారత మహిళల జట్టు శుభారంభం చేసింది. మంగళవారం గువాహటిలోని బర్సపారా స్టేడియంలో జరిగిన తొలిమ్యాచ్‌లో శ్రీలంకను పరుగుల తేడాతో ఓడించింది. భారత్ బ్యాటింగ్ చేస్తుండగా వరుణుడు ఆటంకం కలిగించడంతో ఆటను 47 ఓవర్లకు కుదించారు.

భారత్ 269 పరుగులు చేయగా డీఎల్ఎస్ విధానం ప్రకారం శ్రీలంక లక్ష్యాన్ని 271 పరుగులుగా నిర్ధారించారు. ఈ లక్ష్య ఛేదనలోశ్రీలంక 44.5 ఓవర్ల 211 చేసి ఆలౌట్ అయ్యింది. బౌలింగ్‌లో స్నేహ్ రాణా 2, శ్రీ చరణి 2, క్రాంతి గౌడ్, అమన్ జ్యోత్, ప్రతీకా రావల్ ఒక్కో వికెట్ పడగొట్టారు.

టాస్ ఓడి బ్యాటింగ్‌కు టీమిండియా నిర్ణీత 47 ఓవర్లలో ఎనిమిది వికెట్ల నష్టానికి 269 పరుగులు చేసింది. ఒక దశలో 124 పరుగులకే ఆరు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడగా.. అమన్ జ్యోత్ కౌర్ (57, 56 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్), దీప్తి శర్మ (53: 53 బంతుల్లో 3 ఫోర్లు) జట్టును ఆదుకున్నారు. హర్లీన్ డియోల్ (48: 64 బంతుల్లో 6 ఫోర్లు), ప్రతీకా రావల్ (37: 59 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. హర్మన్ ప్రీత్ కౌర్ (21) ఎక్కువసేపు క్రీజులో నిలవలేకపోయింది. స్మృతి మంధాన (8), జెమీమా రోడ్రిగ్స్ (0), రిచా ఘోష్ (2) నిరాశపర్చారు. లంక స్పిన్నర్ ఇనోక రణవీర ఒకే ఓవర్లో హర్లీన్, జెమీమా, హర్మన్ ప్రీత్‌ను పెవిలియన్‌కు పంపి భారత్‌కు గట్టి షాక్ ఇచ్చింది. ఈ క్రమంలో క్రీజులోకి వచ్చిన అమన్ జ్యోత్, దీప్తి జట్టును ఆదుకున్నారు. వీరు ఏడో వికెట్‌కు 103 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. ఆఖర్లో స్నేహ్ రాణా (28 నాటౌట్ 15 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్సులు) దూకుడుగా ఆడింది. శ్రీలంక బౌలర్లలో ఇనోకా రణవీర (4/46) రాణించింది. ఉదేశిక ప్రబోధని 2, చమరి ఆటపట్టు, కులసూర్య ఒక్కో వికెట్ తీశారు.

## ఆస్ట్రేలియాతో వన్డేలకు హార్దిక్ దూరం?



త్వరలో ఆస్ట్రేలియాతో జరగనున్న వన్డే సిరీస్‌కు టీమిండియా ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్య దూరమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఆసియా కప్ గెలిచి జోష్ మీదున్న టీమిండియా.. అక్టోబర్ 19 నుంచి ఆస్ట్రేలియాలో పర్యటించనుంది. ఇందులో భాగంగా మూడు వన్డేలు, అయిదు టీ20 మ్యాచ్‌లు ఆడనుంది. టీ20 మ్యాచ్‌లు అక్టోబర్ 29 నుంచి నవంబర్ 8 వరకు జరగనున్నాయి. అయితే అంతకు ముందు జరిగే 19 నుంచి 25 వరకు జరిగే మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌కు హార్దిక్ పాండ్యదూరం కానున్నట్లు తెలుస్తోంది. ఆసియా కప్‌లో గాయపడిన పాండ్య.. ఫైనల్లో పాకిస్థాన్‌తో జరిగిన మ్యాచ్‌లోనూ ఆడని విషయం తెలిసిందే. ఎడమ కాలి తొడ కండరానికి గాయం కావడం వల్ల పాండ్య ప్రస్తుతం పూర్తి ఫిట్‌గా లేడు. అతడు కోలుకోవడానికి దాదాపు నాలుగు వారాల సమయం పట్టొచ్చనే వార్తలు వినిపిస్తున్నాయి. ఆస్ట్రేలియాతో అయిదు టీ20ల సిరీస్‌లో మాత్రం ఆడే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. అయితే ఈవిషయమై ఇప్పటివరకైతే ఎలాంటి అధికారిక సమాచారమూ వెలువడలేదు. ఆసియా కప్ లో టీమ్ ఇండియా విజయంలో హార్దిక్ పాండ్య కీలకపాత్ర పోషించాడు. జస్ప్రీత్ బుమ్రాతో కలిసి కొత్త బంతిని పంచుకున్నాడు. అలాగే మిడిల్‌ఆర్డర్లో బ్యాటింగ్ లోనూ కీలకమైన పరుగులు చేశాడు. అయితే సూపర్ 4లో శ్రీలంకతో మ్యాచ్ సందర్భంగా అతడు గాయానికి గురయ్యాడు. దీంతో అతడు ఆ మ్యాచ్లో కేవలం ఒక ఓవర్ మాత్రమే బౌలింగ్ చేశాడు. తర్వాత మైదానాన్ని వీడాడు. తాను సంధించిన ఆరు బంతుల్లోనే ఒక వికెట్ తీసుకున్నాడు. చివరికి ఆ మ్యాచ్ సూపర్ ఓవర్ వరకు వెళ్లి, భారత్ విజేతగా నిలిచిన విషయం తెలిసిందే.

అయితే ఈ ఆస్ట్రేలియా టూర్ తోనే టీమ్ ఇండియా స్టార్ బ్యాటర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి వన్డేల్లో పునరాగమనం చేసే అవకాశాలు ఉన్నాయి. వీరిద్దరూ ఇప్పటికే టీ20లు, టెస్ట్ క్రికెట్ కు తమ రిటైర్మెంట్ ప్రకటించిన విషయం తెలిసిందే.

## పాక్ ఆటగాళ్లకు బ్యాట్‌తోనే బదులిచ్చాం..

మైదానంలో పాకిస్థాన్ ఆటగాళ్ల దూషణలకు బ్యాట్‌తోనే సమాధానం ఇచ్చామని ఆసియా కప్ హీరో తిలక్ వర్మ అన్నాడు. హైదరాబాద్.. లింగంపల్లిలోని లేగల గ్రౌండ్‌ను మంగళవారం తిలక్‌వర్మ సందర్శించి అక్కడ శిక్షణ పొందుతున్న ఆటగాళ్లతో కరచాలనం చేశాడు. అతడిని చూడడానికి పెద్దసంఖ్యలో అభిమానులు అక్కడికి చేరుకున్నారు. అనంతరం విలేకరులు అడిగిన ప్రశ్నలకు అతడు తెలుగు, హిందీ, ఇంగ్లీష్ మూడు భాషల్లోనూ సమాధానం ఇచ్చాడు. ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో భారత్, పాక్ మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ సందర్భంగా ఆసియా కప్‌లో టీమిండియా, పాకిస్థాన్ మూడుసార్లు తలపడ్డాయి. మొదటి రెండు మ్యాచుల్లో కంటే ఫైనల్లో పరిస్థితి కాస్త ఉద్రిక్తంగా కనిపించిందన్నాడు.



పాకిస్థాన్‌లో ఫైనల్ మ్యాచ్‌లో టీమిండియా ఆరంభంలోనే మూడు వికెట్లు కోల్పోయింది. దీంతో మేం కాస్త ఒత్తిడికి గురయ్యాం. అదే సమయంలో పాక్ ఆటగాళ్లు ఇదే అదునుగా మాపైకి వచ్చారు. వారు భారీఎత్తున స్లెడ్జింగ్‌కు దిగారు. మైదానంలో జరిగిన సంభాషణలు ఇక్కడ చెప్పడం సమంజసం కాదు. ఆ సమయంలో మేం ఉద్రేకానికి గురికాలేదు. సంయమనం పాటించాం. ఎందుకంటే టీమ్ ఇండియా మ్యాచ్ గెలవడమే ముఖ్యం. అనవసరంగా ఆవేశానికి గురై.. ఏదైనా చెడ్డ షాట్ ఆడితే వికెట్ కోల్పోయే ప్రమాదం ఉంటుంది. అందుకే వారికి మ్యాచ్ మధ్యలో సమాధానం ఇవ్వకుండా.. మ్యాచ్ పూర్తయ్యాకే విజయంతో జవాబు చెప్పామని తిలక్ వర్మ అన్నాడు.

తను సాధించిన రెండు సెంచరీలకంటే కూడా, ఆసియా కప్ ఫైనల్లో పాకిస్థాన్ మీద ఆడిన ఇన్నింగ్సే తనకు ఫేవరెట్ అన్నాడు. తనను తీర్చిదిద్దిన చిన్ననాటి కోచ్ సలాంకు ఎప్పటికీ రుణపడి ఉంటానని పేర్కొన్నాడు. విరాట్ కోహ్లి, సచిన్ తెందూల్కర్‌ల మాదిరిగా తాను కూడా కోచ్‌కు గౌరవ మర్యాదలు ఇస్తా అన్నాడు. అలాగే.. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్, బీసీసీఐకు కృతజ్ఞతలు తెలిపాడు.

## తిలక్‌వర్మకు పాక్ మాజీ క్రికెటర్ ప్రశంసలు



ఆసియా కప్ ఫైనల్ మ్యాచ్లో టీమిండియా యువ బ్యాటర్ తిలక్ వర్మ అద్భుతంగా బ్యాటింగ్ చేశాడని పాకిస్థాన్ మాజీ క్రికెటర్ మహ్మద్ అమీర్ కొనియాడాడు. అతడు ఒత్తిడిలోనూ చక్కగా రాణించాడన్నాడు. భారత జట్టు టాప్ ఆర్డర్ విఫలమైన వేళ తిలక్ తన బ్యాటింగ్ తో టీమ్ ఇండియాకు ఆసియా కప్‌ను అందించాడని విశ్లేషించాడు. అలాగే తుదిపోరులో తమ జట్టు పరాజయం పాలవడంపైనా స్పందించాడు. తిలక్ వర్మను చూడండి.. అతడికి ఆట మీద మంచి అవగాహన ఉంది. పాకిస్థాన్ బ్యాటర్లు ఇంకా నేర్చుకోవాల్సింది చాలా ఉంది. ఎప్పుడు ఏ షాట్ ఆడాలో వారికి ఇంకా పూర్తిగా తెలియడం లేదు. తిలక్ స్మార్ట్ క్రికెట్ ఆడాడు. భాగస్వామ్యాలు నమోదు చేశాడు. అనవసర షాట్లకు పోకుండా.. అవసరమున్నప్పుడు సింగిల్స్ తో స్ట్రైక్ రొటేట్ చేశాడు. మ్యాచుల్లో విజయం సాధించాలంటే ఇలా బాధ్యతాయుతంగా ఆడాలని మహ్మద్ అమీర్ అన్నాడు. అలాగే పాకిస్థాన్ జట్టు ప్రణాళిక లోపాన్ని ఎత్తి చూపాడు. 'పాకిస్థాన్ ఈ మ్యాచ్‌కు కచ్చితంగా గెలిచి ఉండాల్సింది. పాక్ జట్టు ప్రణాళిక సరిగ్గా లేదు. కొత్త బ్యాటర్లు క్రీజులోకి వచ్చీరాగానే పెద్ద షాట్లు ఆడేందుకు ప్రయత్నించారు. వికెట్ కాపాడుకుందామనే ఆలోచనే చేయలేదు. ఏ సమయంలో ఎలా ఆడాలో అన్న స్పృహ ఉండాలి. మొదటి పది ఓవర్లలో చక్కగా పరుగులు వస్తాయి. కానీ చివరి పది ఓవర్లలో అంత తేలిగ్గా రన్స్ రావు. ఎందుకంటే అప్పటికి బంతి మెత్తబడిపోతుంది. బ్యాట్ మీదకు అంత తేలిగ్గా బంతి రాదు. దీంతో కొత్త బ్యాటర్‌కు పరుగులు చేయడం కష్టమవుతుంది. ఆ సమయంలో కేవలం క్రీజులో పాతుకుపోయిన బ్యాటర్ మాత్రమే ప్రభావం చూపగలడు' అని మహ్మద్ అమీర్ విశ్లేషించాడు.

## మ్యాక్స్‌వెల్‌కు గాయం.. కివీస్‌తో టీ20లకు దూరం

**- భారత్‌తో సిరీస్‌కూ అనుమానమే**



ఆస్ట్రేలియా ఆల్‌రౌండర్ గ్లెన్ మ్యాక్స్‌వెల్ న్యూజిలాండ్‌తో జరగనున్న టీ20 సిరీస్‌కు ముందు గాయపడి జట్టుకు దూరమయ్యాడు. నెట్స్ ప్రాక్టీస్ సెషన్లో మిచెల్ ఓవెన్ కొట్టిన బంతి మ్యాక్స్‌వెల్ ముంజేతిని బలంగా తాకడంతో అతని ఎముక విరిగింది. ఈ నేపథ్యంలో అతడు న్యూజిలాండ్‌తో జరగబోయే టీ20 సిరీస్‌కు దూరమయ్యాడు. అలాగే టీమిండియాతో త్వరలో జరగనున్న అయిదు టీ20 మ్యాచ్‌ల సిరీస్‌కు కూడా ఈ గాయం వల్ల దూరం కానున్నట్లు తెలుస్తోంది. న్యూజిలాండ్‌తో టీ20 సిరీస్‌కు మ్యాక్స్‌వెల్ స్థానంలో జోష్ ఫిలిప్ ఆడనున్నాడు. అలెక్స్ కారీ బ్యాకప్ వికెట్ కీపర్ పాత్రను పోషించనున్నాడు.

ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌ల మధ్య మూడు టీ20ల సిరీస్ అక్టోబర్ 1 నుంచి ప్రారంభం కానుంది. 1, 3, 4 తేదీల్లో మౌంట్ మౌంగనుయ్ వేదికగా టీ20 మ్యాచ్‌లు జరగనున్నాయి. అలాగే టీమ్ ఇండియా అక్టోబర్ 19 నుంచి ఆస్ట్రేలియాలో పర్యటించనుంది. ఇందులో భాగంగా మూడు వన్డేలు, అయిదు టీ20 మ్యాచ్లు జరగనున్నాయి. అక్టోబర్ 25 నుంచి టీ20 మ్యాచ్‌లు ప్రారంభం కానున్నాయి.

# రెండూ భిన్న కథలు.. పోటీగా చూడకూడదు

దసరా ఎంటర్‌టైన్‌మెంట్ అందించేందుకు ఇండస్ట్రీ సిద్ధమైంది. అక్టోబర్ 2న రిషబ్‌శెట్టి 'కాంతార చాప్టర్ 1', 'సన్నీ సంస్కారి కీ తులసి కుమారి' రెండూ విడుదల కానున్నాయి. దీంతో బాక్సాఫీస్ వద్ద పోటీ నెలకొననుంది. సన్నీ సంస్కారి కీ తులసి కుమారి'లో ప్రధానపాత్రలో నటించిన జాన్వీకపూర్, టీమ్ సభ్యులు వివరణ ఇచ్చారు. ఈ పోటీ గురించి జాన్వీ మాట్లాడుతూ.. "ఈ రెండు భిన్నమైన కథాంశాలతో తెరకెక్కాయి. ఈరెండింటి మధ్య పోటీని చూడడమంటే. ఓపెన్ హైమర్, బార్బీలను పోల్చడమే. 'కాంతార' భారీ బడ్జెట్‌తో రూపొందింది. మా చిత్రం ఫ్యామిలీ ఎంటర్టైనర్. ఇవి ఒకే తరహా చిత్రాలు కాదు.. వీటి మధ్య ఎలాంటి పోటీ ఉండదు" అని అన్నారు. ఇక వరుణ్ ధావన్ కూడా ఈ విషయం గురించి ప్రస్తావించారు. "ఇప్పటికే మా సినిమాను చాలాసార్లు వాయిదా వేశాం. టీమ్ అందరం దీని కోసం కష్టపడ్డాం. కనీసం కొన్ని వారాలపాటు ఇది ప్రేక్షకాదరణను సొంతం చేసుకుంటుందని మాకు నమ్మకం





ఉంది. ఇప్పుడు కుదరకపోతే మేం దీన్ని దీపావళికి విడుదల చేయాలి. ఆ సమయంలోనూ పెద్ద సినిమాలు ఉంటాయి. అందుకే గాంధీ జయంతి, దసరా సందర్భంగా విడుదల చేస్తున్నాం. ఈ విడుదల తేదీ విషయంలో నటీనటుల ప్రమేయం ఏమీ ఉండదు. ఇది నిర్మాణ సంస్థ తీసుకున్న నిర్ణయం.

గతంలో ఒకే తేదీకి రెండు సినిమాలు విడుదలైన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. అలానే ఈ రెండూ కూడా ఆదరణ సొంతం చేసుకుంటాయి" అని అన్నారు..

జాన్వీ కపూర్, వరుణ్ ధావన్ ప్రధానపాత్రల్లో నటించిన ఈ చిత్రానికి శశాంక్ ఖైతాన్ దర్శకత్వం వహించారు. ఓ యువ జోడీ ప్రేమ ప్రయాణం నేపథ్యంలో ఇది రూపొందింది. ఇక 'కాంతార: చాప్టర్1' విషయానికొస్తే.. 2022లో విడుదలై విజయాన్ని సొంతం చేసుకున్న 'కాంతార'కు ప్రీక్వెల్‌గా రిషబ్‌శెట్టి స్వీయ దర్శకత్వంలో రూపొందింది.



## క్రైం థ్రిల్లర్ టీజర్‌తో విష్ణువిశాల్

కోలీవుడ్ నటుడు విష్ణు విశాల్ ప్రధాన పాత్రలో రూపొందుతున్న క్రైమ్ థ్రిల్లర్ మూవీ 'ఆర్యన్'. శ్రద్ధా శ్రీనాథ్, మానస చౌదరి కీలక పాత్రలు పోషిస్తున్నారు. ప్రవీణ్ కె దర్శకత్వం వహిస్తున్నారు. అక్టోబరు 31న సినిమా ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా టీజర్‌ని మంగళవారం విడుదల చేశారు. ఈ చిత్రంలో విష్ణు విశాల్ పవర్‌ఫుల్ పోలీసు అధికారిగా నటిస్తున్నారు.



## ఫ్యాన్స్‌కు మంచి విందు

ఓజీతో ఫ్యాన్స్‌కు పవన్ కళ్యాణ్ మంచి ఫీస్ట్ ఇచ్చాడని అగ్రహీరో చిరంజీవి వ్యాఖ్యానించారు. సినిమాను మెగా కుటుంబంతో కలిసి వీక్షించిన అనంతరం చిరంజీవి ఈ సినిమాపై రివ్యూ ఇచ్చారు. "నా కుటుంబంతో కలిసి ఓజీ చూశాను. చిత్రంలోని ప్రతి అంశాన్నీ ఆస్వాదించాను. హాలీవుడ్ ప్రమాణాలకు తగినట్టు సినిమాను అద్భుతంగా నిర్మించారు. అండర్ వరల్డ్ గ్యాంగ్‌స్టర్ చిత్రమిది. భావోద్వేగాలకు లోటులేకుండా.. ఓపెనింగ్ నుంచి క్లైమాక్స్ వరకూ ప్రతి సన్నివేశాన్ని దర్శకుడు సుజీత్ అసాధారణరీతిలో రూపొందించాడు. పవన్ కలాణ్‌ను తెరపై ఇలా చూడడం గర్వంగా అనిపించింది. తన ప్రత్యేక ఆకర్షణతో సినిమాను నిలబెట్టాడు. తమన్ ఈ చిత్రానికి ఆత్మతో సమానం. విజువల్స్ అద్భుతంగా ఉన్నాయి.

చిత్రబృందానికి నా అభినందనలు" అని చిరు తన పోస్టులో రాసుకొచ్చారు. ఇక సినిమా విడుదలైన రోజుకూడా చిరంజీవి పోస్ట్ పెట్టిన విషయం తెలిసిందే. పవన్ కల్యాణ్‌ను అందరూ 'ఓజాస్ గంభీర'గా సెలబ్రేట్ చేసుకుంటుంటే ఎంతో ఆనందంగా ఉందన్నారు. తమన్ సంగీతం అద్భుతంగా ఉందంటూ శుభాకాంక్షలు తెలిపారు.

### ఓజీలో కొత్త ట్రీట్..

ఓజి థియేటర్స్‌లో కొత్త ట్రీట్ ఉండనున్నట్టు తెలుస్తుంది. యంగ్ బ్యూటీ నేహా శెట్టిపై ప్లాన్ చేసిన స్పెషల్ సాంగ్ తాజాగా యాడ్ చేసినట్టు సమాచారం. నిజానికి సోమవారం నుంచే అనుకున్నారు కానీ క్యూబ్‌లో కంటెంట్ అప్‌లోడ్ చేయడం కొంచెం ఆలస్యమయ్యేసరికి తరువాతి షోస్‌కి పోస్టుపోన్ చేశారు. సో, ఇప్పుడు చూసేవాళ్లు ఓజి థియేటర్స్‌లో కొత్త ట్రీట్ ఎంజాయ్ చేయొచ్చు. అయితే, అఫీషియల్‌గా అనౌన్స్ చేయాల్సి ఉంది.

## భద్రకాళిలో శుక్రాచార్యుడిగా..

దర్శకుడు ప్రశాంతవర్మ సినిమాటిక్ యూనివర్స్ (పీవీసీయూ) నుంచి వచ్చిన తొలి సినిమా 'హనుమాన్. గతేడాది సంక్రాంతికి విడుదలైన చిత్రం పాన్‌ఇండియా స్థాయిలో సత్తా చాటుకుంది. దీంతో ప్రశాంత్ తన సినిమాటిక్ యూనివర్స్ నుంచి వరుస ప్రాజెక్టులు విడుదల చేయనున్నారు. ఇందులోభాగంగా రానున్న మూడో సినిమా 'మహాకాళి'. ఫీమేల్ సూపర్ హీరో చిత్రంగా ముస్తాబు కానుంది. దీనికి ప్రశాంత్ వర్మ కథ అందిస్తుండగా.. పూజ అపర్ణ కొల్లూరు దర్శకత్వం వహించనున్నారు. తాజాగా దీనికి సంబంధించిన అప్డేట్‌ను దర్శకుడు పంచుకున్నారు. ఇందులో బాలీవుడ్ నటుడు అక్షయ్ ఖన్నా శుక్రాచార్యుడిగా నటించనున్నట్టు తెలిపారు. "దేవతల నీడలో కాంతివంతమైన తిరుగుబాటు జ్వాలగా ఎదిగిన శుక్రాచార్యుడు..' అంటూ ఓ పోస్టర్‌ను పంచుకున్నారు. గతంలో ఈ 'మహాకాళి' గురించి ప్రశాంత్ వర్మ మాట్లాడుతూ.. "మా యూనివర్స్‌కు కొత్త శక్తి జోడైంది. అత్యంత భయంకరమైన చెడుపై యుద్ధం చేయడానికి కాళికాదేవి స్వరూపం




రానుంది. సూపర్ హీరోలు ఎలా ఉంటారో ఈ చిత్రంలో చూపించనున్నాం" అని అన్నారు. ఇక ఈ యూనివర్స్‌లో భాగంగా ఇటీవల 'అధీర'ను ప్రకటించారు. ఎస్‌జే సూర్య, కల్యాణ్ దాసరి ప్రధాన పాత్రల్లో నటిస్తున్నట్టు తెలిపారు. ఈ సూపర్ హీరో ఫిల్మ్‌కు శరణ్ కొప్పిశెట్టి దర్శకత్వం వహించనున్నారు.

## షూట్‌కు సిద్ధమవుతున్న మమ్ముట్టి..


మలయాళ అగ్ర కథానాయకుడు మమ్ముట్టి పూర్తిగా కోలుకున్నారు. తిరిగి షూటింగ్‌లో పాల్గొనేందుకు సిద్ధమయ్యారు. ఈ విషయాన్ని 'పేట్రియాట్' దర్శకుడు వెల్లడించారు. ఆయన కోలుకున్నందుకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఇన్నినెలలుగా ఆయన విరామం తీసుకున్నప్పటికీ సినిమా షూటింగ్స్‌పై ప్రభావం పడలేదన్నారు. మహేశ్ నారాయణన్ దర్శకత్వం వహిస్తోన్న 'పేట్రియాట్'లో మమ్ముట్టి, మోహన్ లాల్, ఫహాద్ ఫాజిల్ కీలక పాత్రల్లో కనిపించనున్న విషయం తెలిసిందే. ఈ సినిమా షూటింగ్ ప్రారంభమయ్యాక మమ్ముట్టి ఆరోగ్య సమస్య కారణంగా కొన్ని రోజులు షూటింగ్‌కు బ్రేక్ ఇచ్చి విశ్రాంతి తీసుకున్నారు. తాజాగా ఆయన హెల్త్‌పై దర్శకుడు అప్డేట్ ఇచ్చారు. "అక్టోబర్ 1నుంచి ఆయన సెట్స్‌లోకి రానున్నారు. మా ఆనందాన్ని మాటల్లో చెప్పలేం. ఆయన రెస్ట్ తీసుకుంటూ కూడా సినిమా గురించే



ఆలోచించేవారు. నేను ప్రతిరోజూ షూటింగ్ అప్డేట్ ఇచ్చాను. ఆయన లోకేషన్‌లో లేకపోయినప్పటికీ షూటింగ్‌లో పాల్గొంటూనే ఉన్నారు" అని చెప్పారు. ఈ ఏడాది జూన్‌లో ఆయన అనారోగ్యానికి గురయ్యారంటూ వార్తలు వచ్చాయి. దీంతో అభిమానులు ఆందోళనకు గురయ్యారు. ఆయా కథనాలను ఆయన టీమ్ కొట్టి పారేసింది. దీనిపై ఆయన స్నేహితుడు క్లారిటీ ఇచ్చారు. ఆరోగ్యం బాగా లేదన్నమాట వాస్తవమే కానీ.. అది చాలా చిన్న సమస్య అన్నారు.

## ఈడీ విచారణకు ఊర్వశి

సినీనటి ఊర్వశి రౌతేలా ఈడీ విచారణకు హాజరయ్యారు. నిషేధిత బెట్టింగ్ యాప్‌లకు ప్రచారం చేసిన వ్యవహారంలో విచారణకు హాజరుకావాలని ఈ నెల 15న ఆమెకు ఈడీ సమన్లు జారీచేసింది. ఈ నేపథ్యంలో ఆమె మంగళవారం ఢిల్లీలోని దర్యాప్తు సంస్థ కార్యాలయానికి వెళ్లారు. బెట్టింగ్ యాప్‌లకు ప్రచారం,వాటితో ఆమెకున్న సంబంధం, తీసుకున్న పేమెంట్స్ తదితర అంశాలపై అధికారులు ఆమెను ప్రశ్నించినట్టు సమాచారం. ఇప్పటికే ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్ కేసులో ఈడీ సినీ ప్రముఖులను, క్రికెటర్లను విచారించిన సంగతి తెలిసిందే. మంచు లక్ష్మి, సురేశ్ రైనా, రానా, సోనూసూద్ ఇటీవల ఈ కేసులో విచారణకు హాజరయ్యారు.



## మహేష్.. డూప్‌లేకుండానే...

మహేష్ బాబు హీరోగా దర్శకుడు ఎస్ఎస్ రాజమౌళి కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న పాన్ ఇండియా చిత్రం ఎస్ఎస్ఎంబీ-29. ప్రపంచవ్యాప్తంగా హైప్‌వున్న సినిమా కోసం అభిమానులు ఆతృతగా ఎదురు చూస్తుండగా.. మేకర్స్ సినిమా షూటింగ్ శరవేగంగా.. అంతే సైలెంట్‌గా భారీ షెడ్యూల్స్‌తో కానిచ్చేస్తున్నారు. అయితే సినిమాపట్ల మహేష్‌బాబు డెడికేషన్‌పై ఇండస్ట్రీలో ఆసక్తికరమైన టాక్ వినిపిస్తోంది. సినిమా కోసం మహేష్ బాబు ఎలాంటి డూప్‌ని వాడట్లేదట. ఎలాంటి రిస్క్ అయినా తానే తీసుకుంటూ సినిమా షూటింగ్ పూర్తి చేస్తున్నట్టు తెలుస్తుంది. మహేష్‌బాబు డెడికేషన్ చూసి జక్కన్న కూడా సర్‌ప్రైజ్ అవుతున్నాడన్న టాక్ వినిపిస్తోంది. మహేష్ బాబు, రాజమౌళిల ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ నుంచి బిగ్ రివీల్ నవంబర్‌లో ప్లాన్ చేసిన సంగతి తెలిసిందే. దీనికోసం వరల్డ్ వైడ్ ఆడియెన్స్ ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

